సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 124

మంగళవారం 25-7-2023



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



రికార్డు సృష్టించింది!

127 గంటల సేపు నాట్యం చేసి గిన్నిస్ రికార్డు సాధించిన సృష్టి -11లో



అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు

సూచీలకు రెండోరోజూ నష్టాలే. సెన్సెక్స్ నష్టం 299 పాయింట్లు -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆరని మంటలు

మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే సమాధానం ఇవ్వాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి.

వివరాలు 6లో ▸



రేడియో కాలర్ల తొలగింపు

మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఉన్న చీతాల్లో ఆరింటికి రేడియో కాలర్లను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸



మరో సవాలుకు ఇస్రో సన్నద్ధం

సింగపూర్‌కు చెందిన సమాచార ఉపగ్రహం సింథటిక్ అపర్చర్ రాడార్‌ను అంతరిక్షంలోకి పంపనున్న ఇస్రో.

వివరాలు 6లో ▸



2050 కల్లా 130 కోట్లకు..

ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి 130 కోట్ల మంది వరకు మధుమేహం బారినపడే అవకాశం ఉన్నట్లు ఓ అధ్యయనం తేల్చింది.

వివరాలు 6లో ▸



హైదరాబాద్‌లోని చింతలకుంటలో రోడ్డుపై భారీగా నిలిచిన వర్షపు నీరు

హైదరాబాద్‌లో కుండపోత

రహదారులన్నీ జలమయం.. భారీగా ట్రాఫిక్ జామ్..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను సోమవారం సాయంత్రం జడివాన వణికించింది. గంటపాటు ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. రాత్రి వరకు ఓ మోస్తరు వాన కొనసాగుతూనే ఉంది. అత్యధికంగా శివరాంపల్లిలో 6.2, చార్మి నార్‌లో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలా ప్రాంతాల్లో నాలుగైదు సెంటీమీటర్ల వరకు పడింది. అనేక ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. నాలాలు, మ్యాన్‌హోల్‌లు పొంగి పొర్లాయి. దీంతో నగరమంతా ట్రాఫిక్ స్తంభించి పోయింది. వాహనదారులు గంటల కొద్దీ అవస్థ పడ్డారు. అబిడ్స్ ప్రాంతంలో ఈదురుగాలుల ధాటికి రేకులు ఎగిరిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. లంగర్‌హౌజ్ ప్రాంతంలో ఒక మసీదుపై పిడుగు పడటంతో గోడలకు పగుళ్లు వచ్చాయి. పైన ఉన్న గుమ్మం కింద పడిపోయింది. వర్షంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. ప్రజలెవరూ అవసరమైతే తప్ప బయటికి రావొద్దని విజ్ఞప్తి చేసింది.

తగ్గుతున్న గోదా'వడి'! 3లో

నేడూ భారీ వర్షాలు..

అతిభారీ వర్షాలు:
మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ అధికంగా భారీ వర్షాలు, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో భారీవర్షాలు కురవచ్చు.

మోస్తరు నుంచి భారీ వర్షాలు:
జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురవచ్చు.

న్యూస్‌రీల్

ఉత్పాదకతకు ఊపు



హోంవర్క్ పూర్తి చేసేది ఎట్లా?...
చాట్ జీపీటీ ఉందిగా!
ఇంటి డిజైన్ కావాలి... సివిల్ ఇంజనీర్‌ను సంప్రదించడం ఎలా?
దానికి బయటకు వెళ్లాల్సిన పనే లేదు.
మేకిట్. ఏఐ వాడితే సరి!

- వివరాలు 14లో▶

శిబిరాల్లో.. శిథిలాల్లా..!



మణిపూర్ కాంగ్‌పోక్పిలోని సహాయ శిబిరాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. హింసాత్మక ఘటనల్లో గాయాల పాలైనవారు, ఇళ్లు వదిలేసి పారిపోయి వచ్చినవారు శిబిరాల్లో శిథిలాల్లా కనిపించారంటున్న వైద్యుడు చల్లగాలి ప్రభుకుమార్.

- వివరాలు 14లో▶

11 ప్రాజెక్టుల కింద 4.1 లక్షల హెక్టార్లకు సాగునీరు



తెలంగాణలో కేంద్రం చేపట్టిన జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలతో పెద్దఎత్తున ఆయకట్టు వృద్ధిలోకి వచ్చినట్లు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. ఇప్పటివరకు 4.1 లక్షల హెక్టార్లను అభివృద్ధి చేసినట్లు తెలిపింది.

- వివరాలు 3లో▶

వీఆర్‌ఏలు ఇక 'ఫుల్ టైమ్' ఉద్యోగులు



గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. 61 ఏళ్ల లోపు వయస్సు గల 16,758 మంది వీఆర్‌ఏలను 'ఫుల్ టైమ్' ఉద్యోగులుగా క్రమబద్ధీకరించింది.

- వివరాలు 5లో▶

బీజేపీ నినాదం.. బీసీ సీఎం!

కోర్ కమిటీతో పాటు, వివిధ స్థాయి నేతల సమావేశంలో అభిప్రాయ సేకరణ

- రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీల మద్దతు కూడగట్టే వ్యూహం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు అధికారంలోకొస్తే అగ్రకులాల వారే సీఎం అవుతారనే అంచనా
- బీజేపీ బీసీ వాదంతో ఎన్నికల బరిలోకి దిగితే ప్రయోజనం ఉంటుందన్న నేతలు
- సీఎం అభ్యర్థిని కూడా ముందే ప్రకటించాలని సూచన.. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ఖరారు!

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సీఎం నినాదంతో ముందుకెళ్లాలని బీజేపీ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీలోని వివిధ స్థాయిలలో ఈ అంశంపై అభిప్రాయ సేకరణ జరిపినట్టు, ఈ సందర్భంగా వచ్చిన సలహాలు, సూచనల మేరకు ఈ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. గత శుక్రవారం కోర్ కమిటీ భేటీ, శనివారం మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్ పర్సన్లు, గత మూడేళ్ల కాలంలో పార్టీలో చేరిన ముఖ్య నేతల సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ భేటీల్లో బీసీ నినాదాన్ని తెరపైకి తేవడంతో పాటు బీసీ వర్గానికి చెందిన వ్యక్తినే సీఎం చేస్తామని ప్రకటిస్తే ఎలా ఉంటుందన్న దానిపై అభిప్రాయ సేకరణ నిర్వహించినట్టు సమాచారం. ఈ సమావేశాల్లో వ్యక్తమైన అభిప్రాయాలను రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్, పార్టీ ఎన్నికల సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ప్రత్యేకంగా నమోదు చేసుకున్నట్లు తెలిసింది. ఒకవేళ బీఆర్‌ఎస్, కాంగ్రెస్సుల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా అగ్రవర్ణాల వారే సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ.. బీసీ వాదంతో, ముఖ్యంగా బీసీ సీఎం నినాదంతో ఎన్నికల బరిలోకి దిగాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ప్రచారం చేయడంతో పాటు

మిగతా 2వ పేజీలో ▶

100 రోజుల ప్రణాళికపై కసరత్తు

వచ్చే వందరోజుల కాలానికి చేపట్టే కార్యాచరణపై కసరత్తు నిమిత్తం పార్టీ నేతలు విజయశాంతి, చాడ సురేష్‌రెడ్డి, డా.జి. మనోహర్‌రెడ్డిలతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, బీఆర్‌ఎస్ సర్కార్, సీఎం కేసీఆర్ వైఫల్యాలు, ముఖ్యమైన ఎన్నికల హామీలు నిలబెట్టుకోకపోవడం, తదితర అంశాలతో ఈ కార్యాచరణను రూపొందిస్తున్నట్టు తెలిసింది.



ఉచిత విద్యుత్ మా పాలసీ

ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టీకరణ

- పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ పథకం నిలబడాలి
- గ్రామీణ ప్రాంతాలు కుదుటపడే వరకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతుబంధు ఇతర పథకాలు కొనసాగిస్తాం
- ధరణితో భూములపై యజమానులకు సంపూర్ణ అధికారం
- రేపటి తెలంగాణను పాలించేది మీరే.. నేను దారి చూపించి వెళతానంటూ వ్యాఖ్య
- బీఆర్‌ఎస్‌లోకి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి
- మహారాష్ట్రకు చెందిన 76 మంది సర్పంచ్‌ల చేరిక

2లో

వీఆర్‌ఏ ఫ్యూడల్ వ్యవస్థ.. అందుకే క్రమబద్ధీకరణ: కేసీఆర్

- ఆయా శాఖల్లో మంచి పేరు తెచ్చుకోవాలి
- కొత్త ఉద్యోగాలు చేపట్టనున్న వీఆర్‌ఏలకు సీఎం అభినందనలు

-వివరాలు 5లో▶

పాఠశాలల సమయాల్లో మార్పులు

పాఠశాలల సమయాల్లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. అన్ని స్థాయిల తరగతులు ఒకే సమయంలో మొదలయ్యేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలు ఉదయం 9.30కు ప్రారంభమై, 4.15 గంటల వరకు కొనసాగుతాయి.

-వివరాలు 3లో▶

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు?



ఇంటర్మీడియెట్ ప్రవేశాల గడువు మంగళవారంతో ముగుస్తోంది. అయితే ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరగలేదు. దీంతో మరికొంత గడువు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అడ్మిషన్లు సరిగా జరగడం లేదని జిల్లాల్లోని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా మరికొంత గడువు పొడిగించాలని ఉన్నతాధికారులను కోరారు. దీంతో క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ప్రవేశాల గడువు పెంపునకు ఇంటర్ బోర్డు అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. - వివరాలు 3లో▶

ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్ సింగ్

రాష్ట్రపతి ఆమోదముద్ర



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను నియమించాలన్న సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ సోమవారం రాత్రి ట్వీట్ చేశారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని జూలై 5న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసిన విషయం విదితమే. జస్టిస్ ఠాకూర్ ప్రస్తుతం బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు.

సీజన్ మొదలైనా.. సబ్సిడీ యంత్రాలేవి?

సాగు యాంత్రీకరణపై నీలినీడలు

బడ్జెట్‌లో నిధులు కేటాయింపు.. విడుదలలో నిర్లక్ష్యం




సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్ జోరుగా సాగుతోంది. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. కీలకమైన ఈ సీజన్‌కు అవసరమైన కూలీలు దొరకని కారణంగా వ్యవసాయ పనులకు తీవ్రమైన ఆటంకం ఏర్పడుతోంది. కూలీల కొరతను అధిగమించడం, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయ చేయడానికి యాంత్రీకరణను ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కొన్నేళ్లుగా ఇది అమలుకు నోచుకోవడంలేదు. బడ్జెట్‌లో వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా, అమలులో వ్యవసాయశాఖ విఫలమైందనే ఆరోపణలున్నాయి. దుక్కుయంత్రాలు, కనీసం తైవాన్ స్ప్రేయర్ వంటివి కూడా రైతులకు సబ్సిడీపై ఇచ్చే దిక్కు కూడా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించినా, వ్యవసాయ యంత్రాలు రైతులకు సరఫరా కాలేదు.

నిలిచిన వరినాటు యంత్రాల సరఫరా ప్రక్రియ

మూడునాలుగేళ్ల క్రితం వరకు వ్యవసాయయంత్రాలను భారీగానే సరఫరా చేశారు. ట్రాక్టర్లు

మిగతా 5వ పేజీలో ▶

స్థానికభాషల్లో ఇంజనీరింగ్ విద్య



- సబ్జెక్టుల అనువాదం కోసం రూ.500 కోట్లు
- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఇంజనీరింగ్ విద్యను స్థానికభాషల్లోనూ బోధించేందుకు ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ప్రత్యేక చర్యలు చేపట్టిందని హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. ఆయా సబ్జెక్టులను స్థానిక భాషల్లో అనువదించేందుకు రూ.500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సోమవారం ఐఐటీహెచ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ నూతన విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యావిధానంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించడమే కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదిగేలా చేయగలగడమే నూతన విద్యావిధానం

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



రహస్యంగా టమాటా కర్రీ తింటుంటే మాటువేసి పట్టుకున్నాం సార్!

సాగు సరే.. గిట్టుబాటు ఏదీ?



- సాగు ఖర్చులకు తగ్గట్టుగా లేని ఆయిల్‌పాం గెలల ధర
- టన్నుకు రూ.20 వేలు ఇవ్వాలంటున్న రైతులు
- సాగును ప్రోత్సహిస్తున్నా.. మద్దతు ధరపై ప్రభుత్వం విఫలమైందంటున్న రైతులు

నల్లగొండ రూరల్: ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులు పంటకు మద్దతు ధర లభించడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఆయిల్‌పాం సాగు ద్వారా ఏడాదికి ఎకరానికి అన్ని ఖర్చులు పోనూ రూ.లక్ష మిగులుతుందని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో నీటి వసతి ఉండి, పంటపై ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్‌పాం సాగు చేపట్టారు. ఇప్పుడు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తలపట్టుకుంటున్నారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ.12,623 ఉంది. గత ఏడాది మే నెలలో టన్ను ధర రూ.23,800 ఉండగా, ఈ ఏడాది మే నెలలో రూ.13,346 ఉంది.

సాగు ఇలా..

సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఓ ప్రైవేట్ కంపెనీ ఆయిల్‌పాం సాగు టెండర్ తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ సాగు బాధ్యతలు తీసుకుంది. నల్లగొండ జిల్లాలో 4,947 ఎకరాల్లో సాగులో ఉండగా 662 ఎకరాల్లో దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ రికార్డులు చెబుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 2,450 ఎకరాల్లో

మిగతా 5వ పేజీలో ▶

గోడౌన్లలోనే బియ్యం!

ఎఫ్‌సీఐ నిర్వాకంతో ఇతర రాష్ట్రాలకు కదలని బియ్యం నిల్వలు

- రాష్ట్రంలోని 72 ఎఫ్‌సీఐ డిపోలలోని గోడౌన్లలో మూలుగుతున్న 11 ఎల్‌ఎంటీ బియ్యం
- డిమాండ్‌కు అనుగుణంగా కొత్త గోడౌన్లను సమకూర్చని ఎఫ్‌సీఐ
- గోడౌన్ల నుంచి రవాణా లేకపోవడంతో మిల్లుల్లోనే ముక్కిపోతున్న 2022–23 ధాన్యం
- రాష్ట్ర వ్యాప్తంగా మిల్లుల్లో 1.10 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వ



మహబూబ్‌నగర్ జిల్లా కొకుంట్లలోని ఎఫ్‌సీఐ గోదాముకు ఏడు జిల్లాల్లోని 370 రైస్ మిల్లుల బియ్యాన్ని అప్పగించాలని అధికారులు ఆదేశించారు. నారాయణపేట జిల్లా మిల్లర్లు ఈ గోదాంకు బియ్యం లారీల లోడ్‌లను పంపిస్తే అన్‌లోడ్ కావడానికి 5 రోజుల సమయం పడుతోంది. ఒక్క గోడౌన్‌కు రోజుకు 60 నుంచి 70 మిల్లుల బియ్యాన్ని లారీల నుంచి అన్‌లోడ్ చేయడమే కష్టమైన పరిస్థితుల్లో ఏకంగా 370 మిల్లులను కేటాయించడం వల్ల బియ్యం లారీలు రోజుల తరబడి రోడ్లపైనే వేచిచూసే పరిస్థితి నెలకొంది

సాక్షి, హైదరాబాద్: అక్కడ ఒక్క చోటే కాదు. రాష్ట్రంలో ఎఫ్‌సీఐ ఆధీనంలో ఉన్న బియ్యం గోదాముల వద్ద పరిస్థితి అన్ని చోట్లా అలానే ఉంది. గత కొంత కాలంగా ఈ గోదాముల్లోఉన్న బియ్యం నిల్వలను ఖాళీ చేయకపోవడంతో రాష్ట్రంలోని రైస్ మిల్లుల్లో మరలు ఆడని పరిస్థితి ఏర్పడింది. ఒక్కో బియ్యం లారీ అన్‌లోడ్ కావడానికి 5 రోజుల నుంచి వారం రోజుల సమయం పడుతోంది. స్టోరేజీ కెపాసిటీ పెంచకుండా, గోడౌన్‌లు ఖాళీ చేయకుండా ఎఫ్‌సీఐ వ్యవహరిస్తున్న తీరుతో 2022–23 సీజన్ ధాన్యం సీఎంఆర్ కాకుండా మిల్లుల్లోనే మూలుగుతోందని మిల్లర్లు, అధికారులు ఆందోళన చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం మిల్లుల్లో ఉన్న 1.10 ఎల్‌ఎంటీ ధాన్యం మిల్లింగ్ కావాలంటే ఎఫ్‌సీఐ గోడౌన్లలోని బియ్యం నిల్వల మూవ్‌మెంట్ వేగం అందుకోవాల్సిందే.

లక్ష టన్నుల స్టోరేజీ కెపాసిటీ కూడా కరువే!

రాష్ట్ర వ్యాప్తంగా 42 ఎఫ్‌సీఐ డిపోలు ఉన్నాయి. ఇందులో 13 లక్షల మెట్రిక్ టన్నుల

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

'ఏరు దాటాక తెప్ప తగలేయడం అలవాటే'

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు కమ్యూనిస్టుల పట్ల చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. 'కమ్యూనిస్టులకు కార్యకర్తలే లేరు. జెండాలు మోసేందుకు ఆశలను, అంగన్‌వాడీలను వాడుకుంటున్నారు. సీపీఐ, సీపీఎం ఉచ్చులో పడొద్దు'అంటూ హరీశ్‌రావు చేసిన కామెంట్లతో కూడిన పేపర్ క్లిప్పింగ్‌ను రేవంత్ ట్విట్టర్‌లో పోస్టు చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు గుప్పించారు. 'ఏరుదాటాక తెప్ప తగలేయడం మామా అల్లుళ్లకు అలవాటేనని మరోసారి రుజువు చేశారు హరీశ్ గారూ! మునుగోడులో కమ్యూనిస్టుల మద్దతుతో గెలిచి ఇప్పుడు ఎర్రజెండా మోసేటోడే లేడని మాట్లాడుతున్నారు. ఈ ఊసరవెల్లుల గురించి కమ్యూనిస్టు సోదరులు ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి, సమాజానికి అంత మంచిది'అని పేర్కొన్నారు.

ప్రియాంకతో మహిళా డిక్లరేషన్ ప్రకటిస్తాం

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: కొల్లాపూర్‌లో ఈనెల 30న జరిగే భారీ బహిరంగ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీతో మహిళా డిక్లరేషన్ ప్రకటిస్తామని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, కాంగ్రెస్ ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రియాంకాగాంధీ సభకు ప్రజలు, మహిళలు భారీఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సభలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎంపీపీ మేఘారెడ్డి, కూచుకుల్ల దామోదర్ రెడ్డి కుమారుడు రాజేశ్‌రెడ్డి పార్టీలో చేరుతారని వెల్లడించారు. అలాగే గద్వాల జెడ్పీ చైర్మన్ సరితా తిరుపతయ్య, జిల్లాలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేరుతున్నట్లు రవి చెప్పారు. కొల్లాపూర్ సభ కోసం మహబూబ్ నగర్ జిల్లాలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని సర్దుకొని ఐక్యంగా ముందుకెళ్తామని, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని సుధాకర్ పేర్కొన్నారు. మణిపూర్ ఘటనపై ఈనెల 29న ప్రకాశం హాల్ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, పార్టీ నేతలు పాల్గొంటారన్నారు.

అప్పు చేయనిదే రాష్ట్రం నడవని దుస్థితి

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: బంగారుతునక లాంటి ధనిక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులపాలు చేశారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అప్పు పుట్టనిదే, ఉన్న ప్రభుత్వ భూములు అమ్మనిదే రాష్ట్రం ముందుకుపోలేని దీనస్థితికి తెచ్చారని ఆమె సోమవారం ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. ఇంతకాలం దోచుకుతిన్నది చాలక ఎన్నికలకు మూడు నెలల ముందు పథకాలకు అప్పులు కావాలని కేంద్రం వద్ద కొత్త డ్రామాకు తెరలేపుతున్నారని విమర్శించారు. మరో లక్ష కోట్ల అప్పులకు తంటాలు పడే కేసీఆర్.. తెచ్చిన రూ.5 లక్షల కోట్ల అప్పుతో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. రూ.21 వేల కోట్ల రుణమాఫీ, రూ.20 వేల కోట్ల ఉచిత ఎరువులు, దళితులకు 3 ఎకరాల భూమి, రూ.5 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, 50 లక్షల మందికి నిరుద్యోగభృతి వంటి హామీల అమలు సంగతి ఏమైందని ప్రశ్నించారు. ఇవేవీ చేయకపోగా ప్రజల నెత్తిపై రూ.2 లక్షల చొప్పున అప్పు పెట్టారని విమర్శించారు. కేసీఆర్ పాలనకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని షర్మిల ధ్వజమెత్తారు.

ఉచిత విద్యుత్ మా పాలసీ

సీఎం కేసీఆర్ స్పష్టీకరణ

- బీఆర్‌ఎస్‌లోకి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి
- మహారాష్ట్రకు చెందిన 76 మంది సర్పంచ్‌ల చేరిక



అనిల్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'వ్యవసాయానికి ఉచిత విద్యుత్ మా ప్రభుత్వ పాలసీ. ఈ విషయానికి సంబంధించి కొందరు తెలిసీ తెలియక మాట్లాడుతున్నారు. వాటిని నేను పట్టించుకోను. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ పథకం నిలబడాలి. గ్రామీణ ప్రాంతాలు, రైతులు బాధలు తొలగిపోయి వంద శాతం బాగుండాలి..'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. భూముల డిజిటలైజేషన్ కోసం తెచ్చిన ధరణిని సమస్యగా చిత్రీకరించేందుకు కొన్ని దుష్టశక్తులు పనిచేస్తున్నాయని విమర్శించారు. ధరణితో భూముల మీద యజమానులకు సంపూర్ణ అధికారం వచ్చిందని చెప్పారు. ఈ అధికారాన్ని మీ వద్దే పెట్టుకుంటారా? లేక వదిలేసుకుంటారా? అనేది మీరే నిర్ణయించుకోవాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో భారత్ రాష్ట్ర సమితిలో చేరారు. అనిల్‌కుమార్ రెడ్డితో పాటు ఆయన వెంట వచ్చిన అనుచరులకు కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

లోతుగా ఆలోచించిన తర్వాతే..

'తెలంగాణ ఉద్యమంతో పాటు రాష్ట్ర సాధనను ఒక టాస్క్‌గా తీసుకుని పనిచేశాం. మాకు రాజకీయం ఒక టాస్క్ లాంటిది. నేను సిద్దిపేట శాసనసభ్యుడిగా పనిచేసిన నాటి నుంచి మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంత వరకు కరెంటు విషయంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు వర్ణనాతీతం. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు అధికారులతో జరిపిన చర్చల ద్వారా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర మౌలిక వసతుల్లో సమతుల్యత సాధించాం. ప్రభుత్వ సంపూర్ణ మద్దతు ఉంటే 24 గంటల ఉచిత విద్యుత్ సాధ్యమవుతుందనే అధికారుల వాదనకు కట్టుబడి, పూర్తిస్థాయిలో అండగా నిలిచి ఏడెనిమిది నెలల్లోనే విద్యుత్ సరఫరా లేక ఏర్పడిన దుష్పరిణామాలను సరిదిద్దాం. ఏడు గంటల పాటు ఒకేమారు వ్యవసాయ అవసరాలకు విద్యుత్ ఇవ్వడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకునే 24 గంటల కరెంటుకు మొగ్గు చూపాం. గ్రిడ్ కుప్పకూలకుండా అవసరమైన సమయంలో విద్యుత్ కొనుగోలుకు అవసరమైన విచక్షణాధికారం అధికారులకు ఇవ్వడంతో పాటు సాంకేతిక అంశాలపై అవగాహన ఉండదనే ఉద్దేశంతో ట్రాన్స్‌కో, జెన్‌కో తదితర సంస్థల నుంచి ఐఏఎస్ అధికారులను తొలగించాం. విద్యుత్ అంశంపై ప్రతి విషయాన్ని లోతుగా ఆలోచించిన తర్వాతే తొమ్మిదేళ్లుగా అమలు చేస్తున్నాం. మూడు గంటల కరెంటు అంటే రైతులు తిడుతున్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు అంశంపై ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా గ్రామీణ ప్రాంతాలు కుదుటపడే వరకు కొనసాగిస్తాం. దీంతో ఆర్థికాభివృద్ధి జరిగి తెలంగాణ అన్ని రంగాల్లోనూ అగ్రస్థానానికి చేరుతుంది.

ధాన్యం ప్రాసెసింగ్.. జపాన్ కంపెనీతో చర్చలు

ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు, చెక్‌డ్యాంలు తదితరాలతో భూగర్భ జలాలు పెరిగి పంటల దిగుబడి పెరిగింది. తెలంగాణలో ఇసుక పండినట్లు 3 కోట్ల టన్నుల ధాన్యం వస్తుండటంతో గిర్నీల సామర్థ్యం కూడా సరిపోవడం లేదు. 2.5 కోట్ల టన్నుల ధాన్యం ప్రాసెసింగ్ కోసం జపాన్ సటాకా కంపెనీతో మాట్లాడుతున్నాం. నేను రైతుబిడ్డగా సిద్దిపేట మార్కెట్‌లో పడిగాపులు పడిన రోజులను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తున్నాం..'అని సీఎం చెప్పారు.

భూములపై సర్వాధికారాలు యజమానులకు..

'వీఆర్వోలు భూముల వివరాలు గందరగోళం చేశారు. ధరణి ద్వారా భూముల డిజిటలైజేషన్‌తో వాటిపై సర్వాధికారాలు యజమానుల చేతికి వచ్చాయి. రాష్ట్రంలోని 2.76 కోట్ల ఎకరాల్లో 1.56 కోట్ల భూమి ఇప్పటికే ధరణిలోకి వచ్చింది. ధరణి మూలంగా రైతుబంధు, భూమికి రక్షణ, ధాన్యం కొనుగోలు వంటివి సులభంగా సాధ్యమవుతాయి. ఇప్పుడు రాష్ట్రంలో భూముల విలువ ఎంతో పెరిగింది. ధరణి లేకపోతే శాంతిభద్రతల సమస్యలు తలెత్తేవి. కొందరు చెప్తున్నట్లు ధరణి తీసేస్తే మళ్లీ లంచాలు మొదలవుతాయి..'అని కేసీఆర్ అన్నారు.

జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్లండి

'భువనగిరిలో ఇద్దరూ పోటీ పడి డబ్బులు తగలేయొద్దు. చెరి ఒక పదవి తీసుకుని జోడెడ్ల బండిలా నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లండి.. అని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డికి చెప్పా. కోడె లేగల మాదిరిగా వెలపల, దాపల సమానంగా ఉంటే కచ్చురంగా బాగా ముందుకు పోతుంది. అనిల్‌కుమార్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు నాదే బాధ్యత. నాకు ఫిబ్రవరిలో 70 ఏళ్లు వస్తాయి. రేపటి తెలంగాణను పాలించేది మీరే. దారి చూపించి వెళతా..'అని కేసీఆర్ అన్నారు. సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, గ్యాదరి కిషోర్, భాస్కర్‌రావు, రవీంద్ర కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో రెండేళ్లలో ఉచిత విద్యుత్: కేసీఆర్

మహారాష్ట్రలో రైతు ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని కేసీఆర్ ప్రకటించారు. మహారాష్ట్రలోని వివిధ పార్టీలకు చెందిన 76 మంది సర్పంచ్‌లు కూడా సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వ్యవసాయంతో పాటు అనేక రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచామని సీఎం చెప్పారు. మహారాష్ట్రలో కూడా రైతులు, ప్రజల జీవన ప్రమాణాలు మారాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించాల్సిందిగా సర్పంచ్‌లకు సూచించారు. వారిని తెలంగాణ గ్రామాల పర్యటనకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని ఆదేశించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మహారాష్ట్ర అమరావతి డివిజన్ నుంచి బీజేపీ, శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీతో పాటు రైతు సంఘటన, వంచిత్ బహుజన్ అఘాడీ, షెట్కారీ సంఘటనతో పాటు వివిధ పార్టీలకు చెందిన 76 మంది సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మహారాష్ట్ర మీడియా యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

నాటి విమర్శలకు 'తెలంగాణ ప్రగతి పథం' జవాబు

పుస్తకావిష్కరణ సందర్భంగా సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే దేశానికే తలమానికంగా నిలవడం అంత తేలికైన విషయం కాదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతిపై రూపొందించిన 'తెలంగాణ ప్రగతి పథం' అనే కాఫీటేబుల్ బుక్‌ను సోమవారం సచివాలయంలో సీఎం ఆవిష్కరించారు. తొలినాళ్లలో మన పాలనా సామర్థ్యంపై విమర్శలు ఎక్కుపెట్టిన వారికి ఈ పుస్తకం సరైన సమాధానాలను ఇస్తుందని అన్నారు. ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించిన రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ తెలుగు విభాగం కో–ఆర్డినేటర్ సువర్ణ వినాయక్, భాషా విభాగం సభ్యుడు సంబరాజు రవిప్రకాశ్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ తదితరులను సీఎం అభినందించారు.

కేసీఆర్‌కు కళ్లు నెత్తికెక్కాయి...

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక ఖతం: ఈటల



హనుమకొండ: రెండోసారి అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్‌కు కళ్లు నెత్తికెక్కాయని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఈటల మాట్లాడారు. డబ్బులు ఇస్తే పేదలే ఇళ్లు కట్టుకుంటారని 2014లోనే కేంద్రం చెప్పినా కేసీఆర్ వినలేదన్నారు. బాటసింగారంలో కట్టిన ఇళ్ల గోడలు పెచ్చులూడి పోయే స్థాయికి వచ్చినా.. ఇంకా అర్హులకు అందలేదని విమర్శించారు. ఇక బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖతమేనని, మళ్లీ కేసీఆర్‌కు ఓటు వేయమని పేద ప్రజలు గ్రామాల్లో మాట్లాడుకుంటున్నారని అన్నారు. హుజూరాబాద్ ఎన్నికల్లో పాత్రికేయులకు ఇస్తానన్న ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాగానే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తామని ఈటల హామీనిచ్చారు.

29న హైదరాబాద్‌కు అమిత్ షా

- పార్టీని లైన్‌లో పెట్టే దిశగా కేంద్ర మంత్రి చర్యలు... ఎన్నికల కార్యాచరణ, వ్యూహాలపై కసరత్తు
- రాష్ట్ర స్థాయిలో ముఖ్య నాయకులు, మోర్చాలు, విభాగాల నేతలతోనూ భేటీలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా ఈ నెల 29న హైదరాబాద్‌కు రానున్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేయడం, ఆ దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర నేతలతో చర్చించి, తగిన సూచనలు చేయనున్నారు. నిజానికి 29న ఖమ్మంలో అమిత్ షా బహిరంగ సభ నిర్వహించాల్సి ఉన్నా.. భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా పడింది. దీంతో ఆయన హైదరాబాద్‌కు వచ్చి పార్టీని చక్కదిద్దే చర్యలు చేపట్టనున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఆయన పలు అంశాలపై రాష్ట్రంలోని అన్ని స్థాయిల నాయకులకు దిశానిర్దేశం చేయడంతో పాటు ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలు అనుసరించాలనేదీ ఖరారు చేయనున్నట్టు వివరించాయి. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి మార్పు, నేతల మధ్య జగడాలు ఇంకా కొనసాగుతున్నాయనే అభిప్రాయాల నేపథ్యంలో.. అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

పార్టీ కమిటీలు, విభాగాలతో భేటీ


ఇటీవలికాలంలో పార్టీలో పరిణామాలు, ముఖ్యనేతలు సైతం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, సమన్వయలోపం నేపథ్యంలో బీజేపీ కేడర్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీనిని చక్కదిద్దేలా బీజేపీ సంస్థాగత అంశాలపై అమిత్‌షా సమీక్షించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందులోభాగంగా కోర్‌కమిటీ భేటీతోపాటు మోర్చాలు, పార్టీలోని వివిధ విభాగాల నేతలతోనూ ఆయన భేటీ కానున్నారని వెల్లడించాయి. సమావేశాలకు మండలస్థాయి నేతలను కూడా ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. హైదరాబాద్ పర్యటన సందర్భంగా వివిధ సామాజిక వర్గాల ప్రముఖులు, ముఖ్యులతోనూ షా ప్రత్యేకంగా సమావేశం కానున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు. మొత్తంగా రాష్ట్ర పార్టీని లైన్‌లో పెట్టేదిశగా చర్యలు ఉంటాయని అంటున్నారు. కాగా.. అమిత్ షా పర్యటనకు ముందు ఈనెల 26న జరగనున్న రాష్ట్ర కోర్ కమిటీ భేటీలో ఎన్నికలకు సంబంధించిన వివిధ కమిటీల నియామకాన్ని చేపట్టే అంశంపై చర్చించనున్నట్టు తెలిసింది.

కాంగ్రెస్‌లోకి జిట్టా?

సాక్షి, యాదాద్రి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టా బాలకృష్ణారెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరిన నేపథ్యంలో జిట్టా చేరికపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొంతకాలంగా బీజేపీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేసేందుకు జిట్టా సిద్ధంగా ఉన్నారని అంటున్నారు.

గెలుపే లక్ష్యంగా దూసుకెళ్లండి

- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి
- పార్టీ అంతర్గత విషయాలను బహిరంగ వేదికలపై మాట్లాడొద్దు
- బండి సంజయ్‌కు అమిత్ షా దిశానిర్దేశం



అమిత్‌షాకు కండువా కప్పుతున్న బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రానున్న అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బండి సంజయ్ కుమార్‌కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు మరింత దూకుడుగా వ్యవహరించాలని చెప్పారు. సోమవారం ఢిల్లీలో తనను కలిసిన బండి సంజయ్‌తో సుమారు 30 నిమిషాల పాటు రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై అమిత్ షా చర్చించారు. ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అప్పగించిన తర్వాత మొదటిసారి బండి సంజయ్ అమిత్ షాను కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన వ్యవహారాలు, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడం, ప్రధాని సహా కేంద్రమంత్రుల పర్యటనలు తదితర అంశాలపై అమిత్ షా పలు సూచనలు చేశారు. అంతేగాక ఇటీవల కిషన్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల స్వీకరణ రోజు బండి సంజయ్ సహా పలువురు నాయకులు చేసిన వ్యాఖ్యల గురించి అమిత్ షా అడిగి తెలుసుకున్నారని సమాచారం. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగ వేదికలపై, మీడియాతో మాట్లాడరాదని అమిత్ షా సూచించారని తెలిసింది. బండితో భేటీకి సంబంధించిన సమాచారాన్ని అమిత్ షా స్వయంగా ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలను బండితో చర్చించినట్లు చెప్పారు. అనంతరం షాతో భేటీకి సంబంధించి బండి సైతం ట్వీట్ చేశారు. రాజకీయ చాణక్యుడు అమిత్ షాను కలవడం సంతోషంగా ఉందని, ఆయన మార్గదర్శనంలో పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తానని బండి వెల్లడించారు.

టమాట రైతుకు సీఎం అభినందనలు



టమాటాలను సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న రైతు మహిపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/మెదక్ జోన్: టమాటా పంట విక్రయించి రూ.3 కోట్లు ఆర్జించిన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్ రైతు బాన్సువాడ మహిపాల్‌రెడ్డి దంపతులను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు దంపతులు సోమవారం సచివాలయంలో కేసీఆర్‌ను కలిశారు. ఇప్పటికే రూ.2 కోట్ల విలువైన టమాటా పంటను విక్రయించామని, మరో రూ.కోటి విలువైన పంట కోతకు సిద్ధంగా ఉందని మహిపాల్‌రెడ్డి సీఎంకు వివరించారు. వాణిజ్య పంటల సాగు విషయంలో తెలంగాణ రైతులు వినూత్నంగా ఆలోచిస్తే అది లాభదాయకంగా ఉంటుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రులు తన్నీరు హరీశ్‌రావు , సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు .

రాష్ట్ర అప్పులు రూ.3.66 లక్షల కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అప్పులు 2023 మార్చినాటికి రూ.3,66,306 కోట్లకు చేరినట్టు కేంద్రం వెల్లడించింది. లోక్‌సభ బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలాసీతారామన్ వివిధ రాష్ట్రాల అప్పుల లెక్కలకు సంబంధించి సోమవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆర్థిక మంత్రి ఇచ్చిన ఆ సమాధానం మేరకు తెలంగాణలో 2018–19 నుంచి 2022–23 సంవత్సరాల మధ్య అప్పులు రూ.1,90,203 కోట్ల నుంచి రూ.3.66 లక్షల కోట్లకు పెరిగినట్టు స్పష్టం చేసింది. గడిచిన రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అప్పులు తీసుకోవడంపై ఆంక్షలు విధించిన తర్వాత రాష్ట్ర స్థూలఉత్పత్తిలో అప్పులశాతం తగ్గినట్టు కనిపిస్తోంది. 2020–21 ఆర్థికసంవత్సరంలో అత్యధికంగా ఈ అప్పులు 20.3 శాతం ఉంటే.. గత ఆర్థిక సంవత్సర ముగింపునాటికి ఈ అప్పుల శాతం 16.16శాతంగా ఉన్నట్టు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై రాష్ట్రాల వారీగా వివరాలు ఇవ్వకపోవడం గమనార్హం. ఇవి కాకుండా విద్యుత్ సంస్థలు తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన గ్యారెంటీని కూడా ఈ సమాధానంలో కేంద్రమంత్రి పొందుపర్చలేదు.

రాష్ట్ర అప్పుల వివరాలు ఇలా.... రుణాలన్నీ రూ. కోట్లలో...

	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
	1,90,203	2,25,418	2,71,259	3,14,136	3,66,306
జీఎస్‌డీపీ శాతంలో	18.7%	18.5%	20.3%	15.8%	16.16%

నాబార్డు కింద....

	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
మిషన్ భగీరథ	598.91	275.75	533.31	---	---
ఉద్యానవన	526.26	----	----	---	---
కాళేశ్వరం	-----	508.66	3294.70	2628.21	997.4
టీఎస్‌సీఎస్‌సీఎల్	18.00	--	2,500	5,600	7,525
మార్క్‌ఫెడ్	---	---	483	---	---
ఆర్ఐడీఎఫ్	1331	934	703	1321	1305
వేర్‌హౌసింగ్	30.86	46.82	19.73	---	---

కమ్యూనిస్టులు లేకుండా మునుగోడులో గెలిచారా?


- మంత్రి హరీశ్‌రావుకు కూనంనేని ప్రశ్న
- కమ్యూనిస్టులకు కార్యకర్తలు లేరనడంపై మండిపాటు



సాక్షి, హైదరాబాద్: 'కమ్యూనిస్టుల ఉచ్చులో పడొద్దు'అంటూ సిద్దిపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు మనుషులు లేరు, కార్యకర్తలు లేరు అనే వ్యాఖ్యలు కూడా చేశారని, కమ్యూనిస్టు పార్టీలకు కార్యకర్తలు, మనుషులు లేకుంటే మునుగోడులో బీఆర్‌ఎస్ పార్టీ గెలువగలిగేదా అని ప్రశ్నించారు. మునుగోడు ఎన్నికల తరువాత కమ్యూనిస్టుల మద్దతుతో గెలిచామని బీఆర్‌ఎస్ పార్టీ అధినాయకులు కృతజ్ఞతలు చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆనాడు కమ్యూనిస్టుల మద్దతు లేకుంటే ఇప్పుడు తెలంగాణలో బీజేపీని నిలవరించడం సాధ్యమయ్యేదా అని నిలదీశారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకే కాదు..., రాష్ట్రం, దేశంలోని ప్రతి కార్మికునికి అండాదండా ఎర్రజెండాయేనన్నారు. తెలంగాణలో ఏ గ్రామం వెళ్లినా, ఏ నియోజకవర్గం వెళ్లినా కమ్యూనిస్టులు లేని ప్రాంతం ఒక్కటైనా చూపించగలరా.. అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు లేని సమాజాన్ని హరీశ్‌రావు కూడా ఊహించుకోలేరని కూనంనేని పేర్కొన్నారు.

గొంతులో పునుగులు ఇరుక్కొని చిన్నారి మృతి

- మూడేళ్ల క్రితం ఇద్దరు పిల్లల మృత్యువాత
- శోకసంద్రంలో కుటుంబం



చిన్నారి వద్ద రోదిస్తున్న తల్లి కవిత

ముస్తాబాద్(సిరిసిల్ల): ఓ వలసజీవి ఇంట విషాదం నెలకొంది. వరుసగా వారసులు మృతి చెందడం ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇద్దరు కుమారులు అనారోగ్యంతో మృతి చెందగా, తాజాగా మరో కుమారుడు గొంతులో పునుగులు ఇరుక్కొని ఊపిరాడక విగతజీవిగా మారాడు. కుమ్రంభీం జిల్లా కౌటాల మండలం విరదండికి చెందిన ఇగరపు మారుతి – కవిత దంపతులు ఉపాధి కోసం రెండేళ్ల క్రితం ముస్తాబాద్‌కు వలస వచ్చారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న వీరికి క్రాంతికుమార్ (13 నెలలు) ఉన్నాడు. సోమవారం సాయంత్రం చిన్నారికి పునుగులు తినిపించిన కవిత ఆ తర్వాత పనిలో నిమగ్నమైంది. అయితే చిన్నారి గొంతులో పునుగులు చిక్కుకుని ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆలస్యంగా గమనించిన కవిత ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. అప్పటివరకు ఆడుతూ కనిపించిన చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మూడేళ్ల క్రితం ఇద్దరు కుమారులు నెలల వ్యవధిలో అనారోగ్యానికి గురై మృతి చెందారు.

బీజేపీ నినాదం.. బీసీ సీఎం!

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థిని కూడా ముందే ప్రకటిస్తే రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని పలువురు సూచించినట్లు తెలిసింది.

కుల సంఘాల వారీగా సమావేశాలు

ఎన్నికల సందర్భంగా బీసీ వాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను కదిలించగల, బీసీ సామాజికవర్గాల్లో పట్టున్న బలమైన నేతను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలనే సూచనలు పెద్దెత్తున వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల మద్దతు కూడగట్టేలా త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయాలని జాతీయ పార్టీ ముఖ్య నేతలు నిర్ణయించినట్టు సమాచారం. అన్ని సామాజికవర్గాల మద్దతు కూడగట్టేలా వివిధ కుల సంఘాల వారీగా సమావేశాలు నిర్వహించాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందనే అంశాన్ని, రాష్ట్రంలో కూడా ప్రజలు అధికారంలోకి తెస్తే.. 'డబుల్ ఇంజన్ సర్కార్'తో కలిగే ప్రయోజనాలను.. ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ఈ వ్యూహాలకు తుదిరూపం ఇవ్వడంలో భాగంగా వచ్చేనెల తొలి 15 రోజుల్లో జిల్లాల వారీగా ఆయా రంగాల నిపుణులు, సామాజికవేత్తలు, కుల సంఘాల ప్రముఖులను సంప్రదించాలని, బీజేపీ బీసీ ఎజెండాను వారి ముందుంచి సహకరించాల్సిందిగా కోరనున్నట్టు పార్టీ ముఖ్య నేత ఒకరు 'సాక్షి'కి వెల్లడించారు. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో పార్టీకి ఊపునిచ్చేలా పెద్ద ఎత్తున కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

వచ్చే నెలలో చేరికలపై స్పష్టత...

బీసీ వాదం, ఇతరత్రా రూపాల్లో జోరందుకునేలా కార్యక్రమాలను చేపట్టడం ద్వారా వచ్చే నెలలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి చేరికలు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇటీవల వివిధ స్థాయి నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ సందర్భంగా.. ముందుగానే అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించడం లేదా ఆ స్థానంలో పని చేసుకోవాల్సిందిగా సంబంధిత నేతకు సంకేతాలివ్వడం మంచిదనే సూచనలు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే చేరికలకు సంబంధించి ఒక స్పష్టత వచ్చాక అభ్యర్థుల ప్రకటన కసరత్తు చేపట్టి, త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనతో ఉన్నట్టు చెబుతున్నారు. వచ్చే నెలలో వీటిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, గెలిచే అవకాశాలున్న నేతలు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి ఎవరైనా విజయావకాశాలున్న నేత బీజేపీలోకి వస్తారా? వారిని చేర్చుకునేందుకు ఏం చేయాలన్న దానిపై జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నా ముక్కు కాదు... కేసీఆర్ ముక్కునే నేలకు రాయిస్తా

- ఇక్కడ నొక్కేసిన నిధులతోనే కవిత లిక్కర్ వ్యాపారం: అర్వింద్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ జగిత్యాల టౌన్: 'నేను నిరాధార ఆరోపణలు చేస్తున్నానని, నా ముక్కును నేలకు రాయాలని కవిత అంటోంది. నేను ముక్కు కాదు కదా.. కాలు కూడా నేలకు రాయను, కవిత తండ్రి కేసీఆర్ ముక్కునే గజ్వేల్‌లో నేలకు రాయిస్తాను'అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లపై నిర్వహించిన ధర్నాలో అర్వింద్ మాట్లాడుతూ, తెలంగాణకు పట్టిన దరిద్రం కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. పేదలకు నాలుగు లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని భారీగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం వివిధ బడ్జెట్‌లలో కలిపి రూ.30 వేల కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం చూపించినా ఇళ్లు మాత్రం కట్టించలేదని, ఈ విషయాన్ని రాష్ట్ర ఆడిట్ విభాగమే తేల్చిందన్నారు. ఇక్కడ నొక్కేసిన డబ్బులతోనే కేసీఆర్ కుమార్తె కవిత ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేసిందని, ఐరన్‌లెగ్ కవితను నమ్ముకున్న ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జైలుపాలయ్యారని అన్నారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా జోడించి పేదలకోసం 8 లక్షల ఇళ్లు కట్టించగా, తెలంగాణలో మాత్రం ఈ ప్రభుత్వం కట్టించిన ఇళ్లు గుండుసున్నా అని అర్వింద్ వ్యాఖ్యానించారు.

జీవన్‌రెడ్డి నాకు తండ్రిలాంటి వారు

ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి తనకు తండ్రిలాంటి వారని, కానీ, ఆయన సేవలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ పని ఖతమైందని అర్వింద్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం తహసీల్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో అర్వింద్ మాట్లాడుతూ, పేద మహిళలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తానన్న హామీని కేసీఆర్ తుంగలో తొక్కారన్నారు.



వరద మిగిల్చింది బురద

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగ ఉధృతంగా ప్రవహించింది. దీంతో పరీవాహక ప్రాంతంలోని పంట చేలల్లోకి వరదనీరు వచ్చి చేరింది. వర్షాలు తగ్గడంతో చేలన్నీ ఇలా బురదతో నిండిపోయాయి. మరి కొన్నిచోట్ల పంటలు వరద దాటికి కొట్టుకుపోయాయి. మొత్తంగా వరుణుడు అన్నదాతకు తీవ్ర నష్టం మిగిల్చాడు. జైనథ్ మండలంలోని పెండల్వాడ, సాంగ్వి గ్రామాల్లోని పంటల దుస్థితికి అద్దంపట్టే చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రోడ్డు సరిగ్గా లేక.. ఆస్పత్రికి తీసుకెళ్లలేక..

నడుచుకుంటూ వెళ్తుండగా తండ్రి చేతుల్లో ప్రాణాలొదిలిన చిన్నారి



అక్షర (ఫైల్)



చిన్నారి మృతదేహాన్ని కాలినడకన తీసుకెళ్తున్న గిరిజనులు

వెల్దుర్తి (తూప్రాన్): వానకు చిత్తడి అవడంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని మట్టిబాటపై నడుచుకుంటూ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తండ్రి చేతుల్లోనే ఓ చిన్నారి ప్రాణాలొదిలిన విషాదఘటన ఇది. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మహ్మద్‌నగర్ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగడ్డ తండాలో సోమవారం జరిగింది. తండా నుంచి ప్రధాన బీటీ రోడ్డు వరకు ఉన్న మట్టిబాట ఇటీవలి వర్షానికి చిత్తడిగా మారింది. అంబులెన్స్, ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. తండాకు చెందిన భోల రేణుక, బాబు దంపతుల ఏకైక కూతురు అక్షర(10) అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లడానికి బాట సరిగా లేక తండ్రి నడుచుకుంటూ సుమారు కిలోమీటరు మేర చేతులపైనే చిన్నారిని తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది.



సీజేను కలిసిన అడ్వొకేట్ జనరల్

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఉన్నత న్యాయస్థానానికి వచ్చిన జస్టిస్ అలోక్ అరాధేను ఆయన చాంబర్‌లో కలిసిన అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, ప్రభుత్వ న్యాయవాదులు ప్రతాప్‌రెడ్డి, సామల రవీందర్ తదితరులు

పాఠశాలల సమయాల్లో స్వల్ప మార్పులు

అన్ని తరగతులూ ఉదయం 9.30 గంటలకే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల పాఠశాల సమయాల్లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. అన్ని తరగతులు ఒకే సమయంలో మొదలయ్యేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి పాఠశాలలు గతంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 3.45 వరకూ కొనసాగేవి. ఇక నుంచి 9.30కు ప్రారంభమై, 4.15 గంటల వరకు కొనసాగుతాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉండేవి. వీటిని 9.30 నుంచి సాయంత్రం 4.45 వరకూ నడిపిస్తారు. హైస్కూల్ క్యాంపస్‌లోనే ఉండే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల వేళల్లో ఎలాంటి మార్పులు లేవు. గతంలో మాదిరి ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.15 వరకూ కొనసాగుతాయి. ఏ స్థాయి స్కూల్ అయినా ఉదయం 9.30కే మొదలవుతుంది. ఈ మేరకు జిల్లా అధికారులకు పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

11 ప్రాజెక్టుల కింద 4.1 లక్షల హెక్టార్లకు సాగునీరు


- పీఎంకేఎస్‌వై పథకంతో తెలంగాణకు లబ్ధి
- రాజ్యసభలో ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కేంద్రం వివిధ పథకాల కింద చేపట్టిన జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలతో పెద్ద ఎత్తున ఆయకట్టు వృద్ధిలోకి వచ్చినట్లు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. ముఖ్యంగా ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద తెలంగాణలో 11 ముఖ్యమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి వీటికింద 5.7 లక్షల హెక్టార్ల ఆయకట్టును వృద్ధిలోకి తేవాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 4.1 లక్షల హెక్టార్లను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. సోమవారం రాజ్యసభలో రాష్ట్రంలో జల వనరుల అభివృద్ధికి కేంద్రం తీసుకున్న చర్యలు, రైతులకు కలిగిన ప్రయోజనాలపై బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ రాతపూర్వక సమాధానమిచ్చారు. ట్రిపుల్‌ఆర్ పథకం కింద రాష్ట్రంలో 575 నీటి కుంటలను అభివృద్ధి చేసి 29.01 వేల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరందించాలని నిర్ణయించగా, ఇందులో ఇప్పటికే 488 నీటి కుంటల కింద 25.98 వేల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీటిని అందించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. గత ఐదేళ్లలో ముక్తేశ్వరం (చిన్న కాళేశ్వరం), కడెం (గూడెం) వంటి రెండు ఎత్తిపోతల పథకాలు, చనాక– కొరాట బ్యారేజీ, చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి లిఫ్టు, మోదికుంటవాగు ప్రాజెక్టులకు జలశక్తి శాఖ సలహా కమిటీ ఆమోదం తెలిపిందని చెప్పారు. వీటి ద్వారా 45 వేల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. దీంతోపాటే 'పర్ డ్రాప్– మోర్ క్రాప్'పథకం కింద, మైక్రో ఇరిగేషన్ విధానంలో రైతులకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు.

రెయిన్ అలర్ట్

- నేడు, రేపు పలుచోట్ల భారీనుంచి అతిభారీ వర్షాలకు అవకాశం
- హెచ్చరించిన వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలుచోట్ల రానున్న రెండురోజుల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు నమోదయ్యే అవకాశమున్నట్టు వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రానికి రెడ్‌అలర్ట్ జారీ చేసింది. గతవారంలో నాలుగు రోజులపాటు ఎడతెరిపి లేకుండా, ఆ తర్వాత మూడురోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. వాయవ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సోమవారం సాయంత్రం సమయానికి అల్పపీడనం ఏర్పడింది. ఇదిక్రమంగా బలపడి ఈనెల 26వ తేదీనాటికి వాయుగుండంగా మారి, ఇది నెమ్మదిగా కదులుతూ పశ్చిమ వాయవ్యదిశగా ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు చేరుకునే అవకాశమున్నట్టు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు, ఒకటిరెండు చోట్ల అత్యంత భారీవర్షాలు నమోదు కావొచ్చని సూచించింది. వర్షాలకు తోడుగా రాష్ట్రంలో గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది.



హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

20శాతం అధిక వర్షపాతం

ప్రస్తుత నైరుతిసీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటివరకు 20 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

- సాధారణంగా ఏటా జూన్ 1వ తేదీ నుంచి జూలై 25వ తేదీ వరకు రాష్ట్రంలో 30.5 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదవాల్సి ఉండగా.. ఈసారి అంతకన్నా ఎక్కువగా 36.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.
- శనివారం సాయంత్రం రాష్ట్రంలో పలుచోట్ల భారీవర్షాలు నమోదయ్యాయి. నాలుగుజిల్లాల్లో అత్యంత వర్షపాతం నమోదు కాగా, 13 జిల్లాల్లో అధిక వర్షపాతం, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.
- ఖమ్మం జిల్లాలో మాత్రం ఇంకా లోటు వర్షపాతం కొనసాగుతోంది.
- రాష్ట్రవ్యాప్తంగా సోమవారం సాయంత్రం విస్తారంగా వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పరిధిలో పలుచోట్ల పది సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది.

తగ్గుతున్న గోదా'వడి'!

పరీవాహక ప్రాంతంలో తగ్గుముఖం పట్టిన వానలు

- భద్రాచలం వద్ద 36.8 అడుగులకు దిగొచ్చిన నీటి మట్టం
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 9 లక్షల క్యూసెక్కులకుపైగా సముద్రంలోకి..
- మళ్లీ వానలు పడుతుండటంతో కొనసాగుతున్న అప్రమత్తత
- ఎగువన కృష్ణా నదిలోనూ పెరుగుతున్న ప్రవాహాలు

సాక్షి, హైదరాబాద్: పరీవాహక ప్రాంతంలో వానలు తగ్గుముఖం పట్టడం.. ఉప నదులు, వాగుల ప్రవాహాలు తగ్గడంతో గోదావరి శాంతిస్తోంది. భద్రాచలం వద్ద మూడు రోజులుగా గణనీయ స్థాయిలో కొనసాగుతున్న వరద సోమవారం సాయంత్రానికి 6,56,134 క్యూసెక్కులకు, నీటి మట్టం 36.8 మీటర్లకు తగ్గింది. ఈ నీరంతా పోలవరం ప్రాజెక్టుకు చేరుతుండగా.. 48 గేట్ల ద్వారా వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీలోకి 9,18,142 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 11,400 క్యూసెక్కులను విడుదల చేస్తూ, మిగతా నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో..

ఆదివారం వర్షాలు తగ్గడంతో ఎగువ గోదావరిలోనూ ప్రవాహం తగ్గింది. సోమవారం సాయంత్రానికి శ్రీరాంసాగర్‌లోకి కేవలం 19,722 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 89,092 క్యూసెక్కులు వస్తుండగా, అంతా దిగువకు వదిలేస్తున్నారు. ఇక మేడిగడ్డకు 5,56,840 క్యూసెక్కులు.. తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజీకి 6,67,040 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతా విడుదల చేస్తున్నారు. అయితే గోదావరి బేసిన్‌లో సోమవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ వానలు మొదలవడంతో.. మంగళవారం నుంచి గోదావరిలో వరద తిరిగి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు అప్రమత్తత కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

ఆల్మట్టికి పెరిగిన వరద

పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఎగువన కృష్ణాలో ప్రవాహాలు పెరుగుతున్నాయి. సోమవారం కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి 1,14,445 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. నీటి నిల్వ 64.41 టీఎంసీలకు చేరుకుంది. మరో 65 టీఎంసీలు చేరితే ఆల్మట్టి నిండుతుంది. దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్‌లోకి 13,675 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక్కడ నీటి నిల్వ 19.09 టీఎంసీలకు చేరింది. మరో 18 టీఎంసీలు వస్తే నిండిపోయి.. నీటిని దిగువకు వదలనున్నారు. ఇక మన రాష్ట్రంలోని జూరాల ప్రాజెక్టుకు 26,244 క్యూసెక్కుల వరద వస్తోంది. ఇక్కడ నీటి నిల్వ గరిష్టస్థాయికి చేరుకోవడంతో విద్యుదుత్పత్తి చేస్తూ 33,235 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రలోనూ వరద పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 47,294 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 25.42 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం డ్యామ్‌లోకి సోమవారం సాయంత్రం 6 గంటలకు 4,045 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. నీటి నిల్వ 35.47 టీఎంసీలకు చేరింది. మూసీ ప్రవాహంతో నాగార్జునసాగర్‌కు వరద స్థిరంగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టులోకి 8,532 క్యూసెక్కులు వస్తోంది. నీటి నిల్వ 18.73 టీఎంసీలకు చేరుకుంది.

రోడ్లను వెంటనే బాగు చేయండి.. అధికారులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో పాడైన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన రాష్ట్ర రహదారుల విభాగం అధికారులతో సమీక్షించారు. రాజీవ్ రహదారి, నార్కెట్‌పల్లి–మేడరమెట్ల రహదారుల్లో చాలాచోట్ల గోతులు ఏర్పడినట్టు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. వీటితోపాటు ఇతర రోడ్లలో ఎంత నష్టం వాటిల్లిందో త్వరలో వివరాలు అందజేస్తామని పేర్కొన్నారు.



బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలి

- పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశ పెట్టాలి
- జాతీయ బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్‌లో భారీ ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ మహిళలకు సబ్ కోటా ఇచ్చినప్పుడే వారికి కూడా రాజ్యాధికారం దక్కుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో బీసీ మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డా.పద్మలత ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా భారీ ధర్నా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అధ్యక్షత వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో బీసీ వర్గాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మహిళా బిల్లు ఆమోదం పొందాలంటే బీసీ మహిళలకు సబ్–కోటా ఇవ్వక తప్పదన్నారు. మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా – ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

'అధిక పెన్షన్' నోటీసులు షురూ

- దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం
- అర్హత ఉన్నవారికి నోటీసులు జారీ చేస్తున్న ఈపీఎఫ్‌ఓ
- చెల్లించాల్సిన నిధులు, బకాయిల వసూళ్లపై లెక్కలు
- హైదరాబాద్ ఆఫీస్ పరిధిలో 1.1 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) యంత్రాంగం అధిక పెన్షన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసింది. దేశవ్యాప్తంగా 18.8 లక్షల మంది చందాదారులు అధిక పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీస్ పరిధిలో దాదాపు 1.1 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీటి పరిశీలనకు గరిష్టంగా నాలుగు నెలల గడువును నిర్దేశించుకున్న ఈపీఎఫ్‌ఓ.. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమించింది. వారు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా అధిక పెన్షన్‌కు అర్హతను ఖరారు చేయడంలో కీలకమైన 26(6) ఆప్షన్ ఫారాన్ని పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో లోటుపాట్లను గుర్తిస్తున్న అధికారులు.. దరఖాస్తు దారులకు నోటీసుల జారీకి చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా యాజమాన్యం వద్ద పెండింగ్ ఫైళ్లకు సంబంధించిన అంశాలను కూడా ప్రత్యేక చొరవ తీసుకుని కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

కంపెనీకి సమాచారం.. వ్యక్తిగత నోటీసులు

అధిక పెన్షన్ అర్హతకు సంబంధించిన సమాచారాన్ని ఈపీఎఫ్‌ఓ అధికారులు రెండు రకాలుగా వర్గీకరించి దరఖాస్తుల పరిశీలనను తదుపరి దశకు పంపిస్తున్నారు. అర్హత తేలితే అటు కంపెనీ యాజమాన్యానికి, ఇటు దరఖాస్తుదారుకు వ్యక్తిగతంగా సమాచారాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో పెండింగ్ పత్రాల సమర్పణకు సంబంధించిన సమాచారాన్ని స్వీకరిస్తున్నారు. అదేవిధంగా అధిక పెన్షన్ కోటాలో చందాదారు చెల్లించిన మొత్తం, అధిక పెన్షన్ ఇవ్వాల్సి వస్తే చెల్లించాల్సిన బకాయిలు, వసూ లు చేయాల్సిన మొత్తం తదితరాలన్నీ లెక్కించి దరఖాస్తుదారుకు నోటీసు లు ఇస్తున్నారు. దరఖాస్తుదారు చెల్లించాల్సిన మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేలా ప్రత్యేకంగా ఎంపిక చేసిన ఫార్ములా ఆధారంగా చర్యలు వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం వారంలో ఐదు రోజుల పాటు ఈపీఎఫ్‌ఓ అధికారులు అధిక పెన్షన్ దరఖాస్తుల పరిశీలన కోసం సమయం ఇస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలోనే పరిశీలిస్తున్నప్పటికీ.. చందాదారుకు మాత్రం పోస్టు ద్వారా సంబంధిత సమాచారాన్ని చేరవేస్తున్నారు. దేశవ్యాప్తంగా మరో నాలుగు నెలల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు.

కి'లేడీ'నే కీలకం!

రూ.712 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ సూత్రధారి చైనా మహిళ షాషా

2020లో చైనాలో ఆమెను కలసిన ప్రకాశ్ ప్రజాపతి

ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: చైనా కేంద్రంగా నడిచిన రూ.712 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో ఆ దేశానికి చెందిన షాషా అనే మహిళ కీలకంగా వ్యవహరించినట్టుగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఆమె ఆదేశాల మేరకు పనిచేసిన అహ్మదాబాద్ వాసి ప్రకాశ్ మూల్‌చంద్ భాయ్ ప్రజాపతిపై దేశవ్యాప్తంగా 600 కేసులు ఉన్నాయని.. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కూడా గతంలో ఓ కేసులో నోటీసులు ఇచ్చారని, మరోసారి అరెస్టు చేశారని తేల్చారు. ఇక ఈ కేసు దర్యాప్తు కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రంగంలోకి దిగారు. సోమవారం సైబర్ క్రైమ్ ఠాణాకు వచ్చిన ప్రత్యేక బృందం అధికారులతో భేటీ అయి వివరాలను తెలుసుకుంది.

వస్త్ర వ్యాపారం నేపథ్యంలో పరిచయం

ప్రకాశ్ ప్రజాపతి తన సోదరుడు కుమార్ ప్రజాపతితో కలసి అహ్మదాబాద్‌లో హోల్‌సేల్ వస్త్ర వ్యాపారం చేస్తుండేవాడు. తరచుగా చైనా వెళ్లి హోల్‌సేల్‌గా వస్త్రాలు కొనితెచ్చుకునేవారు. ఈ క్రమంలోనే 2020లో బీజింగ్ వెళ్లినప్పుడు షాషాతో పరిచయమైంది. ప్రకాశ్‌ను ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లోకి దింపిన షాషా ఆ వ్యవహారంలో భాగమైన ఇతర చైనీయులనూ పరిచయం చేసింది. ప్రజాపతికి ఇప్పటివరకు కమీషన్‌గా రూ.2.8 కోట్లకుపైనే వచ్చిందని, ఆ మొత్తాన్ని చైనీస్ క్రిప్టో వాలెట్‌లో పెట్టుబడిగా పెట్టాడని అధికారులు చెప్తున్నారు. ఈ ముఠా చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాలను భారత్‌తో విక్రయిస్తున్నట్టు ఇన్వాయిస్‌లు సృష్టించి, ఆర్థిక లావాదేవీలు చేస్తున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

అనేక రాష్ట్రాల్లో వాంటెడ్‌గా..

ప్రకాశ్ ప్రజాపతి 2020 నుంచీ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌కు సహకరిస్తున్నాడు. అతడిపై ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వివిధ ఠాణాల్లో 1,500 కేసులు నమోదై ఉన్నట్లు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా గుర్తించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలోనే 12 కేసులు ఉన్నాయి. ప్రకాశ్ ప్రజాపతిని అరెస్టు చేయడానికి 2021లోనే ఓ బృందం అహ్మదాబాద్ వెళ్లింది. కానీ అనారోగ్యమంటూ ఆస్పత్రిలో చేరడంతో 41ఏ నోటీసులు ఇచ్చివచ్చారు. తర్వాత 2022లో మరో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కానీ అప్పట్లో అతడి వెనుక ఇంత భారీ నెట్‌వర్క్ ఉన్నట్టు బయటపడలేదు. ప్రకాశ్ ప్రజాపతికి చైనాతోపాటు సింగపూర్, మలేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్‌లో ఉన్న సూత్రధారులతో సంబంధాలు ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఆయా దేశాల వాలెట్లకు క్రిప్టో కరెన్సీని బదిలీ చేసిన అంశంపై దృష్టి పెట్టారు. ఇక శనివారం అరెస్టు చేసిన ప్రజాపతి బ్రదర్స్ సహా తొమ్మిది మందిని తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. అయితే ఈ వ్యవహారంలో కీలకమైన చైనా మహిళ షాషా ఎవరనేది గుర్తించాల్సి ఉందని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు.

రంగంలోకి ఈడీ

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో మనీ లాండరింగ్, ఫెమా ఉల్లంఘన వంటి అంశాలు ఉన్నాయని ఇప్పటికే పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈడీ కూడా రంగంలోకి దిగింది. సోమవారం సైబర్ ఠాణాకు వచ్చిన ఈడీ ప్రత్యేక బృందం.. డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ కేవీఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌లతో సమావేశమైంది. కేసు అంశాలు, దర్యాప్తు వివరాలను సేకరించింది. త్వరలోనే ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు?

- వర్షాల కారణంగా అడ్మిషన్లకు ఆటంకం
- గడువు పెంచాలంటూ అధికారుల నివేదిక
- బోర్డు హెచ్చరికతో దారికొచ్చిన ప్రైవేటు కాలేజీలు
- 3 లక్షలు దాటిన ఫస్టియర్ ప్రవేశాలు



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ప్రవేశాల గడువు మంగళవారంతో ముగుస్తోంది. అయితే ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరగలేదు. దీంతో మరికొంత గడువు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అడ్మిషన్లు సరిగా జరగడం లేదని జిల్లాల్లోని ఇంటర్ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా మరికొంత గడువు పొడిగించాలని ఉన్నతాధికారులను కోరారు. దీంతో క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ప్రవేశాల గడువు పెంపునకు ఇంటర్ బోర్డు అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లు ఇప్పటికే దాదాపు పూర్తయ్యాయని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కాలేజీల్లోనే సమస్య ఉందని అధికారులు తెలిపారు.

హెచ్చరికతో ప్రైవేటు కాలేజీలు అప్రమత్తం..

రాష్ట్రవ్యాప్తంగా 3,339 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉండగా.. వీటిల్లో ఇప్పటి వరకు 3,27,202 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. గత ఏడాది (2022–23) కాలేజీల సంఖ్య 3,107 మాత్రమేకాగా, 4,98,699 మంది విద్యార్థులు చేరారు. దీనిని బట్టి దాదాపు 1.7 లక్షల మంది విద్యార్థులు ఇంకా చేరాల్సి ఉందని తెలుస్తోంది. వారంరోజుల క్రితం వరకూ ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నా, ప్రవేశాలను బోర్డుకు చూపించలేదు. విద్యార్థుల ప్రవేశాలు ఒకచోట, వారు చదివేది మరోచోట ఉండేలా కాలేజీలు చేస్తున్న మాయాజాలంపై ఇంటర్ బోర్డు ఉక్కుపాదం మోపడమే ఈ ఆలస్యానికి కారణమని తెలుస్తోంది. 'సాక్షి'ఈ విషయాన్ని వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం స్పందించింది. అడ్మిషన్లు ముగిసే నాటికి ప్రవేశాలు చూపించని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ హెచ్చరించారు. దీంతో గత వారం లక్ష వరకూ ఉన్న అడ్మిషన్ల సంఖ్య ప్రస్తుతం 2 లక్షలు దాటింది. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ కాలేజీల్లోనూ ప్రవేశాలు కొంత పెరిగాయి.

ధనవంతులు, కులీనులు అహంకారం చూపితే అది వారికి వినాశనం అవుతుంది. యోగ్యత, కీర్తి పొందాలంటే అణకువగా ఉండాలి. అదే స్వర్గపు దారి.
– తావోయిజం

సాక్షి
మంగళవారం, 25 జులై 2023

బియ్యమో... రామచంద్రా!

గడచిన కొద్దిరోజులుగా అమెరికాలోని దుకాణాల వద్ద భారతీయుల భారీ క్యూలు ఓ హాట్ టాపిక్. రానున్న రోజుల్లో బియ్యానికి కొరత రావచ్చనే భయంతో, నిల్వ చేసుకొనేందుకు ప్రవాస భారతీయులు పెద్దయెత్తున కొనుగోళ్ళకు దిగడంతో తలెత్తిన దృశ్యమది. ఉరుము లేని పిడుగులా బాస్మతి బియ్యం మినహా మిగతా రకాల తెల్ల బియ్యం ఎగుమతుల్ని తక్షణమే నిషేధిస్తూ భారత సర్కార్ గత గురువారం తీసుకున్న ఆకస్మిక నిర్ణయంతో రేపు ఇలాంటి దృశ్యాలు ఇంకేం తలెత్తుతాయో తెలీదు. ప్రపంచ బియ్యం మార్కెట్‌ను ఇది ఆశ్చర్యపరిచినప్పటికీ, పెరిగిపోతున్న ధాన్యం ధరలను నియంత్రించడం రానున్న ఎన్నికల దృష్ట్యా పాలకులకు అనివార్యమైంది. దేశీయంగా సరఫరా పెంచడానికీ, ద్రవ్యోల్బణానికి ముకుతాడు వేసేందుకూ బియ్యం ఎగుమతులపై ఈ తక్షణ నిషేధం ఉపకరిస్తుందని సర్కార్ భావన. అందుకే, 10 నెలల క్రితం బియ్యం ఎగుమతులపై 20 శాతం సుంకం వేసి, ఆంక్షలు పెట్టిన పాలకులు అది ఫలించక ఇప్పుడు నిషేధమే విధించారు.

భారత్ మాటెలా ఉన్నా ఇది ప్రపంచానికి ప్రాణసంకటమే. ఇటీవలే నల్లసముద్రపు ఆహార ధాన్యాల ఒప్పందాన్ని రష్యా రద్దు చేసుకోవడంతో వివిధ దేశాల్లో గోదుమలు, మొక్కజొన్నల ధర నింగికెగసింది. ఇప్పుడు భారత బియ్యం ఎగుమతి నిషేధమూ తోడయ్యేసరికి, ప్రపంచ ఆహార ధరలు ఇంకా పెరగవచ్చని ఆందోళన రేగుతోంది. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా బియ్యం ఎగుమతయ్యేది మన దేశం నుంచే! ప్రపంచ పామాయిల్ ఎగుమతుల్లో ఇండొనేసియా, మలేసియా ఎలాగో బియ్యానికి సంబంధించి మనం అలా! ఎగుమతుల్లో 40 శాతానికి పైగా మన దేశానివే! ఇప్పుడు మన ఉత్పత్తుల్లో ఉన్నతశ్రేణిదిగా భావించే బాస్మతి మినహా మిగతా రకాల బియ్యానికి తాజా నిషేధం వర్తిస్తుంది. పెరిగిన అంతర్జాతీయ అమ్మకాలు సైతం ఈ నిషేధానికి కారణం. గత ఆర్థిక సంవత్సరం భారత్ నుంచి బియ్యం ఎగుమతులు 23 శాతం పెరిగాయి. ఈ ఏడాదిలో జూన్ వరకు మన బియ్యం అంతర్జాతీయ అమ్మకాలు 35 శాతం హెచ్చాయి. వెరసి, గత నెల రోజుల్లో దేశంలో బియ్యం రేటు 3 శాతం పెరిగింది. ఏడాది క్రితంతో పోలిస్తే 11.5 శాతం పెరిగిందని సర్కారే చెబుతోంది.

అదేసమయంలో, దేశీయంగా వరి ఉత్పత్తి పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఒకపక్క పంజాబ్, హర్యానా లాంటి చోట్ల వర్షాలతో వరి పంట దెబ్బతింది. మరోపక్క అదనులో తగినంత వర్షాలు పడక కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు వగైరాల్లో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. దీంతో భవిష్యత్తులో బియ్యం సరఫరాకు కొరత రావచ్చు. అదే జరిగితే నింగినంటుతున్న ధరలు నేలకు రావడం కష్టమే. ఎన్నికల వేళ అది దెబ్బ తీస్తుందని భావించిన పాలకులు ఎగుమతులపై నిషేధాస్త్రం సంధించారు. మన దేశపు బియ్యం ఎగుమతుల్లో 25 నుంచి 30 శాతం ఇప్పుడు నిషేధానికి గురైన ఈ బాస్మతీయేతర తెల్ల బియ్యమే. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మన దేశం 1.7 కోట్ల టన్నులకు పైగా బియ్యాన్ని భారత్ ఎగుమతి చేస్తోంది. నిషేధంతో ఈ ఎగుమతులు 40 శాతం పడిపోవచ్చు. సహజంగానే దీనిపై దేశంలోని ఎగుమతిదారుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఈ నిషేధం తాత్కాలికమేననీ, మహా అయితే ఆరు నెలల వరకే ఉండచ్చనీ, ప్రపంచ వాణిజ్య సంస్థ బరిలోకి దిగాక పరిస్థితి చక్కబడుతుందనే ఆశ లేకపోలేదు.

బంగ్లాదేశ్, అంగోలా, గినియా, కెన్యా, నేపాల్ సహా 140కి పైగా దేశాలకు మన దేశం బియ్యం ఎగుమతి చేస్తోంది. థాయిలాండ్, వియత్నామ్, పాకిస్తాన్, మయన్మార్ లాంటి ఇతర ఎగుమతి దేశాలూ ఉన్నా భారత నిర్ణయంతో ఏర్పడ్డ లోటును అవి భర్తీ చేయలేవు. ఫలితంగా, విపణిలో ఇతర ఆసియా దేశాల నుంచి వచ్చే బియ్యం ధరలూ పెరిగాయి. బియ్యం ఎగుమతిలో ప్రపంచంలో రెండు, మూడు స్థానాల్లో ఉన్న థాయిలాండ్, వియత్నామ్‌ల బియ్యం రేటు హెచ్చింది. రష్యా యుద్ధంతో ఉక్రెయిన్ నుంచి ఎగుమతులకు ఆటంకం చాలదన్నట్టు అమెరికాలో ధాన్యం పండించే ప్రాంతాలు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావంతో సతమతమవుతున్నాయి. ఈసారి అమెరికాలో గోదుమల దిగుబడి తగ్గవచ్చు. 16 ఏళ్ళలో ఎన్నడూ లేనంత తక్కువకు నిల్వలు పడిపోవచ్చు. గోదుమలు, బియ్యం – రెంటికీ అగ్రరాజ్యంలో కటకట రావచ్చు.

గత ఏడాది మేలో గోదుమల ఎగుమతిపై నిషేధం, సెప్టెంబర్‌లో విరిగిన బియ్యంపైన నిషేధం, బాస్మతీయేతర బియ్యంపై 20 శాతం సుంకం విధింపు... ఆ వరుసలో వచ్చినదే భారత సర్కార్ తాజా ఉత్తర్వు. ఈ ఏడాది మే నుంచి పంచదార ఎగుమతుల్నీ ఆపారు. ఇవన్నీ తిరోగామి చర్యలైనా, దేశీయ సరఫరాలో ఇబ్బందులతో అనివార్యమైంది. ఇప్పుడిప్పుడే వర్షాలు పుంజుకుంటున్నా, నాట్లలో జరిగిన జాప్యం దెబ్బతీయవచ్చు. ఇక, ఎల్‌నినో పొంచి ఉండనేవుంది. వీటన్నిటి మధ్య ఈ ఏటి దిగుబడి పరిస్థితి ఏమిటో ఇప్పుడే చెప్పలేం. కానీ, గత ఆర్థిక సంవత్సరం బియ్యం, గోదుమలు – రెండూ ఎన్నడూ లేనంత అధిక దిగుబడినిచ్చాయని జబ్బలు చరుచుకున్నాం. ప్రపంచానికి మనమే ఆహారం అందిస్తున్నామన్నాం. తీరా అప్పుడు గోదుమలు, ఇప్పుడు బియ్యంపై ఇలా నిషేధం విధించాల్సి రావడమేమిటి? ఇది బేతాళ ప్రశ్న. అలాగే, ఏళ్ళ తరబడి కష్టంతో ప్రపంచ విపణిలో ఎగుమతిదారుగా సంపాదించుకున్న పేరుకు ఈ నిషేధపుటుత్తర్వులు చేటు చేస్తాయి. గుండుగుత్తగా ఎగుమతులపై నిషేధమనే కన్నా, నిర్ణీత కనీస ధరకు తక్కువైతే ఎగుమతుల్ని అనుమతించబోమని చెప్పవచ్చు. దేశీయంగా ఆహార ధరలు నియంత్రించాలంటే పాలకులు ప్రత్యామ్నాయాలు ఆలోచించక తప్పదు. వాణిజ్య విధానాన్ని ఘడియకోసారి మార్చడం మార్గం కానే కాదు!

వేధిస్తున్న విపరిణామాలు


ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

వందేళ్లలో ప్రపంచ ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. ఫలితంగా వ్యవసాయోత్పత్తులు దెబ్బతింటున్నాయి. దీనివల్ల ఆహారోత్పత్తుల ధరలు చుక్కలనంటి, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అయితే, వందేళ్లలో మారిన ప్రకృతి విపరిణామాల గురించి ఆలోచిస్తున్నాం సరే, మరి సమాజంలో ఇంకా మారని దుష్పరిణామాల గురించి ఆలోచిస్తున్నామా? మనుషుల మధ్య ఉన్న పెక్కు సామాజిక అసమానతలు ఇప్పటికీ తొలగిపోవడం లేదు. అంటరానితనమనే రుగ్మత ఇంకా పీడిస్తున్న పెను'రోగం'గానే ఉంది. 'ఎల్‌నినో' వాతావరణాన్ని ప్రభావితం చేస్తే... కుల వ్యవస్థ, మత వ్యవస్థలు సంఘ జీవనాన్ని ఇప్పటికీ కలుషితం చేస్తూనే ఉన్నాయి.

"గత వందేళ్లలోనే ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగాయి. 2100 సంవత్సరానికల్లా అనూహ్యంగా 4 సెంటిగ్రేడ్ డిగ్రీలు పెరగనున్నాయి. కాగా, ఇంతవరకు ప్రపంచ వాతావరణ రికార్డులో లేని వేడిమి 2022లో నమోదైంది. అంతేగాదు, తరచుగా దక్షిణ ఆసియాలో బ్లిట్జీటుగా ఉధృతమవుతున్న వేడిగాలులు రానున్న సంవత్సరాల్లో కూడా కొనసాగబోతున్నాయి. ఇంతగా వేడి గాలులు భారతదేశంలోని ఉత్తరాది రాష్ట్రాలలోనే గాక, దక్షిణాది రాష్ట్రాలను కూడా అమితంగా పీడిస్తున్నాయి. ఢిల్లీని 72 ఏళ్ల చరిత్రలో ఎరగని ఉష్ణోగ్రతలు ఈ ఏడాది కుదిపేశాయి. ప్రపంచ వాతావరణంలో అనూ హ్యమైన స్థాయిలో (40 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించి) వేడిగాలులు వీచే ఈ పరిస్థితుల్లో, భారత్, చైనా, పాకిస్తాన్, ఇండోనేసియా లాంటి దేశాల్లో బయటి పనిచేసుకుని బతకాల్సిన దినసరి కార్మికులు యమ యాతనలకు గురికావల్సి వస్తుంది. 1971–2019 సంవత్సరాల మధ్య ఇండియాను చుట్టబెట్టిన అసాధారణ వేడిగాలుల ఫలితంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితులు మళ్లీ పునరావృతమయ్యే ప్రమాదం ఉంది."

– ప్రొఫెసర్స్ వినోద్ థామస్, మెహతాబ్ అహ్మద్ జాగిల్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్

ఈ 'మిడిమేల'మంతా భారతదేశాన్ని ఎలా చుట్టబెడుతోంది? మరో వైపు, గత ఏడేళ్లుగా పసిఫిక్ మహాసముద్రం నుంచి ఏనాడూ ఎరుగనంతటి వేడి గాలులకు నిలయమైన 'ఎల్‌నినో' వాతావరణ దృశ్యం భారత దేశాన్ని 'కుమ్మేస్తూ' ముంచుకొస్తోంది. ఫలితంగా వ్యవసాయోత్పత్తులు దెబ్బతింటున్నాయి. దీనివల్ల తీవ్రమైన సామాజిక పరిస్థితులు తలెత్తి, ఆహారోత్పత్తుల ధరలు చుక్కలనంటి, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని సిడ్నీ యూనివర్సిటీ ఆర్థిక శాస్త్రాచార్యులు డేవిడ్ యుబిలావా హెచ్చరిస్తున్నారు. 'ఎల్‌నినో' ప్రభావం అన్ని చోట్లా ఒకే తీరుగా ఉండదు. కాకపోతే, పెక్కు దేశాలకు వర్తక వ్యాపారాల సంబంధ బాంధవ్యాలున్నందువల్ల ఆర్థికపరమైన ఒడిదుడుకులు అనివార్యమవుతాయి. కొన్నిచోట్ల కరువు కాటకాలతో పాటు, సామాజిక ఒడిదుడుకులు అనివార్యమనీ అంచనా!

రెండో మాట



ఇప్పటికే మనుషుల మధ్య పెక్కు సామాజిక అసమానతలు ఉన్నాయి. అంటరానితనమనే రుగ్మత పెక్కుమందిని ఇంకా పీడిస్తున్న పెను'రోగం'గానే ఉంది. 'ఎల్‌నినో' లాంటి వాతావరణం వల్ల వారి జీవితాలకు మరిన్ని అవాంతరాలు తోడవుతున్నాయి. ఈ జాడ్యం ఇప్పుడే గాదు, 'ఏలినాటి శని'గా మనదాకా దాపురించి ఉన్నందుననే – మహాకవి జాషువా ఏనాడో ఇలా చాటాడు:

"అంటరాని తనంబునంటి భారత జాతి
భువన సభ్యత గోలుపోయె...
నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును కాల్చివేయు"

అంతేనా? తాను 'పుట్టరాని చోట పుట్టినందుకు' అసమానతా భారతంలో ఎన్ని అగచాట్లకు గురయ్యాడో వెలిబుచ్చిన గుండె బాధను అర్థం చేసుకోగల మనస్సు కావాలని ఇలా కోరుకున్నాడు:

"ఎంత కోయిల పాట వ్యథయయ్యెనొ కదా
చిక్కు చీకటి వన సీమలందు
ఎన్ని వెన్నెల వాగు లింకి పోయెనొ కదా
కటిక కొండల మీద మిటకరించి
ఎన్ని కస్తూరి జింక లీడేరెనో కదా
మురికి తిన్నెల మీద పరిమళించి
ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనొ కదా
పండిన వెదురు జొంపములలోన
ఎంత గంధవహన మెంత తంగేటి జున్ను
యెంత రత్నకాంతి యెంత శాంతి
ప్రకృతి గర్భమందు భగ్నమైపోయెనొ
పుట్టరాని చోట బుట్టుకతన..."

'ఎల్‌నినో' వాతావరణాన్ని ప్రభావితం చేస్తే... కుల వ్యవస్థ, మత వ్యవస్థలు సంఘ జీవనాన్ని ఇప్పటికీ ఎలా కలుషితం చేస్తున్నాయో 'గబ్బిలం' దీనావస్థ ద్వారా జాషువా వ్యక్తం చేశారు. 'పూజారి' లేని సమయం చూసి నీ బాధను శివుడి చెవిలో విన్నవించుకోమంటాడు. అప్పటికీ ఇప్పటికీ – పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రంగా వ్యవస్థ అవస్థ పడుతూనే ఉంది. కనుకనే జాషువా 'ముప్పయి మూడు కోట్ల దేవతలు ఎగబడ్డ దేశంలో భాగ్యవిహీనుల కడుపులు చల్లారుతాయా' అని ప్రశ్నించాడు!

అలాగే అనేక ప్రకృతి వైపరీత్యాల నుంచి మానవుల్ని క్షేమంగా గట్టెక్కించే ఔషధాలు, వాటి విలువల్ని తొలిసారిగా ప్రపంచానికి వెల్లడించిన 18వ శతాబ్ది కవి చెళ్లపిళ్ల నరస కవి. ఒక్క 'కరణి' అన్న పదంతోనే (ఒక రీతి, ఒక పద్ధతి) ధరణిని శ్వాసించి, శాసించిన కవి! ఆయన గ్రంథం 'యామినీ పూర్ణతిలకా విలాసం' ఎన్ని రకాల ఔషధాలనో వెల్లడించింది: చనిపోయిన వారిని బతికించే ఔషధి – 'సంజీవకరణి', విరిగిపోయిన ఎముకల్ని అతికించేది– 'సంధాన కరణి', తేజస్సును కోల్పోయిన మనిషికి తేజస్సు ప్రసాదించే ఔషధం – 'సావర్ణకరణి', మనిషి శరీరంలో విరిగి పోయిన ఎముక ముక్కల్ని తొలగించేది – 'విశల్యకరణి'. ఇవన్నీ నరస కవి చూపిన ప్రకృతిలోని పలు రకాల ఔషధాలు! కళల్ని మెచ్చుకుని వాటికి కాంతులు తొడిగే శిల్పుల్ని నిరసించడం తగదు గదా! ఎందుకని? 'వానతో వచ్చే వడగండ్లు' నిలుస్తాయా?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తిండి తిప్పలు



గందరగోళం మొదలైంది. కొన్ని రకాల బియ్యం ఎగుమతులను ఇండియా నిషేధించింది. దాంతో జనం భయంతో వాటిని కొనడం మొదలుపెట్టారు. (టెక్సాస్ నగరం డాలస్‌లో జనపు రద్దీని తెలియజేసే వీడియోను షేర్ చేశారు.)

– ఇయాన్ మైల్స్ చియాంగ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కదా!



నిజంగానే ప్రార్థనలు పనిచేసి ఉంటే, ఔషధాలు కనిపెట్టవలసిన అవసరం ఉండేది కాదు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

తప్పే!



మణిపూర్‌లో స్త్రీల పట్ల జరిగిన అతి దారుణ లైంగిక హింసకు సంబంధించిన నిందితుల్లో ఇద్దరు వ్యక్తులను గుర్తించారని చెప్పే ఒక తప్పుడు ట్వీట్‌ను నేను రీట్వీట్ చేసినందుకు నా తీవ్ర క్షమాపణలు. ఉద్దేశపూర్వకం కాని ఈ ఇబ్బందికి గురిచేయడం పట్ల నేను బేషరతుగా క్షమాపణ చెబుతున్నాను. ('వాళ్ల దుస్తులతో గుర్తించండి' అని ఇద్దరు ఆర్‌ఎస్‌ఎస్ తండ్రీ కొడుకుల ఫొటో షేర్ చేశారు.)

– సుభాషిణీ అలీ, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

సాక్ష్యం



లద్దాఖ్‌లోని ఏ వివాదమూ లేని 4,056 చదరపు కిలోమీటర్ల భూమిని (ఏప్రిల్ 2020 నుంచి) చైనా లాక్కోవడానికి అనుమతించి, పైగా 'ఎవరూ రాలేదు' అని చెబుతూ, దురాక్రమణదారుగా కూడా చైనా పేరు ఎత్తడం లేదంటే– చైనాకు మోదీ లొంగిపోయారని చెప్పొచ్చు.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

మీకు మాత్రమేనా?



మెరుగైన జీవితం కోసం యూరప్, అమెరికాల లౌకిక దేశాలకు ముస్లిం పురుషులు వలస పోతారు. కానీ అదే మెరుగైన జీవితం వారి స్త్రీలకు ఉండాలని వారు కోరుకోరు. వాళ్లను అదే బుర్ఖాలు, నిఖాబులు, హిజాబుల్లోనే బంధించాలనుకుంటారు. ఆ దేశాల్లోని స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అనుభవించే వీలు ఈ మహిళలకు లేదు.

– మెహ్రజ్ వసీమ్, ఆర్టిస్ట్

ఇదో కోణం



మిగిలిన జనాలకు తెలియనివి, తాము మాత్రమే ప్రత్యేకంగా అనుభవించాలని అత్యంత శ్రీమంతులు అంతరిక్షంలోకి ఎగరడమో, మహాసముద్రాల లోతుల్లో ఈదడమో చేస్తున్నారంటే– ఇదొక విచిత్ర సంతృప్తిని కలిగించే ప్రపంచ స్థితిని తెలియజేస్తోంది. అత్యంత ధనవంతులు మాత్రమే అనుభవించే నిజ ఉత్పత్తులు అంటూ ప్రపంచంలో ఏమీ లేవు.

– మనూ జోసెఫ్, నవలా రచయిత

విలువైన వనరు



ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ మదన్ దాస్ దేవి ఈ ఉదయం (జూలై 24) వెళ్లిపోయారు. వాజ్‌పేయి హయాంలో జర్నలిస్టులకు మదన్ జీ వెల కట్టలేని సమాచార వనరుగా ఉండేవారు. ఆయన దగ్గర ఆన్ రికార్డ్, ఆఫ్ రికార్డ్ అనే మాట ఉండేది కాదు. అంతా అధికారికమే. బ్రజేశ్ మిశ్రా, ఇంకా ఇతరుల 'సలహాల' వల్ల ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బీఎంఎస్, బీకేఎస్‌లతో ఘర్షణ ఎదురైన ప్రతిసారీ వాజ్‌పేయిని మదన్‌జీ ఒడ్డున పడేసేవారు.

– రాధికా రమేశన్, జర్నలిస్ట్

స్పందన

అది అర్థరహిత వాదం

'సంస్కృతంలో వాళ్ళెందుకు రాయరు?' అంటూ జూలై 19 నాటి 'సాక్షి' ఎడిటోరియల్ పేజీలో ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్ చేసిన వాదన చాలా అర్థరహితంగా కనిపిస్తుంది. కంచ ఐలయ్య పేర్కొన్న నలుగురు విదేశీ పండితులేకాక మాక్స్ ముల్లర్, వింటర్‌నెడ్జ్ లాంటి పాశ్చాత్య సంస్కృత పండితులు కూడ ఇంగ్లిష్‌లోనే ప్రచురించారు. కారణం ఏమిటంటే ఇంగ్లిష్ అంతర్జాతీయ భాష. యూనివర్సిటీలలో కూడా ఇంగ్లిష్ మీడియం ఉంటుంది కాబట్టి. అలాగే భారతీయ సంస్కృత పండితులు రోమిలా థాపర్‌తో సహా ఇంగ్లిష్‌లోనే రాస్తున్నారు. సంస్కృతం మృతభాష అయితే మరి 'పాళి'? ఇది ఎలా ఉందంటే బుద్ధుడి గురించి అంబేడ్కర్ పాళి భాషలో ఎందుకు రాయలేదు అని ప్రశ్నించినట్లుంది. ప్రాచీన నాగరికతలలో ఈజిప్ట్, మెసపటోమియా లాంటి నాగరికతల్లో కూడ ఆయా భాషల్లోనే రాశారు. కానీ ఆ భాషలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. ఆలాగే భారతదేశంలో కూడ ప్రాచీన భాషలు చాలావరకు కనుమరుగయ్యాయి. అలాంటి భాషల్లోని విజ్ఞానాన్ని ఇంగ్లిష్‌లో బోధించి, ప్రచురించడం నేరమా? యూదుల వంటి వారు ఆధునిక పుస్తకాలను హీబ్రూలో, గ్రీకులు గ్రీకులో, అరబ్బులు అరబిక్‌లోనే రాస్తారు అంటున్నారు. మరి భారతదేశంలో హిందీ, తెలుగు, తమిళ్, ఉర్దూ, అస్సామి లాంటి భాషల్లో ఆధునిక పుస్తకాలు రావడం లేదా, కేవలం సంస్కృతంలోనే ఎందుకు రాయాలి?

ఇకపోతే సంస్కృత భాష శతాబ్దాల తరబడి రాజభాషగా, భారతదేశాన్ని ఏకీకరణ చేసే భాషగా చలామణీ అయింది. రామాయణ, మహాభారతాలు సంస్కృతంలోనే కాక తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లోకూడ వచ్చాయి. మాతృభాషలో అలాంటి ఇతిహాసాలను రాయడం ఏమైనా నేరమా? ఇకపోతే సంస్కృత భాష ఒక దేశానికి, నాగరికతకు సంబంధించినది. అది ఎవరినో మోసం చేయడానికి అని నిందించడం ఎంతవరకు సమంజసం?

సమస్య ఏమిటంటే శతాబ్దాల కిందటి సాహిత్యాన్ని, నాగరికతను, సంస్కృతిని, అది ఏ దేశానికి సంబంధించినదైనా 19–20 శతాబ్దాల సిద్ధాంతాలు – మార్క్సిజం, ఫెమినిజం లాంటి వాటి చట్రంలో అధ్యయనం చేయడం అశాస్త్రీయం. అనైతికం. ప్రాచీన సమాజాలు ఆయా కాల రీతుల చట్టాలు, ఆచారాలు, నైతికత అనుసరించాయి. వాటిని 20వ శతాబ్దపు కళ్ళతో చూడటం ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించడమే. రాజీవ్ మల్హోత్రా లాంటి భారతీయ అమెరికన్‌ల సమూహం తమ పిల్లలను సంస్కృత విశ్వవిద్యాలయాలకు ఎందుకు పంపరు అని ప్రశ్నిస్తున్నారు. మరి సంస్కృత ప్రేమికులైన షెల్డన్ పొలాక్, వెండి డోనిగర్ తమ పిల్లలను సంస్కృత పాఠశాలలకు పంపిస్తారా? ఏ చదువు చదువుకోవాలి అనేది పిల్లల ఇష్టమా లేక తల్లిదండ్రుల ఇష్టమా?

– డా॥ పి. కృష్ణమోహన్ రెడ్డి
అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

ఇథనాల్‌తో రైతుకు మంచిరోజులు!

అభిప్రాయం


శ్యాంప్రసాద్ రెడ్డి కోర్మిపాటి

ఇవాళ వ్యవసాయం లాభసాటి కాదు. కాబట్టి అందరూ పల్లెల్ని వదిలి పట్టణాలకు సాగిపోతున్నారు. భూములన్నీ బీడుబారి పోతున్నాయి. ఎవరైనా... 'నేను వ్యవసాయం చేస్తున్నాను' అని చెప్పుకోవడానికి కూడా సిగ్గుపడే పరిస్థితి. రైతంటేనే కష్టాలకు సింబల్‌గా మారిపోయాడు. కుర్రాడెవరన్నా వ్యవసాయం చేస్తున్నాడంటే అతనికి పెళ్లి చెయ్యడానికి అమ్మాయి కూడా దొరకని పరిస్థితి! కానీ రాబోయే ఐదారేళ్లలో ఈ పరిస్థితులలో మార్పు రానుంది. పల్లెల్ని విడచి పట్టణాలకు వెళ్లిన వాళ్లు కూడా తిరిగి పల్లెల పంచన చేరే రోజు దగ్గర్లోనే ఉంది. వ్యవసాయం ఓ పెద్ద లాభసాటి వ్యాపకంగా, వృత్తిగా మారనుంది. నిజంగా 'రైతే రాజ'య్యే రోజు అతి దగ్గరలోనే ఉంది.

నమ్మలేకున్నారా? ఎందుకంటే... వాహనాలు నడవడానికి ఇప్పుడు మనం వాడుతున్న పెట్రోల్, డీజిల్ స్థానంలోకి ఇథనాల్ రానుంది. ఈ ఇథనాల్ ప్రధానంగా బియ్యం, చెరకు, మొక్కజొన్న, వెదురు, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల నుంచి తయారవుతుంది. ఇంకేం రైతన్నలకు మంచి రోజులొచ్చినట్టే కదా?

మనం పెట్రోలు, డీజిల్‌ను ఇప్పటివరకూ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఒక ఏడాదికి ఎంత విలువైన ఇంధనాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామో తెలుసా? ఏడాదికి 16 లక్షల కోట్ల రూపాయలు! పైగా ఈ ఇంధనం... అంటే పెట్రోల్, డీజిల్ వాడినందువల్ల వాహనాల నుంచి కర్బన ఉద్గారాలు విడుదలై 90 శాతం పర్యావరణం కలుషితమవుతోంది. అందుకే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత దేశమైన మనదేశంలో అటు రైతులకు లాభసాటిగా ఉంటూ, ఇటు దేశ ఆర్థిక వ్యవస్థకు లాభం చేకూర్చి పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపకరించే 'ఇథనాల్'ను భారతీయ ఇంధన రంగంలోకి ప్రవేశపెట్టే ప్రయత్నం యుద్ధ ప్రాతిపదికన చేస్తోంది.

ఈ బయో ఆయిల్ తయారీకి, మిగిలిపోయిన, పాడైపోయిన ఆహార ధాన్యాలను వాడతాం కనుక దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందనే భయం కూడా అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఎప్పుడైతే కేంద్ర ప్రభుత్వం 'బయో ఫ్యూయల్' తయారీపైన దృష్టి పెట్టిందో వెంటనే కమ్యూనిస్టులూ, మరి కొన్ని రాజకీయ వర్గాలూ ఇథనాల్ తయారీ పరిశ్రమ వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందనీ, దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందనీ విమర్శించడం ప్రారంభించారు. అవేవీ నిజాలు కాదు. ఇథనాల్ పరిశ్రమలు స్థాపిస్తే... పర్యావరణానికి నష్టం కలుగుతుందని గగ్గోలు పెడుతున్న ఈ ప్రగతి నిరోధకులకు ఇప్పుడు వాహనాల్లోంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం కనపడటం లేదా? మనదేశంలో ఇథనాల్ తయారు చేసు



కోవడం వల్ల పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. సామాన్య ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విశేషమైన ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. మధ్య ప్రాచ్య దేశాల నుంచి ఇంధనం దిగుమతి చేసుకుంటున్న కారణంగా వారితో తప్పనిసరి చెలిమి చేయాల్సి వస్తోంది. ఇథనాల్‌ను మనమే తయారుచేసుకోగలిగితే మన విదేశాంగ విధానంలో మరింత స్వతంత్ర ప్రతిపత్తిని అనుసరించవచ్చు. అలాగే విదేశీ మారకద్రవ్యమూ గణనీయంగా ఆదా అవుతుంది.

మనదేశంలో ఇథనాల్ తయారీ గనక మొదలైతే... మనమిక పత్తి రైతుల ఆత్మహత్యలను చూడం. వరి, చెరకు, మొక్కజొన్న వంటివి పండించే రైతుల ముఖాలలో ఆనందం తాండవించనుంది. ఈ ఇథనాల్‌ను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మన దేశానికి మరింత ఆర్థిక ప్రయోజనం కూడా కలిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఈ బయో ఫ్యూయల్ తయారీ కోసం దేశంలో నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో ఏర్పాటవుతున్న ఈ ప్లాంట్లలో ఒక్కొక్క ప్లాంట్ 2 లక్షల మంది రైతులకు ఉపయోగపడుతుంది. అంతేకాదు దేశవ్యాప్తంగా విడుదలవుతున్న కర్బన ఉద్గారాలలో రెండు లక్షల టన్నులను ఒక్కొక్క ప్లాంటు తగ్గిస్తుంది. మరి ఈ ఇథనాల్‌ను వాహనాలలో నింపాలంటే ఇథనాల్ పంపులు కావాలి కదా? కాబట్టి వాటిని ఏర్పాటు చేస్తే దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధీ దొరుకుతుంది.

దేశవ్యాప్తంగా ఇథనాల్ పంపుల ఏర్పాటుకు ఒక విధానాన్ని రూపొందించే ప్రయత్నంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉంది. ఇప్పటికే పుణేలో మూడు ఇథనాల్ పంపులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో పూర్తి స్థాయిలో ఇథనాల్ వాహనాలను వాడుకులోకి తెచ్చే ప్రయత్నం పెద్ద ఎత్తున జరుగుతోంది.

కేవలం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలంటేనే 1000 కోట్ల టన్నుల ఇథనాల్ అవసరం అవుతోంది. మరి పూర్తిస్థాయిలో ఇథనాల్‌తో నడిచే వాహనాలు అందుబాటులోకి వస్తే... అప్పుడు దేశంలో ఎంత ఇథనాల్ అవసరం అవుతుందో ఒక్కసారి ఊహించండి. బజాజ్, హీరో, టీవీఎస్ కంపెనీలు ఇప్పటికే 100 శాతం బయో ఇథనాల్‌తో నడిచే వాహనాల తయారీకి ముందుకొచ్చాయి. టయోటా కంపెనీ అయితే ఇప్పటికే పూర్తిగా ఇథనాల్‌తో నడిచే కార్‌ను తయారు చేసింది. దానిని ఆగస్టులో ప్రారంభించనుంది. మొత్తం మీద ఇథనాల్ దేశంలో రైతుల స్థితిగతుల్లోనే కాదు... వాతావరణ కాలుష్యం, విదేశీమారకద్రవ్యం, నిరుద్యోగం వంటి అనేక విషయాల్లో పెనుమార్పును తీసుకు రానుంది.

వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌। 95504 63236

మనోవ్యాయామం

ఒకానొక భక్తుడు కృష్ణాలయానికి వెళ్లి గద్గద స్వరంతో పైకి వినిపించేలా మొర పెట్టుకుంటున్నాడు: 'కృష్ణా! నాతో ఎందుకింతలా ఆడుకుంటున్నావు? నువ్వంటే నాకు అమితమైన ఇష్టం. నిన్నెప్పుడూ పల్లెత్తు మాట అనలేదు. పైపెచ్చు వాళ్ళతో వీళ్ళతో నీ గురించి గొప్పలు చెప్తుంటాను. అలాంటి నన్నెందుకు ఇలా ఆట పట్టిస్తున్నావు? నీకు ఇంకెవరూ దొరక లేదా? నాతోనేనా నీకు ఈ ఆటలు?' అక్కడే ఉన్న



పూజారి ఆ మాటలు విని చిన్న నవ్వు నవ్వాడు. 'నువ్వు బలే ఉన్నావుగా... ఎవరైనా వారికి ఇష్టమున్న వారితోనేగా ఆడుకుంటారు. పాడుకుంటారు. కబుర్లు చెప్తారు. చెప్పించుకుంటారు. వింటారు. నువ్వంటే ఆయనకు ఇష్టం. అందుకే నీతో ఆడుకుంటున్నాడు. అంతేతప్ప మరొకటి కాదు' అన్నాడు.

భక్తుడు, 'జగన్నాథుడంతటివాడు నాతో ఆడటం నాకిష్టమే. కాదనను. కానీ ఆయన నాతో ఆడుతున్నానని అనుకుంటున్నాడేమో గానీ ఆ ఆటలన్నీ నన్ను నొప్పిస్తున్నాయి. ఒత్తిడి పెరిగిపోతోంది. తట్టుకోవడం కష్టంగా ఉంది. భరించలేకపోతున్నాను. మానసికంగా ఎంత కష్టంగా ఉందో?' అన్నాడు.

అందుకు పూజారి 'శారీరక వ్యాయామం చేస్తున్నప్పుడూ ఒళ్ళంతా నొప్పెడుతుంది. కానీ దేహం గట్టి పడుతుంది కదా? అలాగే నీ మనసు కష్టంతో నొప్పెట్టే కొద్దీ ఓ పరిపక్వత కలుగుతుంది. మానసిక ఒత్తిడిని అధిగమించే శక్తి వస్తుంది' అన్నాడు. పరమార్థం బోధించిన పూజారి కాళ్లకు మొక్కి ప్రశాంతంగా వెనక్కి మళ్లాడు భక్తుడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.10.04 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** చిత్త రా.8.05 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.1.53 నుండి 3.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** ప.1.20 నుండి 3.01 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

శంకర నేత్రాలయ 3.50 లక్షల డాలర్ల విరాళాల సేకరణ

అంధత్వ నిర్మూలనకు విశేష కృషి



డాలస్‌లో విరాళాలు సేకరించిన ఎన్నారైలు

సాక్షి, హైదరాబాద్: శంకర నేత్రాలయ (యూఎస్‌ఏ) అడాప్ట్‌–ఎ–విలేజ్ మొబైల్ సర్జికల్ యూనిట్ దాతలు డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఆధ్వర్యంలో డాలస్ నగరంలో అంధత్వ నిర్మూలనకు 3.50 లక్షల డాలర్ల భారీ విరాళం సేకరించారు. ఇటీవల జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. శంకర నేత్రాలయ యూఎస్‌ఏ అనేది శంకర నేత్రాలయ ఇండియాకు సంబంధించిన నిధుల సేకరణ విభాగం. ప్రతి ఏటా నిధులు సేకరించి భారతదేశంలో ఉన్న శంకర నేత్రాలయకు పంపుతుంది. గత నాలుగు దశాబ్దాలుగా శంకర నేత్రాలయ లక్షలాది మందికి కంటిచూపు కల్పించింది. మారుమూల ప్రాంతాల్లోని పేదరోగులకు ఉచిత కంటి చికిత్స చేస్తోంది. శంకర నేత్రాలయ(యూఎస్‌ఏ) అధ్యక్షుడు బాలారెడ్డి ఇందుర్తి విదేశాలలో నివసిస్తున్న భారతీయులలో అడాప్ట్‌–ఎ–విలేజ్ కార్యక్రమం ద్వారా భారతదేశంలో మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ సేవలు పెంచడానికి పనిచేస్తున్నారు. అతని అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఆ సంస్థలో అత్యున్నత పురస్కారమైన శంకరరత్నను ప్రదానం చేసింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాటా) కూడా ఇటీవల డాలస్‌లో అతని అత్యుత్తమ సేవలను గుర్తించి, ప్రతిష్టాత్మకమైన కమ్యూనిటీ సర్వీస్ అవార్డును ప్రదానం చేసింది.

వీఆర్‌ఏలకు రైతువేదికల బాధ్యత

- వ్యవసాయశాఖకు 2,600 మంది వీఆర్‌ఏల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రూ.కోట్లు వెచ్చించి నిర్మించినప్పటికీ నిర్వహణ కరువై దుమ్ము, ధూళి పట్టి నిర్లక్ష్యపునీడలో ఉన్న రైతువేదికల ఆలనాపాలనా బాధ్యతలను ఇక వీఆర్‌ఏలు నిర్వహించనున్నారు. ప్రతి రైతువేదికకు ఒక వీఆర్‌ఏను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలోని మొత్తం 2,600 మంది వీఆర్‌ఏలను వ్యవసాయ శాఖకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.573 కోట్లు ఖర్చుచేసి నిర్మించిన రైతు వేదికల్లో సిబ్బందిలేరు. పట్టించుకునే వారు లేక తాళాలు తీసే పరిస్థితి లేకుండా పోయింది.

ఏఈవోలకు భారం కావడంతో...

రైతువేదికల నిర్వహణ బాధ్యత ప్రస్తుతం వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవో)కు అదనపు భారంగా మారింది. రాష్ట్రంలోని 2,795 క్లస్టర్ల పరిధిలో కోటిన్నర ఎకరాల సాగుభూమి ఉంది. గ్రామాల్లో సర్వే నంబర్ల వారీగా పంటల నమోదు, రైతుబీమా, రైతుబంధు, పంటల కొనుగోళ్లు తదితర పనుల పర్యవేక్షణ పనులతోనే వారు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాలపై పూర్తి పట్టుండటమేకాకుండా సర్వే నంబర్ల వారీగా రైతుల భూముల గుర్తింపు, రైతు బీమా వంటి వాటిల్లో అవగాహన ఉన్న వీఆర్‌ఏలను వ్యవసాయ శాఖలోని క్షేత్రస్థాయి బాధ్యతల్లో నియమిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో ఏఈవోలకు సహాయకులుగా వీఆర్‌ఏలను నియమించింది.

స్థానికభాషల్లో ఇంజనీరింగ్ విద్య

▶ మొదటి పేజీ తరువాయి

లక్ష్యమన్నారు. ఇందుకోసం హైదరాబాద్ ఐఐటీ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోందన్నారు. ఆయా కోర్సుల్లో చేరుతున్న విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టులతోపాటు అవసరమైన ఇతర సబ్జెక్టులు కూడా నేర్చుకునేందుకు మల్టీ డిసిప్లినరీ కోర్సులను హైదరాబాద్ ఐఐటీ అందుబాటులోకి తెస్తోందని చెప్పారు. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాలు చేసుకునేవారి కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ ఎంటెక్స్ కోర్సులను ప్రారంభించామన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఐఐటీ హైదరాబాద్ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)తో ఉద్యోగాలు పోతాయనేది కేవలం అపోహ మాత్రమేనని బీఎస్ మూర్తి పేర్కొన్నారు. కంప్యూటర్లు వచ్చిన కొత్తలో ఉద్యోగాలు పోతాయనే అపోహ ఉండేదని ఆయన గుర్తు చేశారు. విద్యా విధానంలో ఎప్పటికప్పుడు సంస్కరణలు అవసరమన్నారు. కాలానికి అనుగుణంగా విద్యావిధానాన్ని మార్పులు, చేర్పులు చేసుకుంటేనే విద్య ముందు తరాలవారికి ఉపయోగపడుతుందన్నారు.

ఢిల్లీలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

సీఎం కేసీఆర్ నివాసంలో కేక్ కట్‌చేసి, మొక్కలు నాటిన బీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: మానవ మనుగడకు చెట్లు జీవనాధులని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖమంత్రి కె.తారక రామారావు జన్మదినం సందర్భంగా 'గ్రీన్ ఇండియా చాలెంజ్' సృష్టికర్త, బీఆర్ ఎస్ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో సీఎం కేసీఆర్ నివాసంలో బీఆర్‌ఎస్ ఎంపీలు మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, జోగినపల్లి సంతోష్ కుమార్, కేఆర్ సురేశ్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, బండి పార్థసారథిరెడ్డి, దామోదర్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, పోతుగంటి రాములు, పసునూరి దయాకర్, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రవిచంద్ర, మాలోత్ కవిత, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ మెంబర్ రాఘవ, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో మత్స్య పరిశ్రమ!

వస్త్ర నేలపై భారీ ఆక్వాహబ్

- రూ.102 కోట్లతో ఏర్పాటు చేస్తున్న టీఎస్‌ఐఐసీ
- చీర్లవంచ, చింతలఠాణాలో 365 ఎకరాలు కేటాయింపు
- దాదాపు 23 వేల మందికి ఉపాధి
- కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చిన మూడు సంస్థలు
- వచ్చేవారంలో శంకుస్థాపన చేయనున్న కేటీఆర్!



చీర్లవంచ, చింతలఠాణాలో హబ్ కోసం సేకరించిన భూమి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మరో ప్రతిష్టాత్మక పరిశ్రమ రాబోతోంది. ఇటీవల జగిత్యాల జిల్లాలో భారీ ఫుడ్ ప్రాసెస్ జోన్‌కు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం తాజాగా సిరిసిల్ల జిల్లాలో ఆక్వాహబ్‌కు శ్రీకారం చుట్టబోతోంది. ఈ పరిశ్రమని దాదాపు రూ.102.9 కోట్ల వ్యయంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని చీర్లవంచ, చింతలఠాణాలోని ముంపు గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నారు. రెండుగ్రామాల పరిధిలో మొత్తం 365 ఎకరాల స్థలాన్ని ఈ ప్రాజెక్టు కోసం అధికారులు కేటాయించారు. ఇవి మిడ్‌మానేరు ముంపు గ్రామాలు కావడం, గోదావరిబేసిన్‌లో మిడ్‌మానేరు ఉండటం, కాళేశ్వరం నుంచి నిరంతరం నీటిని ఎత్తిపోసే సౌలభ్యం ఉండటంతో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు– మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్‌ఐఐసీ) ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఈ రెండు గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఆక్వా రంగంలో సత్తా చాటాలనుకునే కంపెనీలకు ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి భూమి, రోడ్లు, విద్యుత్తు, నీరు, వ్యర్థాల నిర్వహణ తదితర సదుపాయాలు టీఎస్‌ఐఐసీ కల్పించనుంది. ఇప్పటికే ఫిషింగ్ ఇండియా, ఆనంద్ గ్రూప్స్, ఫ్రెష్ టు హోమ్ సంస్థలు ఇక్కడ తమ కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. ప్రతిష్టాత్మక ఆక్వా హబ్‌కు వచ్చేవారంలో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని సమాచారం. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇంతకాలం పలు రకాల వస్త్రాలకు నిలయంగా ఉన్న సిరిసిల్ల నేల.. ఇక మత్స్య పరిశ్రమలకు కూడా చిరునామాగా మారనుంది.

ఆక్వాహబ్ ఇక్కడే ఎందుకంటే

చీర్లవంచ, చింతలఠాణాల్లో అధికశాతం బంజరు భూమి..ఎటుచూసినా కొండ ప్రాంతం, గుల్మాలు పెరిగి ఉన్న నేల కనిపిస్తుంది. వాతావరణ పరంగా చూసినా.. ఇక్కడ గరిష్టంగా 48 డిగ్రీలు, కనిష్టంగా 10 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఇది కరీంనగర్ నుంచి 27 కి.మీ.ల దూరం, నేషనల్ హైవే –365బి–సిద్ధిపేట రహదారికి కేవలం 3.7 కి.మీ.ల దూరం, బేగంపేట విమానాశ్రయానికి 110 కి.మీ, వర్షపాతం 760 మి.మీ.లుగా, తేమ 74%గా ఉంటుంది. అందుకే, ఇక్కడ ఆక్వాహబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- ఈ ప్రాజెక్టుకు ప్రతిరోజూ 15.52 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి డిమాండ్ ఉంటుంది. అదేవిధంగా ఈ నీటిలో తిరిగి 10.8 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ విడుదలవుతుంది. ఈ హబ్‌లో 13 ఎంఎల్‌డీల సామర్థ్యంతో టీఎస్‌ఐఐసీ భారీ ఎస్టీపీని ఏర్పాటు చేయబోతోంది.
- ఆక్వాహబ్‌కు దాదాపు 30 మెగావాట్ల విద్యుత్తు అవసరం అవుతుంది.
- ఇప్పటికే తంగళ్లపల్లి కేంద్రం నుంచి 120 ఫీట్ల రోడ్డు వేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి.
- ప్రతిపాదిత ఆక్వా హబ్ ద్వారా రెండు దశల్లో దాదాపు 23 వేల మందికి ఉపాధి దొరకనుంది.

సాగు సరే.. గిట్టుబాటు ఏదీ?

▶ మొదటి పేజీ తరువాయి

సాగు ఉండగా 220 ఎకరాల్లో దిగుబడి ఉంది. భువనగిరి యాదాద్రి జిల్లాలో గత ఏడాది నుంచే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ జిల్లాలో 2,203 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగులో ఉంది. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి దిగుబడి వస్తుంది. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అయితే, నాలుగో ఏడాది నుంచి దిగుబడి ద్వారా ఎకరానికి రూ.50 వేల ఆదాయం లభిస్తుంది. అయితే పెట్టుబడి ఖర్చు ఎక్కువగా ఉందని, ఆయిల్‌పాం గెలలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

టన్నుకు రూ.20 వేల ధర ఇవ్వాలి

నేను నల్లగొండ జిల్లా హాలియా మండలంలో 20 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తున్నా. అందులో ఏడు ఎకరాల్లో దిగుబడి వస్తోంది. ఖర్చులన్నీ పోను ఎకరాకు ఏడాదికి రూ.లక్ష ఆదాయం వస్తుందని ప్రభుత్వం చెప్పింది. కానీ, ఆచరణలో అలా లేదు. గెలలకు టన్ను ధరగా కనీసం రూ.20 వేలు ఇవ్వాలి. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు అధికారులు రావడం లేదు.

– జగన్‌మోహన్‌రావు, ఆయిల్‌పాం రైతు, మారెపల్లి

సలహాలు ఇచ్చేవారు లేక..

ఆయిల్‌పాం సాగులో సాంకేతిక సలహాలు ఇచ్చేవారు లేకపోవడంతో లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటిన రైతులు దిగుబడి వచ్చిన తర్వాత వాటిని తొలగించి వరి వేస్తున్నారు. ఉద్యానశాఖలో నియోజకవర్గానికి ఒక అధికారి మాత్రమే ఉండటంతో రైతులకు సలహాలు, సూచనలు సకాలంలో అందడంలేదు. ఆయా ప్రాంతాల్లో టెండర్ తీసుకున్న ఏజెన్సీ ఆయిల్‌పాం సాగులో రైతులకు సలహాలు ఇచ్చే సిబ్బందిని అందుబాటులో ఉంచి తోటలు తొలగించకుండా వారికి భరోసా కల్పించాల్సి ఉంది. అయితే వారు కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

క్రూడ్ ఆయిల్ రేటును బట్టి ఇక్కడ ధర ఉంటుంది

అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరను బట్టి ప్రతి నెలా ఆయిల్‌పాం గెలలకు టన్ను ధరను నిర్ణయిస్తారు. ఏడాదిలో సగటున రూ.14 వేల నుంచి రూ.15 వేల ధర ఉంటుంది. ఆయిల్‌పాంకు నిర్దిష్ట ధరను నిర్ణయించే విషయం కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సంగీతలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, నల్లగొండ

సాగు లాభదాయకమే

ఆయిల్‌పాం సాగు లాభదాయకమైనది. టన్ను ధర రూ.13 వేలు ఉన్నా, రైతుకు గిట్టుబాటు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం టన్నుకు రూ.13,346 ధర నిర్ణయించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఓయూ చేసుకోవాల్సి ఉంది. కొందరు రైతులు ఎంఓయూ అంశాన్ని వ్యతిరేకిస్తున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. నిబంధనల ప్రకారం టన్ను ధర నిర్ణయిస్తాం. రైతులకు సాగులో సాంకేతిక సమస్యలు ఉంటే ఉద్యాన శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్

గోడౌన్లలోనే బియ్యం!

▶ మొదటి పేజీ తరువాయి

స్టోరేజీ కెపాసిటీ ఉంది. అయితే ఈ గోదాముల్లో ప్రస్తుతం 11 లక్షల టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి. ఈ బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద రైల్వే వ్యాగన్ల ద్వారా ఎప్పటికప్పుడు ఇతర రాష్ట్రాలకు అక్కడి అవసరాల మేరకు పంపించి, గోదాములను ఖాళీ చేసి, మిల్లుల్లోని బియ్యాన్ని వాటిలోకి చేర్చాలి. లేనిపక్షంలో కొత్తగా గోదాములను సమకూర్చి మిల్లుల నుంచి వచ్చే బియ్యాన్ని ఆ గోదాములకు తరలించాలి. కానీ ఎఫ్‌సీఐ ఈ విషయంలో చాలా నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లు ఆరోపిస్తున్నారు. గత జనవరి నెలలో 178 వ్యాగన్లలో (ఒక్కో వ్యాగన్‌లో 2,500 మెట్రిక్ టన్నులు) బియ్యాన్ని రాష్ట్రం నుంచి తరలించిన ఎఫ్‌సీఐ గత మే నెల నుంచి అందులో సగం కూడా పంపించడం లేదు.. దీంతో ప్రస్తుతం 12 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం గోడౌన్‌లలో మూలుగుతుండగా, మిల్లుల నుంచి వస్తున్న బియ్యం నిల్వ చేసేందుకు స్థలం లేని పరిస్థితి. గతంలో నిల్వ సామర్థ్యం పెంచేందుకు అవసరమైన గోడౌన్‌లను అద్దెకు తీసుకొని 21 లక్షల మెట్రిక్ టన్నుల వరకు నిల్వ చేసిన ఎఫ్‌సీఐ ఇప్పుడు ఆదిశగా ఎలాంటి అడుగు వేయడం లేదు.

రాష్ట్రంలోని గోదాముల్లోనే 6 ఎల్‌ఎంటీ ఖాళీ స్థలం

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చిన్న, పెద్ద కలిపి 230 గోదాములు ఉండగా, వాటి కెపాసిటీ 17 లక్షల మెట్రిక్ టన్నులు. వీటిలో మన రాష్ట్ర అవసరాల కోసం 11 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి. మిగతా 6 ఎల్‌ఎంటీ బియ్యానికి సరిపడే స్థలం ఖాళీనే. ఎఫ్‌సీఐ అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ గోదాములను వినియోగించవచ్చు. కానీ ఆ దిశగా పట్టించుకోవడం లేదు. స్టోరేజీ కెపాసిటీ పెంచకుండా ఎఫ్‌సీఐ వ్యవహరిస్తున్న తీరుపై మిల్లర్లు మంగళవారం సమావేశమై తమ కార్యాచరణ రూపొందించుకోనున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

ఎఫ్‌సీఐ గోదాముల్లోని బియ్యం స్టాక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిన అధికారులు రెండు, మూడు నెలలుగా పట్టించుకోవడం లేదు. దీంతో లారీల అన్‌లోడింగ్‌కు వారం రోజుల సమయం పడుతోంది. ప్రతి గోదాం ముందు 50 నుంచి వంద లారీల క్యూ ఉంటోంది. స్టోరేజీ కెపాసిటీ పెంచకపోతే గడువులోగా బియ్యం అప్పగించడం సాధ్యం కాదు. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

–గంప నాగేందర్ గుప్త, మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సీజన్ మొదలైనా.. సబ్సిడీ యంత్రాలేవి?

▶ మొదటి పేజీ తరువాయి

విరివిగా అందజేశారు. ఆ తర్వాత వరినాటు యంత్రాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. కానీ ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దేశంలోనే తెలంగాణలో వరి రికార్డుస్థాయిలో సాగవుతోంది. ఈ నేపథ్యంలో వరినాటు యంత్రాలు ఉంటే రైతులకు ఎంతో ప్రయోజనం. ఒక్కో వరినాటు యంత్రం ధర ఆయా కంపెనీలను బట్టి రూ.7 –10 లక్షల మధ్యలో ఉంటుంది. కంపెనీలు కూడా వరినాటు యంత్రాలను సిద్ధం చేసినా, ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై సరఫరా చేయడం లేదు. వరినాటు యంత్రాలతోపాటు మిగిలిన పెద్దాచిన్న యంత్రాలను కూడా ఇవ్వాలనుకున్నా, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంలో వ్యవసాయశాఖ విఫలమైంది.

వరి నాట్లలో వేగమేదీ?

సీజన్‌కు ముందే వరినాటు యంత్రాలు సరఫరా చేసి ఉంటే ఇప్పుడు నాట్లు వేగంగా జరిగేవి. కనీసం కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారానైనా వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెస్తే బాగుండేది. ఓలా, ఉబర్ మాదిరి వ్యవసాయానికి సంబంధించిన వరినాటు యంత్రాలు బుక్ చేసుకుంటే అద్దెకు పంపించే లా కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని గతంలో వ్యవసాయశాఖ చెప్పింది. అయితే ఇంతవరకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఎలా ఉండాలి? ఎవరి ఆధ్వర్యంలో నడిపించాలనే దానిపై స్పష్టత లేదు.

గతంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం సబ్సిడీ

రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వం రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీలు ప్రకటించింది. 2018 వరకు భారీగా ట్రాక్టర్లు సహా వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు ట్రాక్టర్లు సహా కొన్నింటిపై 95 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీతో సరఫరా చేసింది. దాదాపు 8 వేల వరకు ట్రాక్టర్లను వ్యవసాయశాఖ రైతులకు సబ్సిడీపై అందజేసింది. దీంతో గ్రామాల్లో వ్యవసాయ యాంత్రీకరణ విప్లవం ఏర్పడింది. తెలంగాణ ఏర్పడక ముందు, ఆ తర్వాత రైతులకు యంత్రాల పంపిణీ చూస్తే దాదాపు రెండింతలైంది. దీంతో వ్యవసాయం ఆధునికతను సంతరించుకుంది.

వీఆర్‌ఏ ఫ్యూడల్ వ్యవస్థ..అందుకే క్రమబద్ధీకరణ



సోమవారం సచివాలయంలో వీఆర్‌ఏ సంఘం నేతలకు జీవో కాపీని అందజేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, నవీన్ మిత్తల్, శాంతికుమారి, హరీశ్‌రావు, గంగుల తదితరులు

సీఎం కేసీఆర్ వ్యాఖ్య

- కొత్త ఉద్యోగాలు చేపట్టనున్న వీఆర్‌ఏలకు సీఎం అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ఫ్యూడల్ వ్యవస్థకు అవశేషంగా, ప్రజాకంటకంగా వీఆర్‌ఏల వ్యవస్థ కొనసాగిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. అతి తక్కువ జీతంతో ఎన్నో తరాలుగా గ్రామాల్లో వీరంతా పనిచేస్తూ వచ్చారు... అందుకే వీరిని క్రమబద్ధీకరించామని కేసీఆర్ అన్నారు. వీఆర్‌ఏల క్రమబద్ధీకరణను మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు అభినందిస్తూ.. ఆ రాష్ట్రంలో కూడా చాలా తక్కువ జీతంతో వీఆర్‌ఏలు పనిచేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. కాగా, కొత్త ఉద్యోగాలు చేపట్టనున్న వీఆర్‌ఏలందరికీ సీఎం శుభాభినందనలు తెలిపారు.

నీటిపారుదల, భగీరథకు 10,317 మంది

వీఆర్‌ఏల్లో టెన్త్ విద్యార్హతలు గల 10,317 మందిని నీటిపారుదల, మిషన్ భగీరథ విభాగాల్లో, ఇంటర్ విద్యార్హత కలిగిన 2,761 మందిని రికార్డు అసిస్టెంట్ హోదాతో, డిగ్రీ ఆపై విద్యా ర్హత కలిగిన 3,680 మందిని జూనియర్ అసిస్టెంట్ లుగా విధులు నిర్వర్తిస్తారని సీఎం కేసీఆర్ తెలిపారు. 61 ఏళ్లు నిండిన 3,797 మంది వీఆర్‌ఏల పిల్లలకు వారి విద్యార్హతల ఆధారంగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలిస్తామన్నారు. 'వారు వారి పిల్లలను తీసుకొని వస్తే వారి విద్యార్హ తలను బట్టి ప్రభుత్వం తదుపరి చర్యలు చేపడు తుంది. వీఆర్‌ఏలు ఇకపై పేస్కేల్ ఉద్యోగులు' అని సీఎం స్పష్టం చేశారు.

కేటీఆర్ జన్మదినం నాడే ఎందుకంటే...

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు మంత్రి కేటీఆర్ చొరవ తీసుకున్నందున ఆయన జన్మదినం సందర్భంగా సోమవారం ఉత్తర్వులిస్తే బాగుంటుందని సీఎస్ శాంతికుమారి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ చొరవ తీసుకుని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని సీఎం అన్నారు. ఎలాంటి న్యాయపర ఇబ్బందులు రాకుండా జీవోను రూపొందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏలు ఇక 'ఫుల్ టైమ్' ఉద్యోగులు

- 16,758మంది వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ
- 3,797 వీఆర్‌ఏల పిల్లలకు కారుణ్య నియామకాలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. 61 ఏళ్ల లోపు వయస్సు గల 16,758 మంది వీఆర్‌ఏలను 'ఫుల్ టైమ్' ఉద్యోగులుగా క్రమబద్ధీ కరించింది. వీఆర్‌ఏలకు రెగ్యులర్ పేస్కేలు వర్తింపజేయడంతో పాటు సేవలు అవసరం ఉన్న ప్రభు త్వ శాఖల్లో వీరిని విలీనం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఆయా శాఖల్లోని లాస్ట్ గ్రేడ్ సర్వీస్/ రికార్డు అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్ లేదా త త్సమాన హోదాల్లో వీఆర్‌ఏలను నియమించాలని ఆదేశిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌ఏలకు వారి విద్యార్హతల ఆధారంగా ఈ కింది పేస్కేల్‌ను వర్తింపజేయనున్నారు. విద్యార్హతల ఆధారంగా వీఆర్‌ఏల్లో ఎంత మందిని ఏ హోదాల్లో నియమించనున్నారు, వారికి లభించనున్న పే స్కేలు వివరాలను కింది పట్టికలో చూడవచ్చు.

ఇక కాలగర్భంలో వీఆర్‌ఏల వ్యవస్థ: కొత్త రెవెన్యూ చట్టం అమల్లో భాగంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌ఓ) వ్యవస్థను రద్దు చేయగా, తాజా ఉత్తర్వు లతో వీఆర్‌ఏల వ్యవ స్థను సైతం రద్దు చేసింది.

60 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల పిల్లలకు కారుణ్య నియామకాలు

61 ఏళ్లు, ఆపై వయస్సు కలిగిన 3,797 మంది వీఆర్‌ఏల కుమారులు/ కుమార్తెలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. 2011 అక్టోబర్ 1కి ముందు నియమితులైన వీఆర్‌ఏలకు పదవీ విరమణ వయస్సును నిర్దేశించకపోవడంతో 61 ఏళ్లు నిండిన వారు సైతం ఉద్యోగాల్లో కొనసాగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

విద్యార్హతలు	పోస్టు కేటగిరీ,	పే స్కేల్	పోస్టుల సంఖ్య
10వ తరగతి వరకు	లాస్ట్ గ్రేడ్ సర్వీసు	(రూ.19,000–58,850)	0317
ఇంటర్మీడియెట్	రికార్డు అసిస్టెంట్/ తత్సమాన	(రూ.22,240–67,300)	2,761
డిగ్రీ, ఆపై	జూనియర్ అసిస్టెంట్/ తత్సమాన	(రూ.24,280–72,850)	3,680

సేవాస్ఫూర్తితో కేటీఆర్ జన్మదిన వేడుకలు

- తెలంగాణ భవన్‌తో పాటు రాష్ట్రంలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు
- మండలిలో ఉచితంగా హెల్మెట్ల పంపిణీ
- మొక్కలు నాటడం... సాట్స్ ఆధ్వర్యంలో ట్రై క్రీడా వేడుకలు
- మంత్రుల నివాస ప్రాంగణంలో వేడుకలు



తెలంగాణ భవన్‌లో తలసానికి కేక్ తినిపిస్తున్న శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో బాల్కసుమన్, ఇతర బీఆర్‌ఎస్ నేతలు



బస్సుపై కేటీఆర్ సాధించిన విజయాల చిత్రాలతో వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్‌ఎస్ నేత అలిశెట్టి అరవింద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు 47వ జన్మదిన వేడుకలు సోమవారం సేవాస్ఫూర్తి లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌తో పాటు పలుచోట్ల బీఆర్ ఎస్ నేతలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, బాలరాజు యాదవ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. రాజకీయ చతురత, వాగ్ధాటి, రాజకీయ వ్యూహాల్లో కేటీఆర్ తండ్రికి తగిన తనయుడిగా పేరు తెచ్చుకున్నాడని, యువతరానికి ఆయన స్ఫూర్తి అని నేతలు పేర్కొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి జగదీశ్ రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో కలిసి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మొక్కలు నాటి కేక్ కట్ చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా సూర్యాపేట నియోజకవర్గం మొగ్గయ్య గూడెంకు చెందిన గిరిజన బీటెక్ విద్యార్థినికి ల్యాప్ టాప్‌ను మంత్రి జగదీశ్‌రెడ్డి బహూకరించారు. విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రనాయక్, గ్యాదరి కిషోర్, భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమా భరత్‌కుమార్ పాల్గొన్నారు. శాసన మండలి విప్ ఎం.ఎస్ ప్రభాకర్‌రావు మండలి సచివాలయ సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.

స్కేటింగ్, రెజ్లింగ్ పోటీలు

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (సాట్స్) ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో ట్రై క్రీడా వేడుకలు ప్రారంభించారు. నెక్లెస్ రోడ్డులో సైక్లింగ్ రేస్‌ను క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్ పాల్గొన్నారు. ఇందిరా పార్కులో స్కేటింగ్, యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో మహిళల రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు.

ట్రిల్ సిటీలో రూబిక్స్ క్యూబ్ చిత్రపటం: ట్రిల్ సిటీలో తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కేటీఆర్ జన్మదిన వేడుకల్లో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేష్, కోలేటి దామోదర్ గుప్తా, అనిల్ కుమార్ కూర్మాచలం, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి పాల్గొన్నారు. రూబిక్స్ క్యూబ్స్‌తో రూపొందించిన కేటీఆర్ చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, కేటీఆర్‌పై రూపొందించిన త్రీడీ వీడియోను ప్రదర్శించారు.

బస్సుపై కేటీఆర్ సాధించిన విజయాలు

బీఆర్‌ఎస్ నేత అలిశెట్టి అరవింద్ 12 అడుగుల ఎత్తు 45 అడుగుల వెడల్పు కలిగిన భారీ బస్సుకు ఇరువైపులా మంత్రి కేటీఆర్ సారథ్యంలో సాధించిన విజయాలను వివ రిస్తూ వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. టీ హబ్, దుర్గం చెరువు ఫ్లైఓవర్, టీ వర్క్స్, నగరంలోని పలు ఫ్లైఓవర్లను ఇందులో పొందుపరిచారు. ఈ వాహనం సోమవారం ఉదయం 6 గంటల నుంచి పది రోజుల పాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో సంచరించింది.

2050 కల్లా మధుమేహ బాధితులు 130 కోట్లు

లాన్సెట్ అధ్యయనం వెల్లడి



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి 130 కోట్ల మంది వరకు మధుమేహం బారినపడే అవకాశం ఉన్నట్లు లాన్సెట్ చేపట్టిన ఓ అధ్యయనం తేల్చింది. 1990–2021 మధ్య కాలంలో 204 దేశాలు, ప్రాంతాల్లో మరణాలు, అశక్తత, డయాబెటిస్ వ్యాప్తి వంటి అంశాలకు సంబంధించి 27 వేలకు పైగా రకాల గణాంకాల ఆధారంగా ఈ అధ్యయనం చేపట్టినట్లు లాన్సెట్ తెలిపింది. 2050 నాటికి మధుమేహం వ్యాప్తి సామాజిక, భౌగోళిక అంశాలు, ఒబేసిటీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే మోడల్‌ను అనుసరించినట్లు వివరించింది. ప్రజలు తమ ఆరోగ్య విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపింది.

ఎక్కువ మందికి టైప్-2నే

టైప్-1, టైప్-2 డయాబెటిస్‌లలో వచ్చే మూడు దశాబ్దాల్లో టైప్-2 బాధితులే ఎక్కుమంది ఉంటారని సర్వేలో వెల్లడైంది. టైప్-1 అనేది ఆటో ఇమ్యూన్ వ్యాధి. దీనివల్ల శరీరం ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేదు. ఇది ఎక్కువగా పిల్లల్లో కనిపిస్తుంది. టైప్-2 డయాబెటిస్‌తో ఇన్సులిన్ నిరోధకత క్రమంగా పెరుగుతుంటుంది. ఈ పరిస్థితి ఎక్కువగా పెద్దల్లో కనిపిస్తుంది. ముందుగానే గుర్తించి, దీనిని నివారించవచ్చు.

అప్రమత్తతే ఆయుధం

డయాబెటిస్‌తో సంబంధం ఉన్న అనేక సమస్యల కారణంగా ఈ సర్వేలో తేలిన వివరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మధుమేహ బాధితులు గుండెజబ్బు, గుండెపోటు, కంటి చూపు కోల్పోవడం, పాదాలకు అల్సర్లు వంటివి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అవగాహన లేకపోవడం, సరైన చికిత్స లేకపోవడం వల్ల చాలా మంది ఈ సమస్యల బారిన పడతారు. మధుమేహం ప్రమాదాన్ని పెంచేవి సాధారణంగా వయస్సు, ఊబకాయం. ఎక్కువ బీఎంఐకి అధిక-క్యాలరీ ఉత్పత్తులు, అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారం, కొవ్వు, చక్కెర, జంతు ఉత్పత్తుల వినియోగం. వీటితోపాటు తగ్గిన శారీరక శ్రమ డయాబెటిస్‌కు కారణాలుగా ఉన్నాయి. జన్యు సంబంధమైన కారణాలతోపాటు అనారోగ్యకర జీవన శైలితో కూడా మధుమేహం బారినపడే ప్రమాదముంది.

జాగ్రత్తలు మేలు..

- ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను పాటించాలి.
- ఎక్కువ రిస్క్ ఉన్న వారు ఫైబర్ ఎక్కువగా ఉండే, తృణ ధాన్యాలను ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- ఒకే చోట గంటల కొద్దీ కూర్చోరాదు. అప్పుడప్పుడు నడక వంటి వాటితో శారీరక శ్రమ అలవాటు చేసుకోవాలి.
- రోజులో కనీసం అరగంటపాటు వ్యాయామం చేయాలి. బరువు పెరక్కుండా జాగ్రత్తపడాలి.
- దాహం అతిగా అవుతున్నా, నీరసంగా ఉన్నా, తెలియకుండానే బరువు కోల్పోతున్నా, కంటి చూపు మందగించినా, తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన వైద్య చికిత్సలు తీసుకోవాలి.

క్లుప్తంగా...

ఈపీఎఫ్‌ఓ డిపాజిట్లపై వడ్డీ రేటు 8.15 శాతం



న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) ఖాతాదారులకు శుభవార్త. ఖాతాదారుల డిపాజిట్లపై వడ్డీరేటును కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా పెంచింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ డిపాజిట్లపై 8.15 శాతం వడ్డీ రేటును చెల్లించనుంది. గత ఆర్థిక సంవత్సరం ఈ వడ్డీ రేటు 8.10 శాతంగా ఉండేది. తాజాగా 5 బేసిస్ పాయింట్లు పెరిగింది. వడ్డీ రేటును 8.15 శాతానికి పెంచాలంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ ఏడాది మార్చి 28న చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు సోమవారం సర్క్యులర్ విడుదల చేసింది. వడ్డీ రేటు పెంపుతో దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మందికి పైగా వేతన జీవులకు లబ్ధి చేకూరనుంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌ఓ డిపాజిట్లపై వడ్డీ రేటు 8.50 శాతంగా ఉండేది. 2021–22లో ఏకంగా 40 పాయింట్లు తగ్గిపోయింది.

మద్యం సేవించి డ్రైవింగ్.. న్యూజిలాండ్ మంత్రి రాజీనామా



వెల్లింగ్టన్: మోతాదుకు మించి మద్యం సేవించి కారు నడుపుతూ మరో కారును ఢీకొట్టినందుకు న్యూజిలాండ్ న్యాయ శాఖ మంత్రి కిరీ అలాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. కిరీ అలాన్ ఆదివారం రాత్రి 9 గంటలకు రాజధాని వెల్లింగ్టన్‌లో పార్కింగ్‌లో నిలిపి ఉంచిన కారును తన కారుతో ఢీకొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. 4 గంటలపాటు ప్రశ్నించారు. శ్వాస పరీక్ష నిర్వహించగా పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలింది. అనంతరం విడిచిపెట్టారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఆరోపణల కింద సోమవారం కేసు నమోదు చేశారు. దీంతో ప్రధానమంత్రి క్రిస్ హిప్‌కిన్స్ సూచన మేరకు కిరీ అలాన్ తన పదవి నుంచి తప్పుకున్నారు. అభియోగాలు రుజువైతే జరిమానాతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంది. న్యూజిలాండ్ మంత్రులు ఇటీవలి కాలంలో తరచుగా కేసుల్లో, కుంభకోణాల్లో చిక్కుకుంటుండడం ప్రధానమంత్రి క్రిస్ హిప్‌కిన్స్‌కు తలనొప్పిగా మారింది.

‘జ్ఞానవాపి’లో ఏఎస్‌ఐ సర్వేపై సుప్రీం స్టే

హైకోర్టుకు వెళ్లొచ్చని మసీదు కమిటీకి సూచన



న్యూఢిల్లీ/వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదు ఆలయంపై నిర్మించిందా కాదా తేల్చేందుకు శాస్త్రీయ సర్వే చేపట్టాలంటూ స్థానిక కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో అవసరమైతే తవ్వకాలు సైతం జరపొచ్చంటూ భారత పురాతత్వ శాఖ(ఏఎస్‌ఐ)ని వారణాసి కోర్టు శుక్రవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను మసీదు కమిటీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అక్కడ యథాతథ పరిస్థితి అమలయ్యేలా చూడాలని యూపీ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. తమ ఉత్తర్వులను మసీదు ఆవరణలో ఉన్న ఏఎస్‌ఐ అధికారులకు తక్షణమే చేరవేయాలని కోరింది. మసీదు ఆవరణలో ఎటువంటి తవ్వకాలు జరపరాదని స్పష్టం చేసింది. ఏఎస్‌ఐ అధికారులు మసీదు ఆవరణలో ఫొటోగ్రఫీ, రాడార్ ఇమేజింగ్ మాత్రమే చేపట్టారని, ఎలాంటి తవ్వకాలు జరపలేదని, ఒక్క ఇటుకను కూడా తొలగించలేదని సొలిసిటర్ జనరల్ తెలిపారు. దీంతో, మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించేందుకు ధర్మాసనం స్వేచ్ఛనిచ్చింది. వారణాసి కోర్టు ఆదేశాల మేరకు 30 మంది ఏఎస్‌ఐ అధికారులు సోమవారం ఉదయం జ్ఞానవాపి మసీదు వద్దకు చేరుకున్నారు. మసీదు కాంప్లెక్స్‌ను పరిశీలించి, కొలతలు తీసుకున్నారు. మసీదులోపల ఏర్పాటు చేసిన కెమెరాల్లో వారు నాలుగు గంటలపాటు నిర్వహించిన కార్యకలాపాలు నమోదయ్యాయి. సుప్రీంఆదేశాలు అందిన వెంటనే సర్వే నిలిపివేసినట్లు డివిజనల్ కమిషనర్ కౌశల్‌రాజ్ తెలిపారు.

కెనడాలో దుండగుల దాడిలో మన విద్యార్థి దుర్మరణం

టొరంటో: కెనడాలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న భారతీయ విద్యార్థి ఒకరు దుండగుల చేతిలో హత్యకు గురయ్యారు. పంజాబ్‌లోని కరీంపూర్ చావ్లా గ్రామానికి చెందిన గుర్వీందర్ నాథ్(24) టొరంటోలోని బ్రామ్‌టన్‌లో ఉంటూ బిజినెస్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. పిజ్జా డెలివరీ బాయ్‌గా పార్ట్ టైం జాబ్ చేస్తున్నాడు. మిస్సిస్సాగాలో ఈ నెల 9న అర్ధరాత్రి దాటాక 2.10 గంటల సమయంలో నాథ్ ఒక ఇంట్లో పిజ్జా డెలివరీ చేసేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా కొందరు దుండగులు తీవ్రంగా కొట్టి అతడి దగ్గరున్న విలువైన వస్తువులతోపాటు, కారును తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన నాథ్‌ను చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 14న నాథ్ ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచాడు. దుండగులు అతడి కారును అక్కడికి 5 కిలోమీటర్ల దూరంలో వదిలేసి వెళ్లారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ కారులో పలు ఆధారాలు లభ్యమైనట్లు చెప్పారు. నాథ్, దుండగులకు మధ్య గతంలో ఎటువంటి పరిచయం లేదన్నారు. అతడి కారు ఎత్తుకెళ్లేందుకే దుండగులు పిజ్జా డెలివరీ చేసినట్లుగా భావిస్తున్నామన్నారు. ఘటనపై టొరంటోలోని భారత్ కాన్సుల్ జనరల్ సిద్ధార్థ నాథ్ విచారం వ్యక్తం చేశారు. అతడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామన్నారు. ఈ నెల 27న నాథ్ మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2021 జులైలో కెనడా వెళ్లిన నాథ్ చివరి సెమిస్టర్‌లో ఉన్నాడని, చదువు పూర్తయ్యాక సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని ఎన్నో కలలు కన్నాడని అతడి స్నేహితులు తెలిపారు. ఆదివారం నాథ్ స్మృత్యర్థం సుమారు 200 మంది భారతీయ విద్యార్థులు మిస్సిసాగాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.





వరద ధాటికి హిమాచల్ ప్రదేశ్‌లో కులూ-మనాలీ రహదారి కొట్టుకుపోయిన దృశ్యం

న్యాయ వ్యవస్థ సంస్కరణల బిల్లుకు ఇజ్రాయెల్ పార్లమెంట్ ఆమోదం

జెరూసలేం: వివాదాస్పద న్యాయ వ్యవస్థ సంస్కరణల బిల్లును ఇజ్రాయెల్ పార్లమెంట్ ఆమోదించింది. సోమవారం తుది ఓటింగ్ నిర్వహించారు. ఈ ఓటింగ్‌ను ప్రతిపక్షం బహిష్కరించింది. బిల్లుకు అనుకూలంగా 64 ఓట్లు లభించగా, వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా పడలేదు. ఈ బిల్లుపై ఏకంగా 30 గంటలపాటు పార్లమెంట్‌లో చర్చ జరిగింది. ఒకవైపు చర్చ జరుగుతుండగానే, మరోవైపు దేశవ్యాప్తంగా బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి. జనం వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థలో మార్పులు తలపెట్టడాన్ని అమెరికాతోపాటు పశ్చిమ దేశాలు సైతం వ్యతిరేకిస్తున్నాయి. న్యాయ వ్యవస్థను సంస్కరిస్తామంటూ ప్రజలకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చామని, ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ చెబుతున్నారు. ఈ కొత్త బిల్లు ప్రకారం.. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలను కోర్టులు అడ్డుకోరాదు. అంటే న్యాయ వ్యవస్థపై ప్రభుత్వానిదే పైచేయి అవుతుంది.

ఆరని మంటలు

పార్లమెంట్‌ను కుదిపేస్తున్న మణిపూర్ హింసాకాండ • మూడో రోజూ ఉభయ సభల్లో ప్రతిష్టంభన

- కొనసాగిన వాయిదాల పర్వం
- రాజ్యసభ నుంచి ‘ఆప్’ ఎంపీ సంజయ్ సింగ్ సస్పెన్షన్
- పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన
- పార్లమెంట్‌లో ప్రధాని సమాధానమివ్వాలని కాంగ్రెస్ డిమాండ్



గాంధీజీ విగ్రహం వద్ద విపక్షాల నిరసన దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో మణిపూర్ హింసాకాండ మంటలు కొనసాగుతున్నాయి. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తక్షణమే సమాధానం ఇవ్వాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళనలు, నిరసనలతో ఉభయ సభలు స్తంభిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వరుసగా మూడో రోజూ సోమవారం సైతం ఇదే అంశంపై విపక్షాలు ఉభయ సభలను అడ్డుకున్నాయి. దీంతో పలుమార్లు సభలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ సస్పెన్షన్ వ్యవహారం రాజ్యసభను మరింత వేడెక్కించింది.

డిమాండ్‌పై వెనక్కి తగ్గని విపక్షాలు

మణిపూర్ ఘటనలపై చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షాలు లోక్‌సభలో సోమవారం వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టాయి. ఉదయం సభ ప్రారంభం కాగానే మణిపూర్ అంశంపై ప్రధాని మోదీ సభలో సమాధానం ఇవ్వాలని ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరీ డిమాండ్ చేశారు. ఆయనకు మద్దతుగా విపక్ష ఎంపీలు తమ స్థానాల్లోంచి లేచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. స్పీకర్ ఓంబిర్లా స్పందిస్తూ.. దీనిపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే కేంద్రం తరఫున ఎవరూ సమాధానమివ్వాలో మీరు ఆదేశించలేరని అన్నారు. ఇదే సమయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోగా మరింత తీవ్రస్వరంతో నినాదాలు చేశారు. ‘ఇండియా ఫర్ మణిపూర్’ అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. లోక్‌సభలో బీజేపీ ఎంపీలు కూడా ఎదురుదాడికి దిగారు. పశ్చిమ బెంగాల్, రాజస్తాన్‌లో మహిళలపై అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష ఎంపీల నినాదాల మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. నినాదాల హోరు ఆగకపోవడంతో కొద్దిసేపటికే సభను మధ్యాహ్నం 12 గంటల దాకా, ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల దాకా.. అనంతరం మంగళవారానికి వాయిదా వేశారు. నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు–2023, నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లు–2023, కానిస్టిట్యూషన్(ఎస్టీలు) ఆర్డర్(సవరణ) బిల్లు–2023ని కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

సంజయ్ సింగ్ సస్పెన్షన్

మణిపూర్ హింసపై రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల వరకూ సభ వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా ఆందోళన కొనసాగించారు. సభా కార్యక్రమాలకు అడ్డు తగులుతున్న ‘ఆప్’ ఎంపీ సంజయ్ సింగ్ తీరుపై చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. దీంతో సంజయ్ సింగ్‌ను సస్పెండ్ చేయాలనే తీర్మానాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టారు. దీనిని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీంతో వర్షాకాల సమావేశాల్లో సభ జరిగే మిగిలిన దినాలకు సంజయ్ సింగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ‘ఆప్’ ఎంపీని సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో సభను చైర్మన్ వాయిదా వేశారు. ఆ తర్వాత అన్ని పార్టీల సభాపక్ష నేతలతో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో సజావుగా చర్చ జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని హోంమంత్రి అమిత్ అన్నారు. ఆయన సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. మణిపూర్ అంశంలో నిజాలు బయటకు రావాల్సిందేనని, వాస్తవాలు దేశ ప్రజలకు తెలియాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ వెలుపల నిరసన

మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలపై ప్రధాని నరేంద్ర మోదీ సమగ్ర ప్రకటన చేయాలని ప్రతిపక్ష కూటమి ‘ఇండియా’ పార్లమెంట్ ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టింది. ‘మణిపూర్ కోసం భారత్’, ‘భారత్ డిమాండ్ మణిపూర్’ అని రాసి ఉన్న ప్లకార్డులు, బ్యానర్లు చేతపట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేశారు.



మణిపూర్ రాష్ట్రంలో శాంతినెలకొనాలంటూ నినాదాలు చేస్తున్న మెయిటీ వర్గానికి చెందిన కడంగ్‌బాంగ్ గ్రామ మహిళలు. సోమవారం ఇంఫాల్ వెస్ట్‌లో తీసిందీ ఫొటో.

కునో నేషనల్ పార్కులోని 6 చీతాలకు రేడియో కాలర్ల తొలగింపు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కు(కేఎన్‌పీ)లో ఉన్న చీతాల్లో ఆరింటికి రేడియో కాలర్లను తొలగించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. కేఎన్‌పీ వైద్యులు, నమీబియా దక్షిణాఫ్రికాల నుంచి వచ్చిన నిపుణులు వీటి ఆరోగ్య పరిస్థితిపై పరిశీలన జరుపుతారని వెల్లడించారు. కేఎన్‌పీలో ప్రస్తుతం 11 చీతాలున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి 5 పెద్ద చీతాలు, 3 కూనలు చనిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేఎన్‌పీలో ఉన్న ఆరు చీతాల ఆరోగ్యాన్ని పరిశీలిస్తామని, మరో నాలుగు చీతాలకు ఏర్పాటు చేసిన రేడియో కాలర్లను కూడా తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. రేడియో కాలర్ల వల్లే చీతాలు మృతి చెంది ఉంటాయనే అనుమానాలున్నాయా అన్న ప్రశ్నకు.. అటువంటిదేమీ లేదని ఆ అధికారి అన్నారు. ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసే అవసరమున్న చీతాలకు మాత్రమే రేడియో కాలర్లను తొలగిస్తున్నామని వివరించారు.

చైనాలో కూలిన జిమ్ పైకప్పు.. 11 మంది మృతి


బీజింగ్: స్కూల్ జిమ్ పైకప్పు కూలిన ఘటనలో 11 మంది చనిపోయారు. చైనాలో హెయిలాంగ్‌జియాంగ్ ప్రావిన్స్‌లోని క్విక్విహర్ నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పైకప్పు కూలింది. ఆ సమయంలో జిమ్‌లో 19 మంది వరకు ఉన్నారు. ప్రమాదం నుంచి అయిదుగురు సురక్షితంగా బయటపడగా మరో నలుగురు స్వల్ప గాయాలపాలయ్యారు.

ఇండోనేసియాలో పడవ మునిగి... 15 మంది మృతి

జకార్తా: ఇండోనేసియాలోని సులవేసి దీవి సమీపంలో పడవ మునక ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. బుటోన్‌లోని లాంటో గ్రామం నుంచి సమీప లాగిలి గ్రామం వైపు 48 మందితో వస్తున్న పడవ సోమవారం అర్ధరాత్రి మునిగింది. సమాచారం అందిన వెంటనే సహాయక సిబ్బంది అక్కడికి చేరుకుని 33 మందిని రక్షించారు. మరో 15 మృతదేహాలను వెలికి తీశారు.

మరో ‘వాణిజ్య సవాలు’కు... ఇస్రో సన్నద్ధం

30న నింగిలోకి 7 సింగపూర్ శాటిలైట్లు



బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల పరంపరలో మరో ముందడుగు. సింగపూర్‌కు చెందిన సమాచార ఉపగ్రహం సింథటిక్ అపర్చర్ రాడార్ (డీఎస్-ఎస్ఏఆర్)తో పాటు మరో 6 బుల్లి ఉపగ్రహాలను సంస్థ పీఎస్ఎల్‌వీ-సి56 ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది. జూలై 30న ఉదయం శ్రీహరికోటలో మొదటి లాంచింగ్ ప్యాడ్ నుంచి జరిగే ఈ ప్రయోగం కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎస్ఏఆర్‌ను సింగపూర్ ప్రభుత్వ డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సింగపూర్ టెక్నాలజీస్ సంయుక్తంగా ఇంజనీరింగ్ లిమిటెడ్ అభివృద్ధి చేశాయి. ఇది పూర్తి వాణిజ్య ప్రయోగమని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ సోమవారం పేర్కొన్నారు.

- తొలుత జూలై 26న తలపెట్టిన ఈ ప్రయోగం 30కి వాయిదా పడింది.
- 360 కిలోల ఎస్ఏఆర్‌తో పాటు మొత్తం ఏడు ఉపగ్రహాలను భూమి నుంచి 535 కిలోమీటర్ల ఎత్తులో నియర్ ఈక్విటోరియల్ ఆర్బిట్ (ఎన్ఈఓ-నియో) కక్ష్యలోకి పీఎస్ఎల్‌వీ-సి56 ప్రవేశపెట్టనుంది.
- మిగతా ఆరు ఉపగ్రహాలు వెలోక్స్-ఏఎం (23 కిలోలు), ఆర్కేడ్, స్కూబ్-2, న్యూలియోన్, గలాసియా-2, ఆర్బ్-12 స్ట్రైడర్.

మనీ లాండరింగ్ కేసుల్లో 93 శాతం నేర నిరూపణలు

న్యూఢిల్లీ: దేశంలో గత తొమ్మిదేళ్లలో మనీ లాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 93.54 శాతం నేరాలను నిరూపించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద 31 కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసిందని, ఇందులో 29 కేసుల్లో 54 మందిని దోషులుగా గుర్తించిందని వెల్లడించారు. పీఎంఎల్ఏ కింద నేర నిరూపణ రేటు 93.54 శాతం ఉందని పేర్కొన్నారు. అలాగే ఈడీ గత తొమ్మిదేళ్లలో రూ.16,507.86 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిందని తెలియజేశారు.

వాట్సాప్ స్టేటస్‌తోనూ సమాచార వ్యాప్తి

ముంబై: వాట్సాప్ యాప్ ద్వారా ఇతరులకు సమాచారం అందించాలనుకునే వారు బాధ్యతాయుత వైఖరి కలిగి ఉండాలని బాంబే హైకోర్టు నాగ్‌పూర్ ధర్మాసనం పేర్కొంది. వాట్సాప్ ద్వారా మతాల మధ్య విద్వేషాలను పెంచుతున్నారంటూ ఓ వ్యక్తిపై నమోదైన కేసును కొట్టివేసేందుకు నిరాకరించింది. వాట్సాప్ స్టేటస్‌తో యూజర్లు తమ ఉద్దేశాలను ఇతరులకు తెలియజేస్తున్నారని తెలిపింది. ఈ మేరకు డివిజన్ బెంచ్ ఈ నెల 12న ఇచ్చిన ఉత్తర్వుల్లో తెలిపింది.





కళ్లుసహా ఒళ్లంతా బొబ్బలతో అరుదైన వ్యాధితో పుట్టినప్పటి నుంచి బాధపడుతున్న టీనేజర్ ఇతను. వాపుతో నరక యాతన అనుభవించిన ఇతనికి అమెరికాలో ఆల్ఫోన్సో సబేటర్ అనే వైద్యుడు జన్యుమార్పిడి కంటిచుక్కల మందుతో మళ్లీ చూడగలిగేలా చేశాడు. క్యూబాకు చెందిన ఈ పిల్లాడి కుటుంబం గత పదేళ్లుగా వైద్యం కోసం అమెరికాలోనే ఉంటోంది. చికిత్స సమయంలో మయామీ నగరంలో తీసిన ఫొటోలివి.



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరులోకి వరద వస్తోంది. సోమవారం మూలవాగు నుంచి 2,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి 1,530 క్యూసెక్కుల నీరు వెళ్తోంది.



మాక్ ఓటింగ్‌కు స్పందన

కరీంనగర్‌అర్బన్: ఈవీఎం అవగాహన కేంద్రాలు సత్ఫలితాలనిస్తున్నాయి. కలెక్టరేట్, నియోజకవర్గానికో ఈవీఎం ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేయగా ప్రజలు అవగాహన పొందుతున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గరుడ జంక్షన్ పనులు ప్రారంభం



కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని పద్మనగర్ జంక్షన్ అభివృద్ధి పనులు మొదలయ్యాయి. గరుడ వాహన నమూనాతో ఏర్పాటు చేయనున్న జంక్షన్ నిర్మాణానికి సోమవారం నగరపాలకసంస్థ అధికారులు మార్కింగ్ చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పద్మనగర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండడం తెలిసిందే. ఆలయ నిర్మాణ స్థలానికి సమీపంలో కరీంనగర్– సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతిలో ఉన్న తరహాలో గరుడవాహన నమూనాతో జంక్షన్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, నగరపాలక సంస్థ ఈఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ ఫలాలు అందాలి



కరీంనగర్: ఉపాధ్యాయుల శ్రద్ధ, పనిపైన ఆసక్తి విద్యకు దోహదం చేస్తుందని, తద్వారా విద్యార్థి ప్రయోజకుడవుతాడని, అందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ విశేషంగా దోహదపడుతుందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. స్థానిక సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. జిల్లాలోని 16 మండలాల నుంచి సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున వచ్చిన 96 మంది ఉపాధ్యాయులకు దిశానిర్దేశనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



హుజూరాబాద్‌రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో లలితాదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో పట్టణానికి సంబంధించిన పాలీ క్లినిక్‌లు, హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్‌ల డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశం జరిగింది. ముఖ్యంగా ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్స్ డెంగీ వ్యాధికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలు చేసి రిపోర్టును, పేషెంట్‌ను కరీంనగర్ ప్రధాన ఆసుపత్రికి పంపించాలని పేర్కొన్నారు. మొదటి కాన్పునకు సంబంధించి గర్భిణులకు వెంటనే సెక్షన్ ఆపరేషన్లు చేయరాదని, నార్మల్ డెలివరీస్ చేయాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిద్ హుస్సేన్, వైద్యులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని అంబేద్కర్ రిజర్వాయర్ పరిధిలో మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ బి.మహేందర్ తెలిపారు. హైలెవెల్ జోన్ పరిధిలోని కోర్టు ట్యాంక్ నుంచి అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్‌కు వెళ్లే పంపింగ్ లైన్ లీకేజీ అయిందని, లీకేజీ మరమ్మతు పనులు జరుగుతున్నందున నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రిజర్వాయర్ పరిధిలోని 2,3,4,5,24,25,26,27,28,42,44 డివిజన్‌ల ప్రజలు నీటిని వృథా చేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

కొత్తపల్లిలో 6.8 సెం.మీ వర్షపాతం

కరీంనగర్ అర్బన్: వానలు దంచికొడుతున్నాయి. కొన్ని రోజులుగా స్వల్ప విరామమిస్తూ వర్షాలు కురుస్తుండగా చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కొత్తపల్లిలో 6.8సెం.మీ వర్షం కురిసింది. కరీంనగర్ అర్బన్‌లో 4.8, మానకొండూరు4, రామడుగు 3.6, గంగాధర, గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల్లో 3.4, చొప్పదండి 2.3, శంకరపట్నం 1.7, జమ్మికుంట 1.6, చిగురుమామిడి 1.4, వీణవంక 1.1సెం.మీ వర్షం పడగా అత్యల్పంగా ఇల్లందకుంటలో 9 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా మరో రెండురోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

ఎక్కే మెట్టు దిగే మెట్టు

- ఒక్కొక్కరిది ఒక్కో గాథ
- పరిష్కరించాలని వేడుకోలు
- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు

మొత్తం అర్జీలు	228
మునిసిపల్ కార్పొరేషన్	33
జిల్లా పంచాయతీ కార్యాలయం	28
డబుల్ బెడ్‌రూం	65
పింఛన్లు	34
భూ సమస్యలు	48
ఇతర అర్జీలు	20



ప్రజావాణిలో అర్జీలు తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

కరీంనగర్‌అర్బన్: అవే సమస్యలు.. అవే నివేదనలు. ఆశగా అర్జీలు ఇవ్వడం పరిష్కారం కోసం పడిగాపులు వెరసి మళ్లీ ప్రజావాణిని ఆశ్రయించడం పరిపాటిగా మారింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో వందల్లో అర్జీలు ఇస్తుండగా వాటి పరిష్కారం అంతంతమాత్రమే. భూ సమస్యలు తీరవు, పింఛన్లు రావు.. రేషన్ కార్డులు ఇవ్వరు.. డబుల్ బెడ్‌రూం, దళితబంధు దరఖాస్తులు కుప్పల్లా పేరుకుపోతున్నాయే తప్ప సాంత్వన అంతంతే. వాస్తవానికి మండలస్థాయి అధికారుల్లో జవాబుదారితనముంటే ప్రజలు ప్రజావాణికి రావాల్సిన అవసరం లేదు. అక్కడి నిర్లక్ష్యంతోనే కలెక్టరేట్‌కు చేరుతున్న వారి సంఖ్య. పరిష్కరించే సమస్యలను కూడా నాన్చడం వీరికే చెల్లు. సోమవారం 228 అర్జీలు రాగా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టొప్పొ స్వీకరించారు.

మమ్మల్ని ఆదుకోండి



ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి. ఆసరా పెన్షన్, డబుల్ బెడ్ రూం, ఆరోగ్యశ్రీ కల్పించాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రత్యేక సాయం అందేలా చర్యలు చేపట్టాలి. సమాజంలో ట్రాన్స్‌జెండర్లంటే చిన్నచూపు ఎక్కువ. ఎలాంటి ఆదరణ లేక బిక్షాటన చేస్తూ జీవిస్తున్నాం. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి మాకో దారి చూపాలి.

– ట్రాన్స్‌జెండర్స్, మోడ్రాన్ అవెర్నెస్ సొసైటీ

వస్త్రమే వినతి పత్రం



ధరించిన టీ షర్ట్‌నే నిరసనాస్త్రంగా ప్రదర్శించాడో వ్యక్తి. ట్రాన్స్‌కో సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రజావాణిలో బైఠాయించారు. ఇప్పటికి ఆరుసార్లు కలిసినా పరిష్కారం లేదని వాపోయారు. తిమ్మాపూర్ మండలం అల్గునూరుకు చెందిన సిరిసిల్ల అంజయ్యకు గ్రామంలోని 83 సర్వే నంబర్‌లో 0.18గుంటల భూమి ఉంది. అందులో 33కేవీ విద్యుత్తు లైన్ వేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రయత్నించగా పలుమార్లు అడ్డుకున్నానని వివరించాడు. కానీ కాలి నొప్పితో విశ్రాంతి తీసుకోవడం, కూతురి పరీక్ష ఉండటంతో హైదరాబాద్ వెళ్లడంతో కావాలని తన భూమిలో నుంచి విద్యుత్తు లైన్ వేశారని, అధికార పార్టీ నేత అతడి భూమి నుంచి లైన్ వెళ్లకుండా తన భూమి నుంచే వేయించారని వాపోయారు. విద్యుత్ లైన్ తొలగించండి లేదా తనను చంపనైనా చంపండంటూ కన్నీరుమున్నీరయ్యారు.

– సిరిసిల్ల అంజయ్య, అల్గునూరు, తిమ్మాపూర్

ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా?



శ్రీహరినగర్ రోడ్‌నంబర్ 3లో గల ఇంటి నంబర్ 9–9–155/బి ఎదురుగా ప్రమాదకరంగా చెట్టు ఉంది. ఏ నిమిషాన కూలుతుందో తెలియదు. ఆ చెట్టు నుంచే ప్రమాదకరంగా విద్యుతు వైర్లు ఉండగా దీనికి తోడు అక్కడే మురికికాలువ ఉండగా పిల్లలు అందులో పడే ప్రమాదముంది. సమస్యను పరిష్కరించాలని ఇప్పటికి నాలుగుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశా. అర్జీ ఇవ్వడం, మళ్లీ ఇవ్వడం ఇదే నా పని.

– మాశె సంజీవయ్య, శ్రీహరినగర్, కరీంనగర్

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినా చర్యలు తీసుకోరా?



గ్రామంలోని సర్వే నంబర్ 146లో గల 4.22ఎకరాల భూమిని 1986–87లో ప్రభుత్వం కొనుగోలు చేసి దళిత కుటుంబాలకు పంపిణీ చేసింది. ఇళ్ల స్థలాలుగా 50మందికి పంపిణీ చేయగా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో పునాది దశలోనే వదిలేశాం. దీన్ని ఆసరా చేసుకున్న పక్క హద్దులు గల కొందరు కబ్జా చేసి తమదేనంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూమికే రక్షణ లేకుంటే మిగతా వారి పరిస్థితి ఏంటి. కబ్జా చెర నుంచి భూమిని విడిపించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

– దళితులు, లక్ష్మీపూర్, రామడుగు

రెన్యూవల్ చేయాలి

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్య విధాన్ పరిషత్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో విలీనం అయ్యాయని, కానీ ఇందులో పనిచేస్తున్న కొందరి ఉద్యోగాలు విలీనం, రెన్యూవల్ చేయాలని కోరుతూ తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయ్ యూనియన్ బాధ్యులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు నెలల వేతనాలు ఇప్పించడంతోపాటు ఏజెన్సీ విధానం రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి అసది స్వప్న, జిల్లా అధ్యక్షుడు పెద్దెల్లి ఆశిష్, బాధ్యులు శ్రీదేవి, వెంకటరమణచారి, సుధాకర్, సంతోష్, ఆదిశేషు, శ్రీకాంత్, కల్పన, నాగరాజ, ప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కాంట్రాక్టు ఉద్యోగులు

ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ కేటీఆర్



కేక్‌కట్ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, మేయర్ సునీల్‌రావు తదితరులు

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్: గాడ్ ఆఫ్ తెలంగాణ సీఎం కేసీఆర్ అయితే.. ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ మంత్రి కేటీఆర్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో 47కిలోల భారీ కేక్‌ను కట్ చేసి మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, హైదరాబాద్ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన ఘనత మంత్రి కేటీఆర్‌దేనని కొనియాడారు. ఆయన ఆలోచన విధానాలతోనే తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందని వివరించారు. ఐటి, మున్సిపల్ శాఖలో ఎన్నో సంస్కరణలు తెచ్చారని, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలు తెలంగాణ వైపు చూస్తున్నాయంటే అది కేటీఆర్ చొరవేనని వెల్లడించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో బీఆర్ఎస్ రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



టార్పాలిన్లు అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

రూ. 5 లక్షల టార్పాలిన్లు అందజేత

వరుసగా కురుస్తున్న వర్షాలకు పెంకుటిళ్లు...రేకుల షెడ్లు...పురాతనగృహాలు ఉరుస్తున్నాయి. వర్షాలకు ఆ ఇండ్లల్లో ఉండే పరిస్థితి లేకుండా పోయింది. గమనించిన స్థానిక కార్పొరేటర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు వారికి అండగా నిలిచారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 33వ డివిజన్ భగత్‌నగర్‌లో సుమారు రూ.5 లక్షల విలువైన 300 టార్పాలిన్ కవర్లు స్వయంగా ఇళ్లవద్దకు వెళ్లి అందజేశారు. పేద ప్రజల కళ్లల్లో ఆనందం చూడాలన్న కేటీఆర్ ఆశయం మేరకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా తన డివిజన్‌లోని ప్రజలకు అవసరమైన టార్పాలిన్లు అందజేసినట్లు మేయర్ తెలిపారు. సంజయ్ నగర్, గోదాంగడ్డ, అయ్యప్ప టెంపుల్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లోని పెంకుటిళ్లు, రేకులఇండ్లలో నివసించే పేద ప్రజలకు టార్పాలిన్ కవర్లు అందచేశామన్నారు.

‘పేదలను మభ్యపెడుతున్న సీఎం’



మహాధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరుపేదలకు సొంతింటి కల అందని ద్రాక్షగా మారిందని మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్లుగా పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఇన్నేళ్లలో అరకొర నిర్మాణాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఎవరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయని, నాణ్యత లేని పనులతో శిథిలావస్థకు చేరుకున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని, రాష్ట్రంలో ఆ స్కీం కింద 2.5 లక్షల ఇళ్లు మంజూరు కాగా, రూ.4,466 కోట్ల నిధులు కూడా విడుదల చేసిందన్నారు. ధర్నాలో కోమల ఆంజనేయులు, మేకల ప్రభాకర్‌యాదవ్, బాస సత్యనారాయణ, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బత్తుల లక్ష్మీనారాయణ, బోయినపల్లి ప్రవీణ్‌రావు, గడ్డం నాగరాజు, చేపూరి సత్యం, లోకేష్, కళ్యాణ్‌చంద్ర, స్వామి, సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, జయశ్రీ, రఘు, బల్బీర్ సింగ్, శ్రీనివాస్, రతన్, లక్ష్మారెడ్డి, సంతోష్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలెప్పుడొచ్చినా రెడీగా ఉండండి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్‌అర్బన్: ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని, ఆ దిశగా ప్రతి పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగునీరు, టాయిలెట్ వంటి మౌలిక వసతులు కల్పించాలని, వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి

జిల్లాలో వారం రోజుల్లోగా వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ, ఆయిల్ పామ్ సాగు, హరితహారం పనుల కార్యాచరణపై సమీక్షించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్ నోటీసులను జారీచేయాలని ఆదేశించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ట్రెయినీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, ఆర్డీవో మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఓ జగత్‌సింగ్, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్పీల బదిలీ





ఎస్.శ్రీనివాస్ సునీతామోహన్ జి.చంద్రమోహన్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు నాన్ క్యాడర్ ఎస్పీలను సోమవారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. కరీంనగర్ అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేసిన ఎస్.శ్రీనివాస్‌కు ఎస్పీగా ఇటీవల పదోన్నతి కల్పించగా ఇప్పుడు కరీంనగర్ పీటీసీ ప్రిన్సిపల్‌గా నియమించారు. కరీంనగర్ అడిషినల్ డీసీపీ (అడ్మిన్)గా పనిచేసిన గుండేటి చంద్రమోహన్‌ను మల్టీ ఏజెన్సీ ఆపరేషన్ సెంటర్ (కమాండ్ కంట్రోల్) ఎస్పీగా, కరీంనగర్ పీటీసీ ప్రిన్సిపల్‌గా పనిచేసిన జి.సునీతా మోహన్‌ను పీసీఎస్ అండ్ ఎస్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త అడిషనల్ డీసీపీలు..

కరీంనగర్ కమిషనరేట్‌కు వెయింటింగ్‌లో ఇద్దరు అదనపు డీసీపీలకు పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ అడిషనల్ డీసీపీగా (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ, అడిషనల్ డీసీపీగా (అడ్మిన్) రాజుకు పోస్టింగ్ పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.






పందుల గుంపు.. నగరంలో కంపు

అసలే వర్షాకాలం... వ్యాధులు ముసురుకుంటున్నాయి. కార్పొరేషన్ పరిధిలో పందులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. మురికికూపాలు, నాలాలు, డ్రైనేజీలను ఆవాసం చేసుకుంటున్నాయి. సిటీలో పందులు కనిపించకుండా చేశామని నగరపాలకసంస్థ అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అదేమీ కనిపించడంలేదు. వావిలాలపల్లి, ఆదర్శనగర్, సుభాష్‌నగర్, కిసాన్‌నగర్, విద్యారణ్యపురి, కార్ఖానగడ్డ, దుర్గమ్మగడ్డ, హౌసింగ్‌బోర్డుకాలనీ, కాపువాడ, లక్ష్మీనగర్, పోచమ్మవాడ, భగత్‌నగర్, జ్యోతినగర్, ముకరంపుర తదితర ప్రాంతవాసులకు పందుల బెడద తప్పడంలేదు.

– కరీంనగర్ కార్పొరేషన్/ సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

ప్రభుత్వ సలహాదారును కలిసిన టీఎన్జీవోలు



సోమేశ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సోమేశ్‌కుమార్‌ను టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. సంఘం జిల్లా నాయకులు సంగెం లక్ష్మణ్‌రావు, నాగుల నర్సింహస్వామి, ముప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, రాగి శ్రీనివాస్, గంగారపు రమేశ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, తమ్మిశెట్టి నాగరాజు, శ్రీరాములు, శంకర్, కర్ణాకర్ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీపీవో వీరబుచ్చయ్య
- గంగారం, చల్లూరు, హిమ్మత్‌నగర్‌లలో పర్యటన



గంగారంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

వీణవంక: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పరిశీలనలో భాగంగా వీణవంక మండలంలోని గంగారం, చల్లూరు, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, మరుగుదొడ్లకు నీటి సదుపాయం ఉందా లేదా అని పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు తయారీ విధానం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘అల్ఫోర్స్’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ నవార్స్ ఎడ్యుటెక్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాసో పోటీ పరీక్షలో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు మెహమద్, తల్‌హసన్(5వ తరగతి) ప్రతిభ కనబరిచి, ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారిని సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్ట్రానమి, సైన్స్ సబ్జెక్టుల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించి, పోటీ పరీక్షల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- చివరి దశలో జాతీయ రహదారి భూ సేకరణ
- అదనంగా వసూలు చేసే మీసేవ కేంద్రాలపై కఠినంగా వ్యవహరిస్తాం
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన
- ‘సాక్షి’తో కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ ముఖాముఖి



కరీంనగర్ అర్బన్: విధులను నిర్లక్ష్యం చేసిన ఉద్యోగులపై చర్యలు తప్పవని కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ అన్నారు. అర్జీలపై ఎప్పటికప్పుడు సమీక్షించి, పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పారదర్శక సేవలందించాలని తహసీల్దార్లకు సూచించారు. కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి, గంగాధర, రామడుగు, గన్నేరువరం, తిమ్మాపూర్, చిగురుమామిడి, మానకొండూరు మండలాల పరిధిలో రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలుంటాయన్నారు. ఆయన సోమవారం ‘సాక్షి’తో ముఖాముఖి మాట్లాడారు.

ఇంకొంత మంది రైతులకు పరిహారం

వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారి భూ సేకరణ చివరి దశలో ఉంది. ఇంకొంత మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. అభ్యంతరాలు, సాంకేతిక సమస్యలు ఉన్నతాధికారుల సమక్షంలో పరిష్కారం కానున్నాయి. వీలైనంత త్వరగా అన్ని రకాల అవరోధాలు అధిగమిస్తాం.

ప్రజలకు సత్వర సేవలందాలి

ప్రజలకు సత్వర సేవలందేలా అధికారుల చర్యలుండాలి. ప్రజావాణికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలి. లేని క్రమంలో అందుకు కారణాలను అర్జీదారులకు తెలియజేయాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వెంటనే ధ్రువపత్రాలు జారీ చేయాలి.

పక్కాగా ఓటరు జాబితా

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఓటరు జాబితాను పక్కాగా రూపొందిస్తున్నాం. బోగస్ ఓటర్లను తొలగించాం. సాంకేతికతను వినియోగించి, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఓటరుగా నమోదుకు చర్యలు చేపడుతున్నాం. ఓటర్ల సంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాల పెంపు ఉండనుంది.

బోగస్ మీసేవ కేంద్రాలపై క్రిమినల్ కేసులు

మీసేవ కేంద్రాల్లో నిర్దేశించిన రుసుమునే అర్జీదారు నుంచి వసూలు చేయాలి. అంతకుమించి తీసుకుంటే కఠినంగా వ్యవహరించి, కేంద్రాలను సీజ్ చేస్తాం. ఏయే సేవలకు ఎంత వసూలు చేయాలో సూచించే బోర్డు కచ్చితంగా ప్రదర్శించాలి. ఒకే కేంద్రం పేరిట బోగస్ కేంద్రాలను నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

రేషన్ దుకాణాలపై నిరంతర నిఘా

రేషన్ దుకాణాలను రెవెన్యూ అధికారుల నిరంతర నిఘా ఉంటోంది. పోషకాలతో కూడిన బియ్యం ఇస్తున్నందున వినియోగదారులు అమ్ముకోవద్దు. బియ్యం వద్దనుకుంటే కార్డు రద్దు చేసుకోవాలి. ఫిజికల్‌గా క్లోజింగ్ బ్యాలెన్స్ చూశాకే అలాట్‌మెంట్ చేస్తున్నాం.

గ్యాస్ వినియోగదారులు ఫిర్యాదు చేయాలి

గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనంగా వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. వినియోగదారులు తమ సెల్‌ఫోన్‌కు వచ్చే మెస్సేజ్ ప్రకారమే డబ్బులు ఇవ్వాలి. అంతకుమించి అడిగితే ఫిర్యాదు చేయాలి. తూకం సరిగా ఉందో లేదో చూసుకొని, గ్యాస్ బండ తీసుకోవాలి.

ఓట్ల గల్లంతు ఉండదు

అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటరు జాబితాలను ఇచ్చాం. మరణించిన వారి పేర్ల తొలగింపు, బూత్‌ల మార్పు, కొత్త ఓటర్ల నమోదు వంటివాటిలో వారిని భాగస్వాములను చేశాం. ఈసారి ఓట్ల గల్లంతు ఉండదు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కోసం డబ్బులివ్వొద్దు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, మంజూరుకు పంపిస్తున్నాం. నిధులు విడుదలైతే చెక్కులిస్తున్నాం. ఎవరికీ డబ్బులివ్వొద్దు.

స్వశక్తి మహిళల డబ్బులు ఏమైనట్లు?

- రూ.30 లక్షలను కొందరు సొంతానికి వాడుకున్నట్లు సమాచారం
- లంబాడిపల్లిలో ఘటన
- స్పందించని ఏపీఎం

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లిలో 20 స్వశక్తి సంఘాల మహిళలు 2018 నుంచి ఇప్పటివరకు ప్రతినెలా చెల్లించిన దాదాపు రూ.30 లక్షలను కొందరు సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. ఆరు నెలలుగా ఈ విషయం బయటకు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీనిపై సెర్ప్ అధికారులు ఎటూ తేల్చలేకపోతున్నారు. ఆయా సంఘాల మహిళలు చిగురుమామిడిలోని యూనియన్ బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు ఎందుకు చెల్లించడం లేదని గతంలో పని చేసిన బ్యాంకు అధికారులు గుర్తించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో ఏ స్థాయి అధికారి అండదండలతో స్వశక్తి సంఘాల మహిళల డబ్బులు దుర్వినియోగం చేశారోనన్న చర్చ జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని స్వశక్తి సంఘాల్లో లావాదేవీలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని సెర్ప్ ఏపీఎం ప్రతినెలా జరిగే సమావేశంలో ఆరా తీయాల్సి ఉంటుంది. కానీ ఇదేదీ జరగకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. గ్రామంలో సర్పంచు, ఉపసర్పంచు, పలువురు గ్రామ పెద్దల సమక్షంలో మహిళా సంఘాల డబ్బుల విషయమై చర్చించినట్లు సమాచారం. తమ సొంతానికి వాడుకున్న వారికి తిరిగి చెల్లించేందుకు కొంత గడువు కూడా ఇచ్చినట్లు తెలిసింది. బ్యాంకు అధికారులు, సెర్ప్ సిబ్బంది సహకారం వల్లే ఇదంతా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని, కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని, ఆ డబ్బులను తిరిగి మహిళా సంఘాల తరఫున బ్యాంకులో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై చిగురుమామిడి సెర్ప్ ఏపీఎంకు సోమవారం సాయంత్రం ఫోన్ చేయగా స్పందించలేదు.

‘ఎల్‌ఎండీ’లో భారీ చేపలు



గన్నేరువరం: మండల కేంద్రానికి చెందిన బోయిని కుమార్ అనే మత్స్యకార్మికుడికి బొచ్చె రకానికి చెందిన 18 కిలోల రెండు భారీ చేపలు చిక్కాయి. సమీప ఎల్‌ఎండీలో సోమవారం అతను చేపల వేటకు వెళ్లాడు. ఉదయం వల వేయగా 18 కిలోల చేప చిక్కినట్లు తెలిపాడు. మళ్లీ వల వేసి, ఇంటికి వెళ్లాడు. సాయంత్రం వచ్చి తీయగా మరో భారీ చేప చిక్కిందని సంతోషం వ్యక్తం చేశాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- ఈ నెల 5న ఆత్మహత్యాయత్నం
- లారీ కొనుగోలు విషయంలో వివాదమే కారణం



దుర్గా (ఫైల్)

జమ్మికుంట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన వనరాసి దుర్గా(22) మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన హరిబాబు వద్ద దాదాపు రూ.10 లక్షలకు లారీ కొనుగోలు చేసి, రూ.3 లక్షలు కిస్తీ రూపంలో చెల్లించాడు. మిగతా డబ్బులు చెల్లించే స్తోమత లేకపోవడంతో తాను ఇచ్చిన డబ్బుల్లో రూ.లక్ష ఉంచుకొని, మిగతావి ఇవ్వాలని హరిబాబును కోరాడు. కానీ అతను ఇవ్వకుండా మొత్తం చెల్లించాలని ఒత్తిడి చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన దుర్గా ఈ నెల 5న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు అతని మృతదేహాన్ని సోమవారం జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని, ఫిర్యాదు ఇవ్వాలని కోరినా వినిపించుకోలేదు. దుర్గా మృతదేహాన్ని తీసుకొని, మందమర్రిలోని హరిబాబు ఇంటి వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లారు. కానీ అక్కడి పోలీసులు గ్రామ శివారులోనే అడ్డుకొని, మృతదేహాన్ని తీసుకెళ్లాలన్నారు. లేకపోతే కేసు పెడతామని హెచ్చరించడంతో జమ్మికుంటకు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దుర్గా మృతిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జమ్మికుంట పట్టణ ఏఎస్సై రాధాకృష్ణ పేర్కొన్నారు.

‘హరీశ్‌రావువి అహంకార పూరిత మాటలు’

కరీంనగర్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కమ్యూనిస్టులకు కార్యకర్తలు లేరని సీపీఐ, సీపీఎంల మాయలో పడొద్దని, వ్యాఖ్యానించడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో అన్నారు. హరీశ్‌రావు అహంకారపూరిత మాటలు మానుకోవాలని హితవు పలికారు. మునుగోడులో కమ్యూనిస్టులు లేకుండా బీఆర్‌ఎస్ విజయం ఊహించలేమని సీఎం కేసీఆర్, మంత్రులు మాట్లాడిన మాటలు గుర్తు చేసుకోవాలని సూచించారు. సీపీఐ, సీపీఎం కార్యకర్తల బలమేంటో రానున్న రోజుల్లో తెలుస్తుందన్నారు. సీపీఐ, సీపీఎంలు నిరంతరం కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్‌లా కార్యకర్తలను, నాయకులను పదవులు, డబ్బుల ఆశ చూపి, కొనుగోలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఓట్లు, సీట్లు, అధికారం కోసం వెంపర్లాడే మీరా మమ్మల్ని విమర్శించేదంటూ మండిపడ్డారు. మరోసారి సీపీఐ, సీపీఎంల గురించి తక్కువ చేసి, మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

సమాజహితం కోరేదే అసలైన కవిత్వం



మధు కవనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కిషన్‌రావు

కరీంనగర్‌కల్చరల్: భాష ఏదైన కవితాక్షరాలు సమాజ హితాన్ని కోరుతూ జాతిని జాగృత పరుస్తాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన మధు కవనం గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మధు కవనం కవితా సంపుటిలో గ్రామీణ వాతావరణం బడుగుల బతుకు వెతలు, యువ చైతన్య అంశాలనే కవితా వస్తువులుగా చేసుకొని పామరులకు సహితం అర్థమయ్యేలా కవితలు పండించారని కొనియాడారు. వృత్తిరీత్యా రసాయనశాస్త్ర ఆచార్యులు అయినప్పటికీ తన గ్రామీణ నేపథ్యాన్ని ఆసరాగా చేసుకొని పలు కవితలు అక్షరీకరించడం ముదావహం అన్నారు. రచయిత, కవి, కాలమిస్టు బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మన తీపి చేదు జీవన అనుభవాలను పునాదులుగా చేసుకొని సమాజ అవలక్షణాలు, సుగుణాలను తనదైన శైలిలో కవితాక్షరాల రూపంలో కవితలు రాయడం జరిగిందన్నారు. విశిష్ట అతిథులు ప్రముఖ సాహితీ దిగ్గజం దాస్యం సేనాధిపతి, నేటినిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాసులు మాట్లాడుతూ వస్తు ఎంపికలో వైవిధ్యాన్ని పాటిస్తూ బుర్ర మధుసూదన్‌రెడ్డి కవిగా శిల్పంలో చతురత ప్రదర్శించారని అన్నారు. ఆత్మీయ అతిథి సాహితీవేత్త మచ్చ హరిదాసు మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి కవిత్వంతో పాటు కాలమిస్టుగా నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పేరును పొందడం సంతోషదాయకమన్నారు. మచ్చ హరిదాసు రచించిన మచ్చ వీరయ్య భక్తితత్వ ప్రకాశిక గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఐనంపూడి శ్రీలక్ష్మి, హాంకాంగ్ తెలుగు సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పీచపాటి జయ, విశ్రాంత డీఈవో అనభేరి రాజేశ్వర్‌రావు, కవి బొమ్మకంటి కిషన్, అనుముల దయాకర్, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

‘పాఠశాలల పనివేళల మార్పు ఉపసంహరించుకోండి’

కరీంనగర్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలను ఉదయం 9 గంటలకు బదులు 9.30 గంటలకు మార్చడం అశాస్త్రీయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) కార్యదర్శి గోల్కొండ శ్రీధర్ ఒక ప్రకటనలో అన్నారు. పనివేళలు మార్చాలంటే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాంటిదేమీ లేకుండానే మార్పు చేయడం విచారకరమన్నారు. ఇది కొద్దిమంది ఉపాధ్యాయులకు ఉపయోగపడవచ్చునేమో గానీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఏమాత్రం ఉపయోగం కాదని తెలిపారు. పాఠశాలల పనివేళల మార్పుపై రాష్ట్ర విద్యాశాఖ అశాస్త్రీయంగా ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు.

పలువురు ఏసీపీల బదిలీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా కె.గిరికుమార్, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా ఉన్న జె.విజయసారథిని డీజీపీ కార్యాలయానికి, వి.మాధవిని కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా, కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా ఉన్న కె.శ్రీనివాస్‌ను డీజీపీ కార్యాలయానికి, టి.మల్లారెడ్డిని రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, జి.వెంకటేశ్వర బాబును జగిత్యాల సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు.

గురుకుల కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో గల మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ గౌతం రెడ్డి తెలిపారు. కళాశాలలో సీట్లు కావాల్సిన వారు ఉదయం 11 గంటలకు ఆయా కళాశాలలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సీట్లు పొందాలని సూచించారు. అభ్యర్థులు ఆదాయం, కులం, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే కేసీఆర్ డ్రామాలు

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్



నగేశ్

వీణవంక: విధివిధానాలు లేకుండా ఎన్నికల్లో లబ్ధి కోసమే సీఎం కేసీఆర్ బీసీ, మైనారిటీ పథకాలు అంటూ డ్రామాలు ఆడుతున్నారని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం వీణవంకలో ఆయన మాట్లాడారు. బీసీలకు రూ.లక్ష సాయం ఈ నెల 15న ఇస్తామని ప్రకటించి, ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరంతర ప్రక్రియ అని బీసీలను మోసం చేస్తున్నాడని అన్నారు. మైనారిటీల్లో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, వారిపై మమకారం ఉంటే 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తెలంగాణ వస్తే బతుకులు బాగు పడటాయని అనుకుంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూలేటట్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ కాలగర్భంలో కలవడం ఖాయమని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీ, మైనారిటీ పథకాలకు విధివిధానాలను ప్రకటించి, ఆర్థికసాయాన్ని సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.

పట్టించుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- సిరిసిల్లలోని ప్రజావాణికి పురుగుల మందు డబ్బాలతో వచ్చిన బాధితులు



పోలీసుల అదుపులో బాధితుడు

సిరిసిల్లఅర్బన్: రోజులకొద్దీ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ ఇద్దరు బాధితులు సోమవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. తమ సమస్య పరిష్కరించకుంటే చావే దిక్కంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన కర్రెడ్ల రాజిరెడ్డికి వారసత్వంగా వచ్చిన 37 గుంటల భూమి ఉంది. ఆ భూమిపై మార్టిగేజ్ రుణం తీసుకొని చెల్లించాడు. భూమి పత్రాలు ఇవ్వాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విసిగివేసారిపోయిన రైతు రాజిరెడ్డి ప్రజావాణికి క్రిమిసంహారక మందుడబ్బాతో రాగా పోలీసులు అడ్డుకునే యత్నం చేశారు. గమనించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగంలోకి తీసుకోండి..

వేములవాడకు చెందిన మహమ్మద్ అజామ్‌షరీఫ్ ఆదిలాబాద్ జిల్లాలో డీఆర్‌డీఏలో పన్నెండేళ్లు పని చేసి అనారోగ్య సమస్యతో మానేశాడు. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆరేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ప్రజావాణికి పురుగుల మందు డబ్బాతో రాగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేతలతో పోటీల నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్: రెండు రోజులుగా కరీంనగర్‌లోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్న ఉత్తర తెలంగాణ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శరత్‌కుమార్ రెడ్డి హాజరై, విజేతలకు బహుమతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. పోటీల కో–ఆర్డినేటర్ మద్దెల వికాస్ మాట్లాడుతూ.. జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గౌతమ్ రెడ్డి, పోటీల నిర్వాహకులు ఎస్.సురేందర్ సింగ్, కంకట అనూప్, ఆర్.నరేన్, పి.సత్యనారాయణ, శ్రీధర్, ఉపేందర్ కౌర్, ఎం.సంతోష్, జి.హర్ష, మణి, రాకేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–13 బాలుర విభాగంలో పి.జయంత్, చార్విక్(ఖమ్మం), ఎస్కే.దిల్షాన్(కరీంనగర్), బాలికల విభాగంలో అవనిరెడ్డి(కరీంనగర్), ఎస్.శివాని(ఖమ్మం), సత్య చతుర్వేది(మంచిర్యాల) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–16 బాలుర విభాగంలో జ్వలిత్(ఖమ్మం), పి.అజయ్(కరీంనగర్), డి.గణేశ్(నిజామాబాద్), బాలికల విభాగంలో జి.సిరి(ఖమ్మం), వై.అన్విరెడ్డి(కరీంనగర్), సత్య చతుర్వేది(మంచిర్యాల), అండర్–19 బాలుర విభాగంలో ఎస్.జత్సింగ్, సాయితేజ, పి.అజయ్(కరీంనగర్), బాలికల విభాగంలో ఎం.అభిజ్ఞ(కరీంనగర్), ఎం.ధరణి(ఖమ్మం), వి.సిరి(ఖమ్మం), పురుషుల సింగిల్స్ విభాగంలో లోకేశ్(కొత్తగూడెం), సంతోష్(కరీంనగర్), శశికుమార్(ఖమ్మం), డబుల్స్ విభాగంలో రియాజ్ షేక్, లోకేశ్(కొత్తగూడెం), సంతోష్, పర్శరాం(కరీంనగర్), రవి, రమేశ్(వరంగల్), మహిళల సింగిల్స్ విభాగంలో ఎ.తన్మయి(వరంగల్), ఆర్.ప్రీతి(నిజామాబాద్), ఎం.అభిజ్ఞ(కరీంనగర్), డబుల్స్ విభాగంలో ప్రీతి, శ్వేత (నిజామాబాద్), అన్విరెడ్డి, ఎం.అభిజ్ఞ(కరీంనగర్), సింధు, శ్రావ్య(కరీంనగర్) మొదటి మూడు స్థానాలు సాధించారు.

ఓటింగ్ యంత్రాల గురించి తెలుసుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

హుజూరాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ మండలం రాజపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం మొబైల్ వాహనాన్ని, హుజురాబాద్ తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం డిమాన్‌స్ట్రేషన్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు కేవలం క్యాలిక్యులేటర్‌తో సమానమైనవని, వీటిని వై ఫై, బ్లూ టూత్ ద్వారా ఆపరేట్ చేయడానికి ఎలాంటి అవకాశం లేదన్నారు. ప్రజలకు కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ల గురించి తెలియజేయడానికి ప్రతి నియోజకవర్గానికి రెండు మొబైల్ వాహనాలతో పాటు నియోజకవర్గ కేంద్రంలో ఈవీఎం డిమాన్‌స్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు వీటిని సందర్శించి ఓటింగ్, ఓటింగ్ పరికరాల గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన

జమ్మికుంట(హుజూరాబాద్): దళితబంధు పథకం ద్వారా లబ్ధిదారుల వ్యాపార అభివృద్ధికి సహకారం అందిస్తామని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. పట్టణంలో శివసాయి ట్రేడర్స్, ఇండియా మ్యూజికల్ బ్యాండ్ తదితర దళితబంధు యూనిట్లను సోమవారం పరిశీలించారు. ఆర్డీవో హరిసింగ్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేశ్, ఈడీ నాగార్జున, తహసీల్దార్లు కోమల్‌రెడ్డి, రాజేశ్వరి, నెహ్రూ యువకేంద్రం యువజనాధికారి రాంబాబు, ఎంపీడీవో కల్పన పాల్గొన్నారు.

నా భర్త సంతకం ఫోర్జరీ చేశారు

- తండ్రి పేరిట భూమిని కూతుళ్లకు రిజిస్ట్రేషన్
- తహసీల్దార్‌ను నిలదీసిన బాధితులు



తహసీల్దార్‌ను నిలదీస్తున్న బాధితులు

కోనరావుపేట(వేములవాడ): ఒకరినుంచి మరొకరికి భూమిని రిజిస్ట్రేషన్ చేయాలంటే సవాలక్ష నిబంధనలతో కార్యాలయం చుట్టూ తిప్పుకునే అధికారులు.. వ్యక్తి లేకున్నా అతని పేరిట ఉన్న భూమిని వేరేవాళ్లకు పట్టా చేశారు. మండల రెవెన్యూ అధికారులు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన ఎండీ.ఖరీంకు వారసత్వంగా వచ్చిన మూడెకరాల భూమిని తన కుమారులు హుస్సేన్, రహీం, మజీద్‌కు చెరో ఎకరం భూమిని పట్టాచేశారు. వీరిలో హుస్సేన్‌కు కుమారుడు అహ్మద్‌పాషా, ఇద్దరు కూతుళ్లు ఆస్మా, రేష్మా ఉన్నారు. హుస్సేన్ మృతిచెందగా తన పేరిట భూమిని భార్య రహిమా పేరిట మార్చారు. రహిమా కుమారుడు అహ్మద్ పాషా గల్ఫ్‌కు వెళ్లడంతో అహ్మద్‌పాషాకు చెందాల్సిన వారసత్వ భూమిని అతని సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆస్మాకు 0.19 గుంటలు, రేష్మాకు 0.19 గుంటలు పట్టాచేశారు. విషయం తెలుసుకున్న అహ్మద్ పాషా భార్య యాస్మిన్ తన ఇద్దరు కుమారులు, కూతురితో తహసీల్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ రవికాంత్‌ను ప్రశ్నించింది. తన సంతకం లేకున్నా, తన భర్త సంతకాన్ని ఫోర్జరీ చేశారని, తమ భూమిని తమకే పట్టా చేయాలని కోరింది. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా రహిమా సేల్‌డీడ్ ద్వారా కూతుళ్లకు భూమి పట్టా చేసిందని, ఏమైనా అభ్యంతరం ఉంటే కోర్టుకు వెళ్లొచ్చని సూచించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కథలాపూర్(వేములవాడ): ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో చెట్టును ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చింతకుంట శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీమారం మండలం దేశాయిపేటకు చెందిన గండికోట రాజం(42) ఆదివారం మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. అదే రాత్రి తిరుగుప్రయాణంలో చింతకుంట శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొట్టగా రాజంకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం మెట్‌పల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.




విద్యార్థులకు కళ్ల కలక

కరీంనగర్‌లోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 300 మంది విద్యార్థులు ఉంటున్నారు. దాదాపు 40 మందికి ఒకేసారి కళ్ల కలక సోకింది. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు కళ్లు మండుతున్నాయని ఉపాధ్యాయుడికి చెప్పడంతో వసతి గృహానికి పంపించారు. హాస్టల్ వార్డెన్లు వైద్యాధికారులను పిలిపించి విద్యార్థులకు ఐ డ్రాప్స్‌తో పాటు తగిన జాగ్రత్తలు సూచించారు. తల్లిదండ్రులను పిలిపించి వారి నివాస గృహాలకు కొందరిని పంపించగా, మరికొంత మంది విద్యార్థులకు ప్రత్యేక గదిలో వసతి ఏర్పాటు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మంచినీటి పైప్‌లైన్ లీకేజీలు





సాక్షాత్తు మంత్రి మీ సేవ కార్యాలయం ఎదుటే నాలుగుచోట్ల మంచినీటి పైపులైన్ పగిలి రోడ్డుపై నీరు ప్రవహించడంతో నీరంతా కలుషితమవుతోంది. అలాగే వావిలాలపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి నీరు వస్తోంది. పైపులైన్లు పగలడంతో మంచినీరు కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

కోతిరాంపూర్‌లో డ్రైడే



డ్రైడే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు

కరీంనగర్: నగరంలోని కోతిరాంపూర్ క్లస్టర్ లెవల్‌లో ఏఎన్‌ఎం, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు సోమవారం డ్రై డే ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఇంటి ఆవరణలోని చెట్ల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పాత సామన్లు, కూలర్లు, నీళ్ల నింపుకునే తొట్టిల్లో వర్షం పడినప్పుడు నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే అందులో లార్వా ఉత్పత్తి అవుతోందని, దాని ద్వారా దోమలు తయారై డెంగీ జ్వరాలు వస్తాయని తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో కిరోసిన్, ఆయిల్ బాక్స్ వేయించి లార్వా ఉత్పత్తి కాకుండా చూడాలని కార్పొరేటర్ జంగిలి ఐలెందర్‌యాదవ్ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.స్వరూప, కె.శ్యామల, పి.సరిత, ఏఎన్‌ఎం స్రవంతి, ఆర్పీలు రమ, రాధ, లక్ష్మి, మంజుల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'మైనార్టీ బంధు ఇచ్చి ఆదుకోవాలి'

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేద మైనార్టీలు సరైన జీవనోపాధి లేకుండా ఉన్నారని, దళితబంధు పథకం మాదిరిగా రూ.10 లక్షలతో మైనార్టీ బంధు పథకం ప్రకటించి ఆదుకోవాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రుణం మంజూరు చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కేసీఆర్ సర్కార్ మైనార్టీలను ఓటుబ్యాంకుగానే భావిస్తోంది, వారి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అర్హులైన నిరుపేద మైనార్టీలందరికీ రూ.10 లక్షలు అందించి ఆదుకోవాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో గల డా.బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 8 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంట్ విభాగంలో 33 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 27,28 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని అర్హులైన విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చాలావరకు శిథిలావస్థలో ఉన్నా ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా ఇప్పటివరకు భర్తీ చేయడంలేదని తెలిపారు. పూర్తిస్థాయి ఎంఈవో, డీఈవోల నియామకంలో విఫలమైందన్నారు. ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నూనవత్ శ్రీనివాస్, నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, వినయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మార్కెట్ చైర్మన్ రెడ్డవేణి మధు



పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న మెండి శ్రీలతచంద్రశేఖర్



మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పండ్లు పంపిణీ

కరీంనగర్/కరీంనగర్‌అర్బన్/విద్యానగర్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: కరీంనగర్‌తో పాటు కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో సోమవారం ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు, విద్యార్థి సంఘం నాయకులు, అభిమానులు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పుట్టిన రోజు వేడుకల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, మాజీ ఎమ్మెల్యే కొడూరి సత్యనారాయణగౌడ్‌లు పాల్గొని కేక్ కట్ చేసి సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

- నగరంలోని జ్యోతిరావుపూలే పార్క్‌లో 60వ డివిజన్ కార్పొరేటర్ వాల రమణారావు ఆధ్వర్యంలో వాకర్స్‌తో కేక్ కట్ చేసి అల్పాహారం పంపిణీ చేసిన అనంతరం గిఫ్ట్ స్మైల్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులకు చీరెలు అందజేశారు.
- 33వ డివిజన్ భగత్‌నగర్ మేయర్ క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి మేయర్ సునీల్‌రావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.
- మార్కెట్‌రోడ్‌లోని వేంకటేశ్వర ఆలయంలో దూలం సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించి మొక్కలు పంపిణీ చేశారు.
- గ్రంథాలయంలో గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో 200 మంది పాఠకులకు ఉచిత ఎంట్రీ సభ్యత్వ నమోదు చేయించి కేటీఆర్ రాజకీయ ప్రస్థాన పుస్తకాన్ని ఆవిష్కరించారు.
- రాంనగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ యూత్ విభాగం నాయకుడు కులదీప్ వర్మ ఆధ్వర్యంలో టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేశారు.
- 11వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్య, డి.సంతోష్‌ల ఆధ్వర్యంలో రుద్రాక్షమాలలు పంపిణీ చేశారు.
- కరీముల్లాషా దర్గాలో బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం నాయకులు సయ్యద్ సయిం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో మేయర్ సునీల్‌రావు పేదలకు టార్పాలిన్లు, కవర్లు పంపిణీ చేశారు.
- మాతా శిశు సంరక్షణకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బీఆర్‌ఎస్ పార్టీ మహిళా నాయకురాలు గందె కల్పన ఆధ్వర్యంలో మేయర్ సునీల్‌రావు, నగర అధ్యక్షుడు హరిశంకర్‌లు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ తోట రాములు తదితరులు పాల్గొన్నారు.
- హౌసింగ్‌బోర్డుకాలనీలోని వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమంలో బీఆర్‌ఎస్ నగర మాజీ అధ్యక్షుడు ఆకుల ప్రకాశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.
- వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో చైర్మన్ రెడ్డవేని మధు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం, గ్రేడ్-2 కార్యదర్శి ఓదెలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- సీఎస్ఐ వెస్లీ కేథిడ్రల్ చర్చిలో మేయర్ సునీల్‌రావు కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చైర్మన్ ఆర్ పాల్ కొమ్మాలు, గురువులు మధుమోహన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- కార్ఖనగడ్డలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌కేసి నిరుపేద విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు.
- శర్మనగర్‌లోని జ్యోతిబాపూలే గురుకుల హాస్టల్‌లో ప్యాడ్స్, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.
- కరీంనగర్‌లోని వాల్మీకి విద్యాలయంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఏరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేంసారం తిరుపతి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రవి నాయక్‌తో పాటు సుమన్, భాస్కర్ పాల్గొన్నారు.
- ఇరుకుల్లలోని పద్మనాయక వృద్ధుల ఆశ్రమంలో దుర్శేడ్ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.తిరుపతి, ఎన్.శ్రీనివాస్, రాజ్‌కమల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.
- నగునూరులో మొక్కలు నాటగా ఎంపీటీసీ సభ్యుడు ఎ. శ్రీనివాస్, టి. లక్ష్మయ్య, నేక్‌పాషా, రవితేజ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపల్లి పట్టణంలోని సంఘం చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా పేల్చారు. మహిళా నాయకురాలు రుద్ర రాధా ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాగి జావ తాగే గ్లాసులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు వాసాల రమేష్, మానుపాటి వేణుగోపాల్, చింతల సత్యనారాయణ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్, ప్రభాకర్, నాయకులు జమీలొద్దీన్, గున్నాల రమేశ్, ఎస్కే బాబా, స్వర్గం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపల్లి మండలం చింతకుంటలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీపీ శ్రీలత మహేశ్ కట్ చేశారు. జెడ్పీ కోఆప్షన్ సాబీర్ పాషా, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చీరెలు పంపిణీ చేస్తున్న శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులు



ఇరుకుల్ల వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేస్తున్న చైర్మన్ రాజు



చింతకుంటలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ పిల్లి శ్రీలత

నగరంలో నేడు

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ ఉజ్వల పార్కు ఫీడర్ పరిధిలోని ఉజ్వల పార్కు, ఎన్టీఆర్ విగ్రహం, శ్రద్ధ ఇన్ లేన్, అల్కాపురి, పెద్దపల్లి బైపాస్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

అతిథి అధ్యాపక ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్‌లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు సమర్పించిన వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. తెలుగు-3, ఇంగ్లిష్-3, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్-3, బీబీఏ-2, బిజినెస్ ఎనలిటిక్స్-1, డాటా సైన్స్-1, బీసీఏ-2, ఫిషరీస్-1, స్టాటిస్టిక్స్-1 చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్లో 55 శాతం మార్కులుండి నెట్, సెట్, పీహెచ్‌డీ, టీచింగ్‌లో అనుభవం ఉన్నవారికి వెయిటేజీ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఎస్సారార్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జత జిరాక్స్ కాపీతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

ప్రణాళిక లేని పనులతో ప్రజాధనం వృథా



ఆటోనగర్‌లో పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యాంగా స్మార్ట్‌సిటీ పనులు చేస్తున్నారనడానికి నిదర్శనం ఎన్టీఆర్ ఆటోనగర్ రోడ్డు మురికి కాలువ పనులని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. వాడవాడకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆటోనగర్‌ను సందర్శించారు. ఆటోనగర్ వాసుల పరిస్థితి దుర్భరం అని వర్షం నీటికి మురికి కాలువ నీళ్లు తోడై వర్క్‌షాపులన్నీ జలమయం అయ్యాయని, పనులు బంద్ చేసుకొని ఇళ్లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. మురుగు కాలువను వదిలేసి దాని పక్కనే డంప్ యార్డు రోడ్డు అంతకంటే ఎత్తుగా వేయడంతో మురుగునీరు నిలిచిపోతున్నాయని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్ నీళ్లల్లో మునిగి ప్రమాదకరంగా ఉందన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం మొత్తం భ్రష్టు పట్టిపోయిందని కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దన్న సింగ్, గడ్డం విలాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్, చంద్రయ్య గౌడ్, ఊరడి లత, ముల్కల కవిత, శారద, ముక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూములు కాపాడండి



ఆర్డీవోకు విన్నవిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గల విలువైన ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకుల అండదండలతో అన్యాక్రాంతమవుతున్నాయని, వెంటనే ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కరీంనగర్ ఆర్డీఓ కె.మహేశ్వర్‌కు బీజేపీ మండల నాయకులు విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని చింతకుంట, శాంతినగర్, వేములవాడ ప్రధాన రహదారిని ఆనుకొని ప్రజల భవిష్యత్ అవసరాల కోసం కేటాయించిన విలువైన భూములను ఆక్రమించుకొని శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికార పార్టీ నాయకుల ప్రోత్సాహంతో ఓ ముఠాగా ఏర్పడి మంత్రి కమలాకర్‌తో సంబంధిత అధికారులకు ఫోన్లు చేయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. చింతకుంటలోని సర్వేనం.439, కమాన్‌పూర్‌లోని 116, 117లలో దొంగ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేస్తున్నారని వివరించారు. అదేవిధంగా కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్, నాగులమల్యాల, బావుపేట, బద్దిపల్లి, మల్కాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో సూచికల బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల భవిష్యత్తు అవసరాల కొరకు కాపాడాలని కోరారు. బీజేపీ నాయకులు జవ్వాజి రమేశ్, అంజన్ కుమార్, అనిల్ కుమార్, సదానందం, మల్లేశం, వంశీ, ప్రశాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట.. ప్రమాదానికి బాట




కొత్తపల్లిలోని చెరువు పరిసరాల్లో చేపల వేట జోరుగా కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో చెరువు మత్తడి దూకుతున్న దృశ్యాలను 'సాక్షి' సోమవారం బంధించేందుకు ప్రయత్నించగా.. చేపల వలలతో జాలర్లు కనిపించారు. మత్తడి పరిసరాల్లో ప్రమాదమని తెలిసి కూడా వలలు వేస్తూ చేపలు పడుతున్నారు. ఆ చేపలను కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి పక్కన పెట్టి విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. చెరువు సమీపంలో ఎలాంటి ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయకపోవడం.. చెరువులోకి వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా మత్తడి సమీపంలోకి వెళ్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున మరింత వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు చేపట్టి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రించాలని స్థానికులు పేర్కొంటున్నారు. -కొత్తపల్లి

'మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి'



కళ్లకు నల్లబ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

కరీంనగర్: మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ్‌రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో సీపీఐ, సీపీఐ(ఎం) విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మానవహారం, కళ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెగల, మతాల మధ్య చిచ్చు పెట్టి మారణహోమం సృష్టిస్తూ ప్రజలను, మహిళలను హింసిస్తున్నారని, ఏకంగా మహిళలను వివస్త్రలను చేసి నడిరోడ్డుపై ఊరేగిస్తూ అత్యాచారాలు, హత్యలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. ఇంత జరుగుతున్నా మణిపూర్‌కు ఇన్‌చార్జిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటని, ముఖ్యమంత్రిని తక్షణమే తొలగించి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మానవహారం అనంతరం తెలంగాణ చౌక్ నుంచి మల్టీప్లెక్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు గూడెం లక్ష్మి, సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం, సీపీఐ, సీపీఎం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, పైడిపల్లి రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. అప్రమత్తం

- వారంరోజుల పాటు ప్రత్యేక పారిశుధ్యం



నల్లగుంటపల్లిలో కలుషితనీటిని తొలగిస్తున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ సంతోష

కరీంనగర్‌రూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. మురుగునీరు, అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వృద్ధి చెంది ప్రమాదకర వ్యాధులు ప్రబలుతాయి. ఇప్పటివరకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నారు. అయితే ఐదారు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వ్యాధులు సోకే అవకాశముండటంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం సోమవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని నిర్ణయించింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచర్, ఐకేపీ మహిళలతో కలిసి పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వారంలో రెండురోజులు దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని, డెంగీ కేసులు నమోదైన గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి, వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. డీపీవో వీరబుచ్చయ్య ఆదేశాల మేరకు సోమవారం కరీంనగర్ మండలం నల్లగుంటపల్లి, దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్ గ్రామాల్లో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ, వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటా తిరిగారు. ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, బ్లీచింగ్ పౌడర్ మూడు నెలలకు సరిపడా నిల్వ ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ వద్లూరి సంతోష, పంచాయతీ కార్యదర్శి సుమన్, ఆశావర్కర్ కవిత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కిరణ్ తదితరులున్నారు.

చింతకుంట 'గురుకుల' సమస్యలు పరిష్కరించండి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల/జూ.కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్, తహసీల్దార్ ఆఫీస్‌లో ప్రొగ్రెసివ్ పేరెంట్స్ లీగ్ సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. పద్మనగర్-వేములవాడ రహదారి నిర్మాణంలో భాగంగా పాఠశాల ప్రహరీ రోడ్డుకు సమాంతరంగా ఉండటం వల్ల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రహరీకి మధ్యన కొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఆకతాయిలు అడ్డా వేయడంతో ఆడ పిల్లలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. గోడ చిన్నదిగా ఉండటం వల్ల బయట వ్యక్తులు సులభంగా లోపలికి వచ్చే అవకాశం ఉందని వివరించారు. జనరేటర్ చెడిపోవడం, సమయానికి భోజనం వండకపోవడం, నీరు లేక స్నానాలు, బట్టలు ఉతుక్కోలేక సీజనల్‌గా చర్మవ్యాధులు వస్తుండటం అమ్మాయిలకు ఇబ్బందిగా మారిందన్నారు. బాత్‌రూంలు సరిగా లేకపోవడం, నల్లాలు పనిచేయకపోవడం, మంచినీరు లేక, సీసీ కెమెరాలు లేకపోవడం భద్రత కరువైందని, అనేక సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఉన్నతాధికారులు పాఠశాల/కళాశాలను సందర్శించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీపీఎల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబటి మధులత, కందుకూరి బాబుదేవ్, పీపీఎల్ జిల్లా అధ్యక్షుడు గోష్కి కుమార్, శరత్‌బాబు, పల్నాటి కవిత, రాధిక, రామచంద్రం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల పాదపూజోత్సవం



విద్యానగర్(కరీంనగర్): నగరంలోని నందిని, వాల్మీకి విద్యాసంస్థల్లో సోమవారం తల్లిదండ్రుల పాదపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీస్సులందుకున్నారు. కార్యక్రమంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు నందిని, వాల్మీకి విద్యాసంస్థల చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి కోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ల ఏరియాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తాం

సాక్షి, న్యూఢిల్లీ: కంటోన్మెంట్ల సివిల్ ఏరియాలను సంబంధిత మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ తెలిపారు. కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలు, దానికి ఆనుకుని ఉన్న రాష్ట్ర మున్సిపల్ ప్రాంతాలను నియంత్రించే పురపాలక చట్టాలలో ఏకరూపకతను తీసుకురావడానికి కొన్ని కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలను తొలగించాలన్నారు. దీంతో వాటిని పొరుగు మున్సిపాలిటీలతో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. ఈ నిర్ణయం ప్రకారం విధివిధానాలపై అభిప్రాయాలను తెలిపేందుకు ప్రతిపాదనలను రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు.

'మార్గదర్శి' డిపాజిట్‌దారుల సొమ్ము ఏమైంది?

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ డిపాజిట్‌దారుల సొమ్ముకు సంబంధించి ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏం జరిగిందో చూడాల్సి ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు శాఖల నుంచి ప్రధాన కార్యాలయానికి సొమ్ము తరలించడం సాధారణమేనని, అదే విధంగా ఈ కేసులోనూ జరిగిందని చెబుతున్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయానికి వెళ్లిన సొమ్ము ఏమైందోనన్న అంశంపై ఆలోచిస్తున్నామని పేర్కొంది. మార్గదర్శి కేసుల న్యాయపరిధిపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

రాక్షసులపై విజయం

- పేదల కోసం మూడేళ్లుగా పెత్తందారులతో మీ బిడ్డ పోరాటం: ఏపీ సీఎం జగన్
- పేదలకు స్థలాలివ్వకుండా, ఇళ్లను కట్టనివ్వకుండా ఎన్నో ఆటంకాలు
- ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి ఇవాళ 50,793 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం
- ఇకపై అమరావతి మనందరిది.. 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా

> పేద వర్గాలపై పెత్తందారుల దోపిడీలను సహించి భరించే కాలం పోయింది. ఈ మార్పు ఇక మీదట రాజకీయాలను శాసిస్తుంది. అలాంటి మార్పులకు మనసా వాచా కర్మణా సహకరించే ప్రభుత్వంగా, మీ అన్నగా.. నిరుపేద అక్కచెల్లెమ్మల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనతో 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా. ఇక నుంచి అమరావతి మనందరిది.
> – సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదలకు మేలు జరిగే ప్రతి విషయంలో మనందరి ప్రభుత్వానికి, చంద్రబాబు పెత్తందారుల కూటమికి మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు మంచి


గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న సీఎం జగన్

జరగకూడదని రాక్షస బుద్ధితో అడ్డుకుంటున్న వారితో పెద్ద యుద్ధమే చేస్తున్నామన్నారు. సోమవారం సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు 50,793 ఇళ్ల నిర్మాణం, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం జగన్ మాట్లాడారు. తొలుత తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్దకు చేరుకున్న సీఎం జగన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటపాలెం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

ఆ తర్వాత కూడా బుద్ధి మారలేదు..

సీఆర్‌డీఏలో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబ సభ్యులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు కట్టించకుండా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు సృష్టించిన ఊరుపేరూ సంఘాలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ – 5 అడ్డు తగిలాయి. వీరంతా మొదట పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు వీల్లేదన్నారు. ఇందుకోసం ఏకంగా హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లిన దౌర్భాగ్యమైన పరిస్థితిని మన రాష్ట్రంలో మాత్రమే చూస్తున్నాం. ఈ పెద్దమనుషులు, పెత్తందార్లు, పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18 కేసులు, సుప్రీంకోర్టులో 5 కేసులు వేశారు. ఈ కేసులను పరిష్కరించేందుకు మీ తరఫున మీ బిడ్డ మూడేళ్ల పాటు పోరాటం చేస్తూ వచ్చాడు. దేవుడు, ప్రజల చల్లని ఆశీస్సులు ఎప్పుడూ మంచికే ఉంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వమే కేసులు గెలిచింది. అనుమతులు తెచ్చుకుని మీకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఆ తర్వాత కూడా వారి బుద్ధి మారలేదు. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ఆపలేకపోయారు కాబట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి అడ్డు తగిలేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వారు ఎక్కని గడప దిగని గడప లేదు. కలవని కేంద్ర మంత్రీ, కేంద్ర సెక్రటరీలు కూడా లేరు. ఇంతమందిని కలిశాక చివరి ప్రయత్నంగా మళ్లీ హైకోర్టులో కేసు వేశారు. ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ ఎక్కడా ఉండదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి బీజేపీ మహాధర్నా వాయిదా

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని బీజేపీ వాయిదా వేసింది. రాబోయే మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలిగించకూడదన్న ఉద్దేశంతో మహాధర్నాను వాయిదా వేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాధర్నాను నిర్వహించబోయే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

శాంతిభద్రతలను కాపాడలేకపోతే ఎలా?

- మాట్లాడే హక్కును ఎవరూ అడ్డుకోలేరు
- పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం
- బీజేపీ ధర్నాకు గ్రీన్‌సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేయాలన్న డిమాండ్‌తో మంగళవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిర్వహించనున్న ధర్నాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీలకు ఆదేశాలు జారీ చేసింది. ధర్నాలో 500 మంది మాత్రమే పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఆ వివరాలను సోమవారం సాయంత్రం 6 గంటల కల్లా అధికారులకు సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతించకుంటే మరి ఎక్కడ చేయాలి?.. మాట్లాడటం అనేది ప్రజల ప్రాథమిక హక్కు, దానిని ప్రభుత్వం అడ్డుకోలేదని తేల్చిచెప్పింది. పోలీసులు శాంతిభద్రతలను కాపాడలేకపోతే ధర్నాకు హాజరయ్యే ప్రజలకు పాస్‌లు జారీ చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆదేశించింది. 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ధర్నాకు శాంతిభద్రతల పేరుతో పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ప్రధాన కార్యదర్శి



డి.ప్రదీప్‌కుమార్ సోమవారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ధర్నాలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు. దాదాపు 1000 మంది హాజరయ్యే ఈ ధర్నాకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇళ్లు ఇవ్వడం లేదని, నిర్మాణంలోనూ అవకతవకలు జరుగుతున్నాయని.. అందుకే బాటసింగారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్లిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాగా, వెయ్యి మందితో ధర్నా నిర్వహిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని హోం శాఖ జీపీ రూపేందర్ చెప్పారు. ఇందిరాపార్కు వద్ద కొద్ది రోజుల క్రితం స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని.. అది ఇంకా ప్రారంభం కూడా కాలేదని, ధర్నాకు అనుమతి ఇస్తే బ్రిడ్జి దెబ్బతినే అవకాశం ఉందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ధర్నాకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'సోమేశ్ తీర్పు'నే వర్తింపజేయాలి

కేడర్ వివాదంపై హైకోర్టులో కేంద్రం వాదనలు • మా వాదనలు కూడా వినాలన్న పిటిషనర్లు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది జనవరి 10న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలనే డీజీపీ అంజనీకుమార్ సహా 12 మంది ఆలిండియా సర్వీస్ అధికారులకు వర్తింపజేయాలని కేంద్రం వాదనలు వినిపించింది. 13 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. అయితే సోమేశ్ కుమార్‌తో కేడర్‌కు సంబంధించిన అంశాల్లో పలు వ్యత్యాసాలు ఉన్నాయని, తమ వాదనలు కూడా వినాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా విడివిడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. సోమేశ్‌కుమార్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. రివ్యూ పిటిషన్‌లో తుది ఉత్తర్వులు వచ్చే వరకు 13 మంది పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ ఓ పరిశీలన నివేదికను కోర్టుకు అందజేశారు. దీని ప్రకారం అంజనీకుమార్, రొనాల్డ్ రాస్, జె.అనంత రాము, ఎస్ఎస్ రావత్, ఆమ్రపాలి కాటా, అభిలాషా బిస్త్ కేసులు సోమేశ్‌కుమార్ కేసు విశ్లేషణతో సరిపోతాయని, వారికి జనవరి తీర్పును వర్తింపజేయాలని డీఎస్‌జీ కోరారు. మిగతా వాటిపై విడిగా విచారణ చేపట్టవచ్చని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసుల పరిశీలనకు సమయం పడుతుందంటూ, విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది.

హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక విద్యార్థి ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా బొర్రహేమ్యా తండాలో ఘటన

కుల్కచర్ల: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక ఓ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. కుల్కచర్ల మండలం బొర్ర హేమ్యాతండాకు చెందిన హీరమన్, శాంతిబాయి దంపతుల కుమారుడు వినోద్(15) స్థానిక పాఠశాలలో ఇటీవల ఏడో తరగతి పూర్తిచేశాడు. కొద్దిరోజుల క్రితం తల్లిదండ్రులు అతన్ని పటాన్‌చెరులోని గిరిజన ఆశ్రమపాఠశాలలో చేర్పించారు. అక్కడ ఉండటం ఇష్టంలేని బాలుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. సెలవులున్నాయని ఇటీవల ఇంటికి వచ్చిన అతన్ని తిరిగి హాస్టల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వినోద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గోదారికి పోలవరం అడ్డంకి

- పోలవరం అథారిటీకి స్పష్టం చేసిన తెలంగాణ
- ఆ ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తోంది
- అందుకే గతేడాది రాష్ట్రంలో ముంపు ప్రభావం
- ప్రాజెక్టు గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచాలని లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నాటి పరిస్థితులతో పోల్చితే ప్రాజెక్టు నిర్మించిన తర్వాత తెలంగాణ భూభాగం పరిధిలో గోదావరి నది స్వేచ్ఛా ప్రవాహాన్ని కోల్పోయిందని, పోలవరం అడ్డంకిగా మారిందని తెలంగాణ రాష్ట్రం మళ్లీ ఆందోళన వ్యక్తం చేసింది. దీని ప్రభావం భద్రాచలం వద్ద గోదావరిలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణ భూభాగంలో ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జల సంఘానికి మరో సారి తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఈ నెల 21న లేఖ రాశారు. పోలవరం 48 గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాది గోదావరికి వచ్చిన వరదలతో తెలంగాణలోని భద్రాచలం, పరిసర గ్రామాల పరిధిలోని 28వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తికావడమే దీనికి కారణమన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను నిర్ధారించేందుకు జాయింట్ సర్వేను నిర్వహించాలని మరోసారి పీపీఏను కోరారు.

సిగ్నల్ లేక.. అంబులెన్స్ రాక

- రెండు గంటలపాటు గర్భిణికి నరకయాతన
- జీపులో ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- పీహెచ్‌సీలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

దహెగాం(సిర్పూర్): ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ లేక ఓ గర్భిణి రెండు గంటలపాటు పురిటి నొప్పులతో నరకయాతన అనుభవించింది. దిక్కుతోచని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా దహెగాం మండలం రావులపల్లి గ్రామానికి చెందిన ఆలం భాగ్యలక్ష్మి నిండు గర్భిణి. సోమవారం ఉదయం ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే గ్రామంలో సిగ్నల్ సమస్య ఉంటడంతో ఫోన్ చేయడం సాధ్యం కాలేదు. దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాలంటే 30 కిలోమీటర్ల దూరం దట్టమైన అటవీప్రాంతం గుండా ప్రయాణించాలి. వర్షాలకు రోడ్డు బురదగా మారడంతో వాహనాల రాకపోకలు సైతం కష్టంగా మారాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆశ వర్కర్ ప్రమీల సాయంతో గ్రామంలోని ప్రైవేట్ జీపులో గర్భిణిని దహెగాం పీహెచ్‌సీకి తరలించారు. రెండు గంటలపాటు నరకయాతన పడిన భాగ్యలక్ష్మి ఆస్పత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యసిబ్బంది తెలిపారు. ప్రసవం తర్వాత మళ్లీ అదే వాహనంలో రావులపల్లికి తరలించారు.


అటవీప్రాంతం గుండా గర్భిణిని తరలిస్తున్న ప్రైవేట్ జీపు


పీహెచ్‌సీలో బిడ్డతో భాగ్యలక్ష్మి


'కుంటాల'కు పోటెత్తిన వరద

నేరడిగొండ: కుంటాల జలపాతానికి మళ్లీ వరద పోటెత్తింది. భారీ వర్షాల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు మూడు రోజుల పాటు పర్యాటకుల సందర్శనను నిలిపివేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి తిరిగి అనుమతించారు. అయితే జలధార వరకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. అడవి తల్లి ఒడిలో సెలయేళ్ల పరవళ్లు ప్రకృతి ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

'మత్తడివాగు' గేట్లు ఓపెన్


తాంసి: వరద పోటెత్తడంతో మత్తడివాగు ప్రాజెక్టు మూడు గేట్లను అధికారులు సోమవారం ఓపెన్ చేసి నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో 9300 క్యూసెక్కులు ఉండగా అంతేమొత్తం ఔట్‌ఫ్లోగా కొనసాగించారు. పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు. ప్రస్తుతం 276.7 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వసామర్థ్యం 0.571 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.469 టీఎంసీ ఉన్నట్లు ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు.

కిలో టమాటా రూ.200

కౌటాల: కుమురంభీం జిల్లా కౌటాల వారసంతలో సోమవారం టమాటా కిలో ధర రూ.200 పలికింది. గత కొద్ది రోజుల నుంచి టమాటా ధర విపరీతంగా పెరుగుతోంది. సోమవారం ఏకంగా రూ.200 చేరడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. రూ.200కు చేరడం జిల్లాలో ఇదే మొదటిసారని చిరువ్యాపారులు తెలిపారు. పెన్‌గంగ నదికి వరద పెరగడంతో సిర్పూర్(టి) మండలంలోని పారిగాం వద్ద వంతెన పై నుంచి వరదనీరు వెళ్తుండడంతో కౌటాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సోమవారం వారసంతకు వ్యాపారులు కాగజ్‌నగర్ నుంచి చింతలమానెపల్లి మండలం మీదుగా కౌటాలకు వచ్చారు. దూరభారం పెరగడంతోపాటు వారసంతకు వ్యాపారులు అధికంగా రాలేదు. దీంతో టమాటా ధరతోపాటు అన్ని కూరగాయల ధరలు మండిపోయాయి.


టమాటాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

న్యాయం చేయాలని పురుగుల మందు డబ్బాతో నిరసన


పద్మ

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం రహపల్లిలో వట్టివాగు ప్రాజెక్టు కాలువ పూడికతీతతో పంట నష్టపోతున్నానని, న్యాయం చేయాలని పద్మ అనే మహిళా రైతు సోమవారం పురుగుల మందుతో నిరసన తెలిపింది. కొంత మంది కక్ష కట్టి కావాలనే పంట వేసిన సమయంలో కాలువ తీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఐదేళ్లుగా కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో కొంతమంది రైతులు కాలువను పూడ్చి పంటలు వేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కాలువ సమీపంలోని పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ఇటీవల నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. ప్రస్తుతం పద్మ చేనులో 150 మీటర్ల మేర కాలువ తీయాల్సి ఉంది. సోమవారం పద్మ జేసీబీని అడ్డుకుని పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపింది. తనకు న్యాయం చేసిన తర్వాతే పూడిక తీయాలని డిమాండ్ చేసింది. జేఈ జానీని సంప్రదించగా.. వట్టివాగు ప్రాజెక్టు పాత కాలువలోనే పూడిక తీయిస్తున్నట్లు వెల్లడించారు.

నేటి తరానికి స్ఫూర్తి రాజేశ్వర్‌రావు

- మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్


రాజేశ్వర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, కమలాకర్ తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

హుజూరాబాద్: రాజ్యసభ మాజీ సభ్యుడు స్వర్గీయ వొడితెల (సింగాపురం) రాజేశ్వర్‌రావు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణం సైదాపూర్ క్రాస్‌రోడ్డులో రాజేశ్వర్‌రావు విగ్రహాన్ని మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సతీశ్ కుమార్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ వాణీదేవి ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో యువ నాయకుడు ప్రణవ్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. రాజేశ్వర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమానికి రూపకల్పన చేయడంలో ముఖ్య పాత్ర పోషించారని, నేడు ఆయన జీవించి ఉంటే రాష్ట్ర అభివృద్ధిని చూసి ఎంతో సంతోషపడే వారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఎందుకు కావాలో తెలియజేస్తూ అప్పట్లోనే పత్రికల్లో వ్యాసాలు రాశారని, ఆ వ్యాసాలు ఉద్యమానికి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. రాజేశ్వర్‌రావు స్వయం కృషితో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎదిగినా స్వగ్రామం సింగపూర్‌ను ఎన్నడు మర్చిపోలేదని పేర్కొన్నారు. గతంలో నక్సలైట్లు అంటే నాయకులకు భయం ఉండేదని, కానీ నక్సలైట్లకు రాజేశ్వర్‌రావు అంటే ఎంతో అభిమానం ఉండేదన్నారు. ఆయన చివరి ఊపిరి వరకు ప్రజల కోసం ఆలోచించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న రాజేశ్వర్‌రావు తెలంగాణ సాధనకు పరితపించి కేసీఆర్ వెన్నంటి ఉన్న మహానుభావుడని అన్నారు.

విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టం

మంత్రిగా గురువు గారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి కమలాకర్ అన్నారు. రాజేశ్వర్‌రావు మానవతావాది, విద్యా ప్రదాత అంటూ ఆయన సేవలను కొనియాడారు. ఆయనతో తనకున్న సంబంధాలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సుడా చైర్మన్ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, రాజేశ్వర్‌రావు తనయులు శ్రీనివాస్‌రావు, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో సర్కార్ బడి బాగుంది


రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న సోమేశ్‌కుమార్ దంపతులు


సిరిసిల్లలోని బాలికల హైస్కూల్‌లో సోమేశ్‌కుమార్, కలెక్టర్ అనురాగ్ జయంతి

- సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్
- అపెరల్‌పార్క్‌లో మహిళల ఉపాధిపై ఆరా

సిరిసిల్ల: సిరిసిల్లలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాల బాగుందని ప్రభుత్వ ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్ కితాబునిచ్చారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన సోమేశ్‌కుమార్ దంపతులు స్కూల్‌ను సందర్శించారు. స్కూల్‌లో మౌలిక వసతులు బాగున్నాయన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఇంకా సదుపాయాలు ఏమైనా కావాలా.. అని అడగ్గా.. అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. గతంలో 570 మంది ఉన్న విద్యార్థులు ఉండేవారని.. ఇప్పుడు సంఖ్య 980కి చేరిందని హెచ్‌ఎం భాగ్యరేఖ తెలిపారు.

అపెరల్ పార్క్ సందర్శన

పెద్దూరు వద్ద నిర్మించిన అపెరల్ పార్క్‌లోని గోకుల్‌దాస్ గార్మెంట్ యూనిట్‌ను సోమేశ్‌కుమార్ దంపతులు పరిశీలించారు. రెడీమేడ్ వస్త్రాల తయారీ ద్వారా మహిళలు పొందుతున్న ఉపాధిపై ఆరా తీశారు. గతంలో బీడీలు చేస్తే నెలకు రూ.3వేలకు మించి రాలేదని.. ఇప్పుడు రూ.7వేల వరకు సంపాదిస్తున్నట్లు వివరించారు. సిరిసిల్లలో తయారైన వస్త్రాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నట్లుగా గ్రీన్ నీడిల్ సంస్థ ప్రతినిధులు వివరించారు. సిరిసిల్ల అపెరల్‌పార్క్‌లో ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభించడం బాగుందని సోమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. రెడీమేడ్ వస్త్రాల తయారీని అన్ని విభాగాల్లోకి వెళ్లి పరిశీలించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, డీఈవో రమేశ్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంఈవో దూస రఘుపతి ఉన్నారు.

రాజన్నసేవలో సోమేశ్‌కుమార్

వేములవాడ: రాజన్నను సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో పండితులు ఆశీర్వాదం ఇవ్వగా, ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.

రికార్డు సృష్టించింది!

సాధించాలంటే కఠోర సాధన ఉండాలి. అంతకు మించిన అంకితభావం ఉండాలి. ఈ రెండూ ఉంటే రికార్డు సాధనకు వయసు అనేది ప్రధానం కాదని నిరూపించింది సృష్టి సుధీర్ జగ్‌తాప్. పదహారేళ్ల సృష్టి విరామం లేకుండా 127 గంటల సేపు నాట్యం చేసి లాంగెస్ట్ డాన్స్ మారథాన్ (ఇండివిడ్యుయల్ కేటగిరీ)లో గిన్నిస్ రికార్డు సాధించింది.



● నాట్యం చేస్తూ...



● రికార్డు అందుకుంటూ...

మహారాష్ట్రలోని లాతూర్‌కి చెందిన సృష్టి... లాతూర్‌లోని పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతోంది. ఆమె అమ్మానాన్న సుధీర్, సంజీవని ఇద్దరూ టీచర్లు. వాళ్ల తాతగారు 'బాబన్ మనే' స్వయానా నాట్యగురువు. సృష్టికి చిన్నప్పటి నుంచి నాట్య సాధన అలవాటయింది. కానీ ఆమెకు రికార్డు కోసం నాట్యం చేయాలనే ఆకాంక్షకు కారణం బందనా నేపాల్. ఆమె 2018లో 126 గంటల సేపు నాట్యం చేసి లాంగెస్ట్ డాన్స్ మారథాన్‌లో గిన్నిస్ రికార్డు సాధించింది. అప్పుడు 'భారతీయ నాట్యరీతులు లెక్కలేనన్ని ఉన్నాయి. మన నాట్యరీతికి ఓ రికార్డు ఉంటే బావుణ్ను. ఆ రికార్డు ద్వారా ప్రపంచదేశాలకు మన శాస్త్రీయ నాట్యం గురించి తెలుస్తుంది'... అనే ఆలోచన సృష్టిలో రేకెత్తింది. ఆమె ఆలోచనకు తల్లిదండ్రులు, తాత అండగా నిలిచారు. గిన్నిస్ రికార్డు కోసం కథక్ నాట్య సాధన చేయాలనుకుంది. తాత పర్యవేక్షణలో 15 నెలల పాటు కఠోరసాధన చేసింది. ధ్యానంలో యోగనిద్ర కూడా సాధన చేయించారు బాబన్ మనే. రోజుకు నాలుగు గంటల సేపు ధ్యానం, మూడు గంటల సేపు వ్యాయామం, ఆరు గంటల సేపు నాట్యసాధన... ఇదీ రికార్డు కోసం ఆమె చేసిన దీక్ష.



● జాతీయ పతాకంతో సృష్టి

గంటకు ఐదు నిమిషాల విరామం

సృష్టి 127 గంటల నాట్య ప్రదర్శన మే నెల 29వ తేదీన పోదార్ స్కూల్ వేదిక మీద మొదలైంది. నాట్యప్రదర్శన ఐదు రోజుల పాటు నిర్విరామంగా సాగింది. ఆహారం అందక దేహం నీరసించి, డీహైడ్రేషన్‌కు లోను కాకుండా ఉండడానికి గంటకోసారి ఐదు నిమిషాల సేపు విరామం తీసుకునేది. ఆ విరామంలో ఎనర్జీ డ్రింక్ తీసుకుంటూ తన నాట్యదీక్షను కొనసాగించింది. సృష్టి నాట్యం చేసినంత సేపూ ఆమె తల్లిదండ్రులు వేదిక పక్కనే ఉండి ఆమెకు కావలసినవి అందిస్తూ వచ్చారు. నాట్య ప్రదర్శనను వీక్షించిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి స్వప్నిల్ దంగారికర్ సర్టిఫికేట్ ప్రదానం చేస్తూ సృష్టిని ప్రశంసల్లో ముంచెత్తారు.

''రికార్డు సాధనలో నా లక్ష్యం నెరవేరింది. ఐదు రోజుల ఐదు గంటల పాటు (విరామంతో కలిపి దాదాపు ఆరు రోజులు) సాగిన నాట్య ప్రదర్శన మధ్యలో అప్పుడప్పుడూ తల, శరీరం తూలిపోతున్న భావన కలిగాయి. నా లక్ష్యం 127 గంటలను పూర్తి చేయడం. లాంగెస్ట్ డాన్స్ మారథాన్‌లో ఇండియాకు రికార్డు సాధించడం. దేహం నిస్సత్తువతో ఇక చాలనే సంకేతాలు జారీ చేసినప్పుడు నా లక్ష్యాన్ని గుర్తు చేసుకుని క్షణాల్లో నన్ను నేను సంబాళించుకున్నాను. మానసికంగా స్థిరంగా ఉంటే దేహం కూడా సహకరిస్తుంది' అన్నది పదహారేళ్ల సృష్టి.

ప్రకృతి మెచ్చిన పెళ్లి!



● అనుపమ, చారులత

'ఆకాశం దిగివచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి... ఊరంతా చెప్పుకునేలా జరగాలి పెళ్లంటే మరి!' అంటూ అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి నేటితరం పెళ్లిళ్లు. ఏమాత్రం పర్యావరణ స్పృహలేకుండా హంగు, ఆర్భాటాలు చేస్తూ తెగ గొప్పలు చెప్పేసుకుంటున్నారు. దీని వల్ల ప్రకృతమ్మ ఎంత తల్లడిల్లిపోతుందో కూడా పట్టడం లేదు. ఒకతల్లి మనసు మరో తల్లికే తెలుస్తుందేమో! అందుకే బెంగళూరుకు చెందిన ఇద్దరమ్మలు కలిసి తమ పిల్లల పెళ్లిని ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ఎంతో ఘనంగా, ప్రకృతి మురిసేలా జరిపించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బెంగళూరుకు చెందిన అనుపమ కుమారుడికి, చారులత కూతురుతో వివాహం నిశ్చయమైంది. రెండు కుటుంబాలకు అన్ని విషయాల్లో సఖ్యత కుదిరింది. కానీ 'పెళ్లిలో ప్లాస్టిక్‌ను అస్సలు వాడకూడదు' అని అనుపమ కండిషన్ పెట్టింది. ఇది చారులతకు నచ్చడంతో మరింత సంతోషంతో ఒప్పుకుని ''ఇద్దరం కలిసి ప్లాస్టిక్ రహిత పెళ్లి చేద్దాం వదినా!'' అని ఒక నిర్ణయానికి వచ్చారు.

తమ పిల్లల పెళ్లిని మూడురోజులపాటు అంగరంగా వైభవంగా ప్లాస్టిక్ లేకుండా జరిపేందుకు నామమాత్రపు పెళ్లిపత్రికలను కొట్టించారు. కొంత మందికి మాత్రమే ఆహ్వాన పత్రికలు ఇచ్చి, మిగతా వారిని నేరుగా పెళ్లికి పిలిచారు. పెళ్లికి పిలిచేటప్పుడే.. ''ఎవరూ బొకేలు, బహుమతులు వంటివి తీసుకు రావద్దు'' అని మనవి చేశారు.

అరిటాకులు.. స్టీల్ ప్లేట్లు... వచ్చిన వెయ్యిమంది అతిథులకు వడ్డించేందుకు అరటి ఆకులు, స్టీల్ ప్లేట్స్‌ను ఎంచుకున్నారు. ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు, వాటర్ బాటిల్స్ స్థానంలో స్టీల్ సామాన్లు వాడారు. తాజా పువ్వులు, లైట్లతో పెళ్లిమండపాన్ని అలంకరించారు.



● కొత్త జంటతో అనుపమ, చారులత దంపతులు

పంతొమ్మిదేళ్లనాటి పేపర్‌తో... అనుపమ కొడుకుకు 2004లో ఉపనయనం జరిగిన సందర్భంగా జరిపిన వేడుకలో బటర్‌పేపర్‌ను వాడారు. అప్పుడు మిగిలిన పేపర్ తో పెళ్లికి వచ్చిన అతిథులకు రిటన్ గిఫ్ట్స్ ఇచ్చారు. సహజసిద్ధ పద్ధతుల్లో రంగులద్దిన జాకెట్ ముక్కలు, కాగితం పొట్లాల్లో పసుపు, కుంకుమను పేరంటాళ్లకు పంచారు. పెళ్లిలో డెకరేషన్‌ల కోసం వాడిన తాజా పువ్వులను వేడుక ముగిసిన తరువాత ముంబైలోని సహజ రంగుల తయారీ స్టూడియోకి పంపించారు.



● స్టీలు ప్లేట్లు, గ్లాసులతో...

వెయ్యికేజీల వేస్ట్ నుంచి ... ప్లాస్టిక్ వాడకపోయినప్పటికీ, కొన్ని సహజసిద్ధ వ్యర్థాలు ఉత్పన్నమవుతాయి కాబట్టి వాటికోసం క్యాటరింగ్ సిబ్బంది తడి, పొడి చెత్తను విడివిడిగా డ్రమ్స్‌లో వేసేవాళ్లు. ఈ వ్యర్థాలను కోకోపీట్ నింపిన డ్రమ్స్‌లో వేసేది. కాగితాలను, పువ్వులను కలెక్షన్ సెంటర్‌కు పంపించారు. డ్రమ్‌లలో వేసిన వెయ్యి కేజీల వ్యర్థాల నుంచి మూడు వందల కేజీల సేంద్రియ ఎరువును తయారు చేశారు.

''పెళ్లిలో ప్లాస్టిక్ వాడకుండా చేయడం మాకు చాలెంజింగ్‌గా అనిపించినప్పటికీ ఇద్దరం కలిసి విజయవంతం చేశాం. మా అమ్మ, అమ్మమ్మల కాలంలో పెళ్లిళ్లకు ఇలానే స్టీల్ సామాన్లు వాడేవారు. మేము అలాగే మా పిల్లల పెళ్లి చేయాలనుకున్నాం. అందుకు అందరూ సహకరించడం సంతోషం'' అని అనుపమ, చారులతలు చెప్పకొచ్చారు.

స్ఫూర్తి

రెయిన్‌బో

తల్లిదండ్రులు చనిపోయారు.
బంధువులు దూరం జరిగారు.
తనకు తోడుగా ఎవరు ఉన్నా లేకపోయినా కన్నీళ్లు, కష్టాలు మాత్రం కచ్చితంగా ఉండేవి.
అయినా సరే ఆ చిన్నారి ఎప్పుడూ నిరాశపడలేదు.
చెత్త ఏరుకునే స్థాయి నుంచి ఢిల్లీలోని ప్రముఖ హోటల్‌లో చెఫ్ వరకు ఎదిగి, కష్టాల చీకటిని ఛేదిస్తూ రెయిన్‌బోగా వెలిగి ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది లిలిమా ఖాన్...



● లిలిమా ఖాన్

ఢిల్లీ వసంత్‌కుంజ్‌లోని లె క్యాంటిన్ రెస్టారెంట్‌లో లిలిమాఖాన్ చెఫ్‌గా పనిచేస్తోంది. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారింది. కడుపు నింపుకోవడం కోసం చెత్త ఏరింది. ఇటుకలు మోసింది. ఇండ్లల్లో పనిచేసింది... ఒకటా రెండా... పొట్టపోసుకోవడానికి ఎన్నెన్నో పనులు చేసింది.

డబ్బులు లేని సమయంలో ఆకలి తట్టుకోలేక చెత్తబుట్టల్లో నుంచి మెతుకులు ఏరుకుని తిన్న సందర్భాలూ ఉన్నాయి. ఆకలి తీర్చుకోవడం ఒక ఒక పనైతే పోకిరీలు, రౌడీల నుంచి తనను తాను రక్షించుకోవడం మరో పెద్ద పనిగా మారింది.

కష్టాల కత్తుల వంతెనపై నడుస్తున్న ఖాన్‌కు 'కిల్కరి రెయిన్‌బో హోమ్' రూపంలో దివ్యమైన దారి దొరికింది.

'ఇక్కడ నాకు ఆహారం, ప్రేమతో పాటు ఎన్నో దొరికాయి. అందులో చదువు ఒకటి' అంటుంది ఖాన్. కుటుంబంలేని తనకు 'రెయిన్‌బో' అనే స్వచ్ఛందసంస్థ పెద్ద కుటుంబమై ప్రేమను పంచింది. 'రెయిన్‌బో'లో ఖాన్‌కు ఇష్టమైన ప్రదేశం... వంటగది. వంటచేస్తున్న వాళ్లకు చిన్న చిన్న పనులలో సహాయపడేది. చదువు పూర్తయిన తరువాత 'రెయిన్‌బో' సహాయంతో ఖాన్ కుకింగ్‌లో అప్రెంటిస్‌షిప్ చేసింది.

శిక్షణ పూర్తయిన తరువాత ఢిల్లీలోని ఇటాలియన్ రెస్టారెంట్‌లో స్టాఫ్ కుక్‌గా ఖాన్‌కు అవకాశం వచ్చింది. ఆ తరువాత లె క్యాంటీన్‌లో చేరింది.

'ఇంత పెద్ద హోటల్‌లో నేను పనిచేయగలనా అని మొదట్లో భయపడ్డాను. కొన్ని రోజులకు ఆ భయం దూరమైంది' గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ అంటుంది ఖాన్. 'స్త్రీలకు ప్రోత్సాహకరంగా ఉండని ఇండస్ట్రీని ఎందుకు ఎంచుకున్నారు' అనేది ఖాన్‌కు తరచుగా ఎదురయ్యే ప్రశ్న. 'చెఫ్ జూలియాకు ఇండస్ట్రీలో పెద్ద పేరు ఉంది. ఆమె నాకు ఆదర్శం. ప్రతిభ ఉంటే జెండర్ అనేది అడ్డంకి కాదు' అంటుంది ఖాన్.

ఖాన్ స్టోరీ ఎంతోమందిలో స్ఫూర్తి నింపింది.

ఒకరోజు హోటల్‌కు తనను కలవడానికి ఒక అమ్మాయి వచ్చింది. 'ఈ అమ్మాయికి నాతో పనేమిటి' అనుకుంది మనసులో. ఆ అమ్మాయి మాత్రం మనసు విప్పి మాట్లాడింది. 'పరీక్షలో ఫెయిల్ అయిన నాకు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చేవి. ఆ సమయంలో మీ గురించి చదివాను. నా సమస్య చాలా చిన్నదిగా అనిపించింది. ఎన్నో కష్టాలను తట్టుకొని మీరు సక్సెస్ అయ్యారు. మీ స్ఫూర్తితో నేను కూడా విజయం సాధించాలకుంటున్నాను' అని చెప్పింది. 'కష్టాలలో నలిగినా వెనకడుగు వేయకుండా సాధించిన విజయాలు మనకు మాత్రమే పరిమితం కావు. అవి పదిమందికీ స్ఫూర్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తాయి అని నేను విన్న మాట ఆ సమయంలో గుర్తుకు వచ్చింది' అంటుంది లిలిమాఖాన్.



● ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి గ్రామాన్నీ ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చుతామని ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి కాకాణి, అధికారులు, రైతు శాస్త్రవేత్తలు

రైతు శాస్త్రవేత్తలకు పట్టం

- ఏపీలో రైతుసాధికార సంస్థ, ఇండో-జర్మన్ ప్రకృతి సేద్య పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో రైతు శాస్త్రవేత్త కోర్సు ప్రారంభం
- తొలి ఏడాది వెయ్యి మంది ప్రకృతి వ్యవసాయదారులకు ప్రవేశం
- ప్రతి 5గురికి ఒక మెంటర్ పర్యవేక్షణలో పరిపూర్ణ శిక్షణ
- మూడో ఏడాది నుంచి ఏపీయేతర రాష్ట్రాలు, ఇతర దేశాల వారికీ అవకాశం

8 లక్షల మంది రైతులతో విస్తృత స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. రాష్ట్రాన్ని ప్రకృతి వ్యవసాయంపై శాస్త్రీయ పరిశోధనలకు, విజ్ఞానానికి ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ప్రకృతి వ్యవసాయాన్ని రైతు సాధికార సంస్థ ద్వారా రాష్ట్రంలోని ప్రతి రైతు ముంగిటకు తీసుకెళ్ళేలా ప్రపంచంలోనే మొట్టమొదటిగా ప్రత్యేక 'రైతు శాస్త్రవేత్త కోర్సు'కు శ్రీకారం చుట్టింది. రైతులందరూ శాస్త్రవేత్తలే అయినప్పటికీ ప్రకృతి సేద్యంలో మరింత లోతైన పరిశోధన, శాస్త్రీయ అవగాహనతో పాటు ప్రకృతి సేద్య విస్తరణ వేగవంతానికి ఈ కోర్సు దోహదం చేస్తుందనటంలో సందేహం లేదు.

ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతు శాస్త్రవేత్తను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యసాధన కృషిలో భాగంగా ఈ కోర్సు ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ప్రారంభమైంది. తొలి బ్యాచ్ ప్రారంభ సూచకంగా పి. రామ్మోహన్, పి.రజనిలకు రైతు శాస్త్రవేత్త కోర్సు గుర్తింపు కార్డులను మంత్రి అందించారు.

జర్మనీ ప్రభుత్వ సహాయంతో భారత ప్రభుత్వంతో కలిసి ఏపీ ప్రభుత్వం గత ఏడాది పులివెందులలో గత ఏడాది 'ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (ఐజీజీఏఏఆర్ఎల్)ని నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ అకాడమీ, రైతు సాధికార సంస్థ (ఆర్వైఎస్ఎస్)తో కలసి రైతు శాస్త్రవేత్త కోర్సును నిర్వహించనున్నాయి.

ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ఈ కోర్సుకు ఎంపిక చేస్తారు. వారిని ఆచరణాత్మక పరిశోధనలో భాగస్వాముల్ని చేసి, లోతైన శాస్త్రీయ అవగాహన పెంచేందుకు, తద్వారా వేగవంతంగా ప్రకృతి సేద్యాన్ని విస్తరింపజేయడానికి ఈ కోర్సు ఉపకరిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రకృతి వ్యవసాయదారుల క్షేత్రస్థాయి ప్రయోగ ఫలితాలను, శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రమాణీకరించి, శాస్త్రీయంగా విశ్లేషించి, గణాంకాలను రూపొందించడం ద్వారా ఈ పర్యావరణహిత వ్యవసాయాన్ని ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వ్యాపింప చేయటంలో అకాడమీ కీలక పాత్ర నిర్వహించనుంది. పర్యావరణహిత వ్యవసాయ నమూనాల రూపకల్పనతో పాటు, విధానపరమైన మార్పులకు ఈ కృషి దోహదపడనుంది. ప్రకృతి వ్యవసాయంలో రైతు శాస్త్రవేత్త కోర్సు కాలపరిమితి నాలుగేళ్లు. 75% ఆచరణాత్మక ప్రకృతి సాగు పాఠాలతో కూడి ఉండే ఈ కోర్సు ద్వారా రైతు శాస్త్రవేత్తలకు డిగ్రీని ప్రదానం చేస్తారు. నాలుగేళ్ళ వ్యవధి కలిగిన ఈ ప్రత్యేక కోర్సులో రైతు శాస్త్రవేత్తలకు నాలుగు విధాలుగా శిక్షణ ఇస్తారు. ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కోసం తయారు చేసిన 20 మాడ్యూళ్లను 8 సెమిస్టర్లలో ఆన్‌లైన్‌లో, తరగతి గదుల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో బోధిస్తారు.

ఈ కోర్సుకు అర్హులెవరు?

రైతు సాధికార సంస్థతో కలసి మూడు సంవత్సరాలుగా పనిచేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరణాత్మకంగా అభ్యసిస్తున్న రైతులను రైతు శాస్త్రవేత్త కోర్సుకు అభ్యర్థులుగా ఎంపిక చేస్తారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో నివాసి అయి ఉండి, అదే పరిసర ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారిని ఈ కోర్స్‌కు ఎంపిక చేస్తారు. కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, 21–40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని రైతు శాస్త్రవేత్త కోర్సుకు ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏటా వెయ్యి మంది రైతులను ఈ కోర్సులో ప్రవేశం కల్పించి రైతు శాస్త్రవేత్తలుగా తయారు చేస్తారు. మూడో ఏడాది నుంచి ప్రతి ఏటా రెండు నుంచి మూడువేల మంది రైతులను రైతు శాస్త్రవేత్త కోర్సులో చేర్చుకొని శిక్షణ ఇవ్వాలని రైతు సాధికార సంస్థ లక్ష్యంగా ఎంచుకుంది. మూడో ఏడాది నుంచి ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు చెందిన వారిని కూడా రైతు శాస్త్రవేత్త కోర్సులో చేర్చుకొని శిక్షణ ఇవ్వాలని రైతు సాధికార సంస్థ సంకల్పించింది.

రైతు శాస్త్రవేత్త కోర్సులో చేరిన రైతు శాస్త్రవేత్తలు తమ సొంత పొలంలో పూర్తిస్థాయి ('ఎ' గ్రేడ్) ప్రకృతి వ్యవసాయ నమూనాలను నిర్మిస్తారు. ఏడాది పొడవునా ప్రతి రోజూ ఆదాయం పొందేలా సాగు చేయటం ఎలాగో మెంటర్లుగా నియమితులయ్యే సీనియర్లు వీరికి నేర్పిస్తారు.

మా ఊళ్లో రైతులందర్నీ ప్రకృతి వ్యవసాయంలోకి మార్చుతా!



మా రెండెకరాల నిమ్మ తోటలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. మినుము, పెసర వంటి 9 రకాల అంతర పంటలు సాగు చేస్తున్నాను. డిగ్రీ చదువుకొని ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విస్తరణ విభాగంలో ఐసీఆర్‌పిగా పనిచేస్తున్నాను. రైతు శాస్త్రవేత్త కోర్సులో తొలి విద్యార్థిగా చేరటం నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రకృతి వ్యవసాయ విజ్ఞానాన్ని ఇంకా లోతుగా నేర్చుకోవడానికి ఇది గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. నెలకు ఐదు రోజులు అనంతపురంలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో మాకు శిక్షణ ఇస్తారు. అక్కడ నేర్చిన విషయాలను మిగతా 25 రోజులు మా తోటలో అమలు చేస్తూ పరిశోధన చెయ్యాలి. వచ్చే నాలుగేళ్లలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా నేర్చుకుంటూ మా తోటను ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దుతాను. ఇది చూపించి మా ఊళ్లో ఉన్న 400 మంది రైతులున్నారు. నా తోట సాక్ష్యంగా చూపించి, వారి సందేహాలు తీర్చుతూ వాళ్లందర్నీ ప్రకృతి వ్యవసాయంలోకి మార్చేస్తానని నమ్మకం ఉంది. ఈ అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ కృతజ్ఞతలు.

- పంచగల రామ్మోహన్,
రైతు శాస్త్రవేత్త కోర్సు తొలి విద్యార్థి,
మర్రిపల్లె, ఆళ్లగడ్డ మం. నంద్యాల జిల్లా

ప్రపంచ సమస్యలకు మీ సేద్యమే పరిష్కారం



నీటి వ్యవస్థల విఫలమయ్యాయి. భూతాపం, ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు, వరదలు, కరువు.. పెరిగిపోతున్నాయి. ప్రపంచం అతలాకుతలం అవుతోంది. ఏపీలో రైతులు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయం, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్, 365 రోజులు పొలంలో పంటలు పండించటం వంటి పద్ధతులే ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ, ఆర్థిక, ఆహార భద్రతా సమస్యలన్నిటికీ పరిష్కారం చూపగలవు. ప్రపంచ ఆగ్రోఎకాలజీ కమ్యూనిటీ అంతా మీ విజయాలను చూసి గర్వపడుతోంది. సంఘీభావం తెలుపుతోంది. అభినందనలు. శుభాకాంక్షలు.

- డా. వాల్టర్ యన, రీజెనరేటివ్ ఎర్త్, ఆస్ట్రేలియా

బంజర్లను బంగారంగా మార్చుతున్న రైతు దేవుళ్లు



ప్రకృతి వ్యవసాయం వినూత్న పద్ధతులను అనుసరిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో 8 లక్షల మంది రైతు దేవుళ్లు బంజరు భూముల్ని కూడా బంగారు భూములుగా మార్చుతున్నారు. ప్రకృతి సేద్యంలో శాస్త్రీయతను లోతుగా అర్థం చేసుకునేందుకు, ఎక్కువ మంది రైతుల దగ్గరకు ఈ విజ్ఞానాన్ని తీసుకెళ్లే లక్ష్యంతో రైతు శాస్త్రవేత్త కోర్సును ప్రారంభిస్తున్నాం. ఇతర రాష్ట్రాలకు, ప్రపంచ దేశాలకు కూడా మన రైతుల సునంపన్న పరిశోధనా ఫలాలు భవిష్యత్తులో అందుతాయి.

- టి. విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీ రైతు సాధికార సంస్థ

సాగుబడి
పుష్యమి కార్తె : జూలై 20 నుంచి

- ఏపీ ప్రకృతి సేద్యంపై జిస్ట్ ఇంపాక్ట్, గ్లోబల్ అలియన్స్ ఫర్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ స్వచ్ఛంద సంస్థల అధ్యయన నివేదిక
- రసాయనిక సాగుతో పోల్చితే ప్రకృతి సేద్యంలో అనేక ప్రధాన పంటల్లో సగటున 11% పెరిగిన దిగుబడి
- కూలీల అవసరం 21% పెరిగినా.. ఎరువులు, పురుగుమందులు మానటంతో 44% తగ్గిన ఖర్చు
- 49% పెరిగిన రైతుల నికరాదాయం
- 26% తగ్గిన ఆరోగ్య సంబంధమైన ఖర్చు
- అనారోగ్యం వల్ల కోల్పోయే పనిదినాలు మూడో వంతు తగ్గాయి.


ఆర్థిక, ఆరోగ్య ప్రదాత ప్రకృతి సేద్యం!



ప్రకృతి వ్యవసాయంతో పంట దిగుబడులను పెరిగే జనానికి సరిపోయేంత సాధ్యమేనా? వంటి ప్రాథమిక ప్రశ్నలకు, అనుమానాలకు ఇప్పుడు పూర్తిగా కాలం చెల్లింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 8 లక్షల మందికి పైగా రైతులు ఇటువంటి ప్రశ్నలన్నిటినీ తమ అనుభవాల ద్వారా పటాపంచలు చేశారు. దిగుబడులు సరే, ప్రకృతి సేద్యంలో శాస్త్రీయత ఎంత? అనే ప్రశ్నకు కూడా ఇటీవల విడుదలైన అంతర్జాతీయ స్థాయి అధ్యయన నివేదిక దీటుగా బదులిచ్చింది.

జిస్ట్ ఇంపాక్ట్, గ్లోబల్ అలియన్స్ ఫర్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ అనే స్వచ్ఛంద సంస్థలు ఏపీ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో 2020 నుంచి మూడేళ్లు లోతుగా అధ్యయనం చేసి, 'నాచురల్ ఫార్మింగ్ త్రో ఎ వైడ్ యాంగిల్ లెన్స్' పేరిట నివేదికను వెలువరించాయి. ఈ నివేదికను ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.)కి కూడా సమర్పించాయి.

హరిత విప్లవానికి ప్రతీకైన డెల్టా ప్రాంతంలోని పశ్చిమగోదావరి, నీటి ఎద్దడి ప్రాంతాలకు ప్రతీకైన అనంతపురం, కొండ ప్రాంత గిరిజన వ్యవసాయానికి ప్రతీకైన విజయనగరం జిల్లాల్లో 12 గ్రామాలను ఎంపిక చేసుకొని, ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, రసాయనిక వ్యవసాయం చేసే రైతుల క్షేత్రాల్లో లోతుగా అధ్యయనం చేశాయి. ఖరీఫ్, రబీ పంటలు, దీర్ఘకాలిక పంటలతో పాటు పశువుల పెంపకానికి సంబంధించిన విషయాలను అధ్యయనం చేశాయి. దిగుడులు, ఖర్చులు, నికరాదాయంతో పాటు.. రసాయనిక పురుగుమందులు, ఎరువుల ప్రభావం రైతులు, గ్రామీణుల ఆరోగ్యంపై ఎలా ఉందన్న విషయాన్ని పరిశీలించిన తొలి అధ్యయనం కావటం మరో విశేషం. ప్రకృతికి సంబంధించిన అంశాలపై నోబెల్ ప్రైజ్‌గా భావించే టేలర్ పురస్కారం(2020) అందుకున్న ప్రముఖ పర్యావరణ ఆర్థికవేత్త పవన్ సుఖదేవ్ ఆధ్వర్యంలో ఈ అధ్యయనం జరగటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ నివేదికలో ఏముందంటే..?



పవన్ సుఖదేవ్

ప్రకృతి సేద్యంతో 49% పెరిగిన నికరాదాయం

● రసాయనిక సేద్యం జరిగే పొలాల్లో ఒకటో రెండో పంటలు పండిస్తూ ఉంటే.. ప్రకృతి వ్యవసాయంలో సగటున 4 పంటలు పండిస్తున్నారు. ● వరి, మొక్కజొన్న, మినుము, రాగులు, కంది వంటి ప్రధాన పంటల దిగుబడి రసాయనిక వ్యవసాయంతో పోల్చితే ప్రకృతి వ్యవసాయంలో సగటున 11% పెరిగింది. ● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో శ్రమ అవసరం రసాయనిక సేద్యంతో పోల్చితే సగటున 21% పెరిగింది. రైతు కుటుంబం, కూలీల శ్రమ మొత్తాన్నీ లెక్కగట్టారు. గోదావరి డెల్టాలో రసాయన వ్యవసాయంలో ఏడాదికి 313 గంటలు పని చేస్తే, ప్రకృతి సేద్యంలో ఇది 377 గంటలకు పెరిగింది. రాయలసీమలో 258 నుంచి 322 గంటలకు పెరిగింది. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల్లో 234 నుంచి 268 గంటలకు పెరిగింది.

● అయితే, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం మానెయ్యటంతో ఖర్చు సగటున 44% తగ్గింది. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లోని ప్రకృతి వ్యవసాయదారుల సగటు నికరాదాయం 49% పెరిగింది.

చిన్న రైతులే 'సామాజిక మూలధనం'

● ప్రకృతి సేద్య అనుభవాలను ఒకరితో మరొకరు పంచుకోవటం వల్ల మీకు తోడుగా మేం ఉన్నాం అన్న భావం విస్తరించింది. పరస్పర విశ్వాసం, మద్దతు, సాంఘిక సమన్వయం పెరిగాయి. అన్యోన్యతకు దారితీసింది. ● ఈ విధంగా రసాయనాల్లేని సాగు అనుభవాలను పంచుకోవడం ద్వారా సామాజిక మూలధనం గణనీయంగా పెరగడానికి మహిళా స్వయం సహాయక బృందాలు ప్రభావశీలంగా పనిచేస్తున్నాయి. ● ప్రకృతి వ్యవసాయానికి మళ్లటంలో, ఈ క్రమంలో ఒకరికి మరొకరు తోడుగా నిలబడటంలో పెద్ద రైతుల కంటే చిన్న కమతాల రైతులు ముందంజలో ఉన్నారు. సామాజిక మూలధనాన్ని పెంపొందిచటంలో చిన్న రైతుల పాత్ర చాలా ప్రధానమైనదని తేటతెల్లమైంది. మన రైతుల్లో 83% మంది చిన్న, సన్నకారు రైతులే.

మెరుగైన ఆరోగ్యం...

● రసాయనిక వ్యవసాయం చేసే రైతులు, ఆ పొలాల్లో పనిచేసే కూలీలు అనారోగ్యాల పాలవుతూ చాలా పని దినాలు కోల్పోతూ ఉంటారు. వీరితో పోల్చితే ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే కూలీలు, రైతులు అనారోగ్యం వల్ల పనికి వెళ్లటం మానుకోవాల్సిన రోజులు మూడింట ఒక వంతు (33%) తగ్గినట్లు అధ్యయనంలో వెల్లడైంది. ● రసాయనిక పురుగుమందులు, ఎరువుల వాడే రైతులకు ఆరోగ్య ఖర్చులు ఎక్కువ. వారి జీవన నాణ్యత, పని సామర్థ్యం కూడా దెబ్బతింటుంది. సాధారణంగా ఇటువంటి ఆరోగ్యంపై దుష్ప్రభావం కలిగించే నష్టాన్ని లెక్కలోకి తీసుకోవటం లేదు. ● ప్రకృతి సేద్యం చేసే రైతుల ఆస్పత్రి ఖర్చులు 26% తక్కువ. ● ప్రకృతి వ్యవసాయదారులు ఎక్కువ రకాల పంటలు పండించడమే కాదు ఎక్కువ రకాల ఆహారాన్ని తినగలుగుతున్నారు. పోషకాలతో కూడిన అనేక రకాల ఆహారం తినటం వల్ల వీరి ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంది.



జాతీయ ఫుట్‌బాల్ శిబిరానికి సౌమ్య గుగులోత్

పారిస్ ఒలింపిక్స్ రెండో రౌండ్ క్వాలిఫయింగ్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే భారత మహిళల జట్టును ఎంపిక చేసేందుకు 34 మంది క్రీడాకారిణులతో కూడిన జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో తెలంగాణ అమ్మాయి, నిజామాబాద్ జిల్లాకు చెందిన సౌమ్య గుగులోత్‌కు స్థానం లభించింది. సౌమ్య ఇప్పటికే భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. తాష్కెంట్‌లో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు అక్టోబర్ 26న జపాన్‌తో, అక్టోబర్ 29న వియత్నాంతో, నవంబర్ 1న ఉజ్బెకిస్తాన్‌తో ఆడుతుంది.

ఐటీఎఫ్ టోర్నీ విజేత కర్మన్‌కౌర్

భారత మహిళా టెన్నిస్ ప్లేయర్ కర్మన్‌కౌర్ థండి తన కెరీర్‌లో నాలుగో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. అమెరికాలోని ఈవాన్స్‌విల్లెలో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ60 టోర్నీలో కర్మన్‌కౌర్ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో కర్మన్ 7-5, 4-6, 6-1తో యులియా స్టారోడబ్ట్సెవా (ఉక్రెయిన్)పై గెలిచింది. తాజా విజయంతో కర్మన్‌కౌర్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 51 స్థానాలు ఎగబాకి 210వ ర్యాంక్‌కు చేరుకుంది.



రూ. 2,716 కోట్లు!

ఎంబాపెకు 'అల్-హిలాల్' క్లబ్ ఆఫర్



సిడ్నీ: సమకాలీన ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న కిలియాన్ ఎంబాపె కోసం సహజంగానే క్లబ్‌లు క్యూ కడతాయి. 2018 వరల్డ్‌కప్‌ను ఫ్రాన్స్ గెలవడంతో పాటు 2022లో తమ జట్టు ఫైనల్ చేరడంలో కూడా అతను కీలకపాత్ర పోషించాడు. ఈ క్రమంలో ఎంబాపెకు సౌదీ అరేబియా క్లబ్ అల్-హిలాల్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. అతనితో ఒప్పందం కోసం 332 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 2 వేల 716 కోట్లు) ఇచ్చేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఎంబాపె పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) టీమ్‌తో ఉన్నాడు. ఈ టీమ్‌తో అతను కాంట్రాక్ట్ పొడిగించుకునే అవకాశం కనిపించడం లేదు. ఇలాంటి నేపథ్యంలో అల్-హిలాల్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం దీనిపై చర్చలు కొనసాగుతున్నాయి.

టాప్-100లోకి అనిరుధ్

న్యూఢిల్లీ: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. సోమవారం విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో అనిరుధ్ తొమ్మిది స్థానాలు ఎగబాకి సరిగ్గా 100వ ర్యాంక్‌లో నిలిచాడు.



గతవారం అమెరికాలో జరిగిన 'హాల్ ఆఫ్ ఫేమ్' ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్)తో కలిసి ఆడిన అనిరుధ్ డబుల్స్‌లో సెమీఫైనల్ చేరుకోవడంతో అతని ర్యాంక్ మెరుగైంది. వెటరన్ రోహన్ బోపన్న ఒక స్థానం పడిపోయి ఎనిమిదో ర్యాంక్‌లో ఉండగా... యూకీ బాంబ్రీ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని 60వ ర్యాంక్‌లో, సాకేత్ మైనేని నాలుగు స్థానాలు పురోగతి సాధించి 77వ ర్యాంక్‌లో నిలిచారు. జీవన్ నెడుంజెళియన్ 91వ ర్యాంక్‌లో, శ్రీరామ్ బాలాజీ 94వ ర్యాంక్‌లో ఉన్నారు. మరోవైపు సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సుమిత్ నగాల్ ఏకంగా 53 స్థానాలు ఎగబాకి 178వ ర్యాంక్‌లో నిలిచాడు.

వదలని వాన... అందని విజయం



- భారత్, వెస్టిండీస్ రెండో టెస్టు 'డ్రా'
- చివరి రోజు సాధ్యం కాని ఆట
- సిరీస్ 1-0తో భారత్ సొంతం

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత్ గెలుపు ఆశలపై వరుణదేవుడు నీళ్లు చల్లాడు! కచ్చితంగా గెలిచే అవకాశం ఉన్న మ్యాచ్ 'డ్రా' కావడంతో టీమిండియా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో కీలక పాయింట్లు కోల్పోయింది. క్వీన్స్ పార్క్ ఓవల్‌లో భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన రెండో టెస్టులో వాన కారణంగా ఫలితం తేలకుండా పోయింది. భారీ వర్షంతో మ్యాచ్ చివరి రోజు సోమవారం ఒక్క బంతి కూడా సాధ్యం కాలేదు. పలుమార్లు వాన రావడం, తగ్గడం, మళ్లీ రావడం జరిగాయి. ఆట ఆరంభమవుతుందని అనిపించడం, పిచ్‌ను సిద్ధం చేసే ప్రయత్నం చేయడం, అంతలోనే చినుకులతో పరిస్థితి మారిపోవడం తరచుగా జరిగింది. చివరకు స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 2:50కు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి టెస్టు గెలిచిన భారత్ సిరీస్‌ను 1-0తో సొంతం చేసుకుంది. గత మ్యాచ్‌లో 12 పాయింట్లు సాధించిన టీమిండియా ఖాతాలో ఈ 'డ్రా' కారణంగా 4 పాయింట్లే చేరాయి. అంతకు ముందు నాలుగో రోజు 365 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది.

బ్రాత్‌వైట్ (28), చందర్‌పాల్ (24 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. ఆఖరి రోజు ఆట సాగితే మిగిలిన ఎనిమిది వికెట్లు తీయడం భారత్‌కు కష్టం కాకపోయేది. కానీ వానతో లెక్క మారిపోయింది. నాలుగో రోజు చివరి సెషన్‌లో భారత్ దూకుడైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చింది. ఈ సెషన్‌లో ఆడిన 9 ఓవర్లలోనే టీమిండియా 63 పరుగులు చేసింది. రోచ్ ఓవర్లో ఇషాన్ 'సింగిల్ హ్యాండ్'తో వరుసగా రెండు భారీ సిక్సర్లు బాది 33 బంతుల్లోనే కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో బంతి తర్వాత భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి విండీస్‌కు 365 పరుగుల లక్ష్యాన్ని విధించింది. భారీ ఛేదనలో విండీస్‌కు సరైన ఆరంభం లభించలేదు. బ్రాత్‌వైట్ పరుగులు జోడించేందుకు ప్రయత్నించగా, చందర్‌పాల్ పూర్తిగా డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. ఒకదశలో అతను 50 బంతుల్లో 3 పరుగులే చేశాడు. అశ్విన్ ఈ జోడీని విడదీసి భారత్‌కు తొలి వికెట్ అందించాడు. స్వీప్ చేయబోయిన బ్రాత్‌వైట్ ఫైన్‌లెగ్‌లో క్యాచ్ ఇచ్చాడు. అశ్విన్ తన తర్వాతి ఓవర్లోనే మెకెన్జీ (0)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అయితే ఆ తర్వాత చందర్‌పాల్, బ్లాక్‌వుడ్ (20 నాటౌట్) వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి రోజును ముగించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 438; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 255; భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) సిల్వ (బి) వారికాన్ 38; రోహిత్ (సి) జోసెఫ్ (బి) గాబ్రియెల్ 57; గిల్ (నాటౌట్) 29; ఇషాన్ కిషన్ (నాటౌట్) 52; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (24 ఓవర్లలో 2 వికెట్లకు) 181 డిక్లేర్డ్.** **వికెట్ల పతనం:** 1-98, 2-202. **బౌలింగ్:** రోచ్ 4-0-46-0, జోసెఫ్ 4-0-37-0, హోల్డర్ 4-0-26-0, గాబ్రియెల్ 6-0-33-1, వారికాన్ 6-0-36-1. **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** బ్రాత్‌వైట్ (సి) ఉనాద్కట్ (బి) అశ్విన్ 28; చందర్‌పాల్ (నాటౌట్) 24; మెకెన్జీ (ఎల్బీ) (బి) అశ్విన్ 0; బ్లాక్‌వుడ్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (32 ఓవర్లలో 2 వికెట్లకు) 76.** **వికెట్ల పతనం:** 1-38, 2-44. **బౌలింగ్:** సిరాజ్ 8-2-24-0, ముకేశ్ 5-4-5-0, ఉనాద్కట్ 3-2-1-0, అశ్విన్ 11-2-33-2, జడేజా 5-1-10-0.

పసిడి పతకాలతో ముగింపు

17 పతకాలతో భారత్‌కు రెండో స్థానం



కమల్‌జీత్

చాంగ్వాన్ (కొరియా): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భారత షూటర్లు పసిడి పతకాలతో ముగించారు. ఈ టోర్నీ చివరిరోజు సోమవారం భారత్‌కు మూడు స్వర్ణాలు, ఒక రజత పతకం లభించాయి. పురుషుల 50 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కమల్‌జీత్ 544 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని సాధించాడు. కమల్‌జీత్, అంకిత్ తోమర్, నందీప్ బిష్ణోయ్‌లతో కూడిన భారత జట్టు 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో 1617 పాయింట్లతో పసిడి పతకాన్ని దక్కించుకుంది. మహిళల 50 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో టియానా 519 పాయింట్లతో రజత పతకాన్ని సొంతం చేసుకుంది. టియానా, యశిత షోకీన్, వీర్పాల్ కౌర్‌లతో కూడిన భారత జట్టు మహిళల 50 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో 1498 పాయింట్లతో బంగారు పతకాన్ని గెల్చుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో భారత షూటర్లు ఓవరాల్‌గా ఆరు స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలతో కలిపి మొత్తం 17 పతకాలతో రెండో స్థానంలో నిలిచారు. 28 పతకాలతో చైనా టాప్ ర్యాంక్‌లో నిలిచింది.

భారత సాఫ్ట్‌బాల్ జట్టులో తెలంగాణ అమ్మాయి

ఆసియా క్రీడలకు మమత గుగులోత్ ఎంపిక



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో అరంగేట్రం చేయనున్న సాఫ్ట్‌బాల్ క్రీడాంశంలో పాల్గొనే భారత మహిళల సాఫ్ట్‌బాల్ జట్టును సోమవారం ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయి మమత గుగులోత్‌కు చోటు దక్కింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన మమత గత ఎనిమిదేళ్లుగా జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తోంది. అండర్-14, అండర్-17, అండర్-19 వయో విభాగాల్లో కలిపి మొత్తం 18 సార్లు జాతీయ పోటీల్లో పాల్గొన్న ఆమె పలుమార్లు 'ఉత్తమ క్యాచర్'గా అవార్డులు అందుకుందని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె. శోభన్ బాబు తెలిపారు. నిజామాబాద్ సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ స్పోర్ట్స్ అకాడమీలో నీరజ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న మమత ప్రస్తుతం భువనగిరిలోని సోషల్ వెల్ఫేర్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజీలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత జట్టు రెగ్యులర్ గా పోటీపడుతుండటంతో ఆసియా సాఫ్ట్‌బాల్ సంఘం భారత జట్టుకు వైల్డ్ కార్డు ఎంట్రీ కేటాయించింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్జౌలో జరుగుతాయి.

సౌత్ జోన్ శుభారంభం



పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సౌత్ జోన్ జట్టు శుభారంభం చేసింది. నార్త్ జోన్ జట్టుతో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సౌత్ జోన్ వీజేడీ పద్ధతిలో 185 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా సౌత్ జోన్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 303 పరుగులు చేసింది. రోహన్ కున్నుమ్మల్ (70; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), మయాంక్ అగర్వాల్ (64; 7 ఫోర్లు), జగదీశన్ (72; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం వర్షం కారణంగా నార్త్ జోన్ జట్టు విజయలక్ష్యాన్ని 28 ఓవర్లలో 246 పరుగులుగా నిర్ణయించారు. సౌత్ జట్టు పేసర్ విద్వత్ కావేరప్ప (5/17) ధాటికి నార్త్ జోన్ జట్టు 23 ఓవర్లలో 60 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో ఈస్ట్ జోన్ ఆరు వికెట్లతో సెంట్రల్ జోన్‌పై, వెస్ట్ జోన్ తొమ్మిది వికెట్లతో నార్త్ ఈస్ట్ జోన్‌పై గెలిచాయి.

శ్రీలంక 166 ఆలౌట్

పాక్‌తో రెండో టెస్టు



నసీమ్ షా, బాబర్

కొలంబో: పాకిస్తాన్‌తో సోమవారం ప్రారంభమైన రెండో టెస్టులో శ్రీలంక బ్యాటింగ్ కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 48.4 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (57; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా, దినేశ్ చండీమల్ (34) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్ 4 వికెట్లు పడగొట్టగా, నసీమ్ షాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం పాకిస్తాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడింది. ఆట ముగిసే సమయానికి పాక్ 28.3 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీక్ (99 బంతుల్లో 74 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాన్ మసూద్ (47 బంతుల్లో 51; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు సాధించగా, ప్రస్తుతం షఫీక్‌తో పాటు కెప్టెన్ బాబర్ ఆజమ్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. శ్రీలంక స్కోరుకు పాక్ మరో 21 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. తొలి టెస్టులో గెలిచిన పాక్ సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది.


మెయిన్ 'డ్రా'కు అంకిత రైనా



వార్సా (పోలాండ్): భారత మహిళా టెన్నిస్ నంబర్‌వన్ అంకిత రైనా వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 200వ ర్యాంక్‌లో ఉన్న అంకిత సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో 4-6, 6-3, 6-1తో జోనా గార్లాండ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 2 గంటల 15 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. అంతకు ముందు క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో అంకిత 6-3, 6-1తో ఒలివియా లిన్సెర్ (పోలాండ్)పై గెలిచింది. డబుల్స్ విభాగంలో చైనా ప్లేయర్ యు యువాన్‌తో జతకట్టి అంకిత బరిలోకి దిగనుంది.

సినిమా

యంగ్ కమల్.. ఓ టెక్నిక్



కమల్‌హాసన్

పాతికేళ్ల క్రితం కమల్‌హాసన్ వయసుకు మించి కనిపించిన పాత్రల్లో 'ఇండియన్'లో సేనాపతి, 'భామనే సత్యభామనే'లో వృద్ధురాలి పాత్రల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. నాలుగు పదుల వయసులో ఆరు పదుల వయసుకి మించి కమల్ కనిపించిన పాత్రలివి. ఇప్పుడు ఇంకో ఏడాదికి కమల్ ఏడు పదుల వయసుని టచ్ చేస్తున్న నేపథ్యంలో యువకుడిలా కనిపించాల్సి వస్తోంది. 'ఇండియన్'లో కమల్‌ని యంగ్ అండ్ ఓల్డ్ పాత్రల్లో చూపించిన దర్శకుడు శంకర్ ఈ చిత్రం సీక్వెల్ 'ఇండియన్ 2'లో కూడా వృద్ధుడిగా, యువకుడిగా చూపించనున్నారు. యువకుడి పాత్ర కోసం సాంకేతిక సహాయం తీసుకుంటున్నారట. ప్రస్తుతం శంకర్ లాస్ ఏంజిల్స్‌లో ఉన్నారు. ''లాస్ ఏంజిల్స్‌లోని లోలా వీఎఫ్‌ఎక్స్‌లో అధునాతన సాంకేతికతను పర్యవేక్షిస్తున్నాను'' అని శంకర్ పేర్కొన్నారు. కమల్‌ని యువకుడిగా చూపించడానికే లోలా సంస్థని శంకర్ సంప్రదించి ఉంటారనే ఊహాగానాలు నెలకొన్నాయి. ఎందుకంటే 'డీ-ఏజింగ్' (యంగ్‌గా చూపించడం) టెక్నాలజీకి లోలా పాపులర్.

ఎవరు వాళ్లు?



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించారు. బీవీఎస్‌ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 25న రిలీజ్ కానుంది. సోమవారం టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'మీరిప్పుడు హై రిస్క్ టార్గెట్.. ఈ పనికి నేను అర్జున్‌ని మాత్రమే నమ్మగలను', 'తనతో వర్క్ చేయడం చాలా కష్టం', 'అయినా ఎవరు వాళ్లు..' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. బీవీఎస్‌ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గాండీవధారి అర్జున'. దేశ రక్షణకు సంబంధించి పెద్ద సమస్య ఏర్పడుతుంది. ఆ సమస్య నుంచి దేశాన్ని అర్జున్ (వరుణ్ తేజ్) ఎలా కాపాడాడు? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: ముఖేష్.

అందుకే యష్‌ని హీరోని చేశాను - 'దిల్' రాజు



'దిల్' రాజు, హర్షిత, కార్తీక, యష్

''ఆకాశం దాటి వస్తావా' మంచి మ్యూజికల్ మూవీ. కొత్త ప్రతిభని పరిచయం చేయాలనే దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్‌లో శశి, యష్‌లతో ఈ యూత్‌ఫుల్ సినిమా చేస్తున్నాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. కొరియోగ్రాఫర్ యష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఆకాశం దాటి వస్తావా'. శశి కుమార్ ముతులూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కార్తీక మురళీధరన్ హీరోయిన్. 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌లో 'బలగం' తర్వాత హర్షిత్, హన్షిత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్, పోస్టర్‌ని సోమవారం విడుదల చేశారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నా సినిమాలో కొరియోగ్రాఫర్‌గా అవకాశం ఇస్తానని యష్‌తో అన్నాను. కానీ లుక్ పరంగా బాగున్నాడు. అందుకే హీరోగా పరిచయం చేస్తున్నాం. సింగర్ కార్తీక్ ఈ సినిమా ద్వారా మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు'' అన్నారు. ''జీవితంలో అన్ని బంధాలకు ప్రేమ, టైమ్, డబ్బులను సమానంగా ఇవ్వాలి. ఈ మూడింటిలో ఏది తగ్గినా ఆ బంధంలో గొడవలు జరుగుతాయి. ఇదే పాయింట్‌తో ఈ సినిమా కథ సాగుతుంది'' అన్నారు శశి కుమార్ ముతులూరి. ''నన్ను నమ్మి హీరోగా అవకాశం ఇచ్చినందుకు 'దిల్' రాజు, శశి, హర్షిత్, హన్షితగార్లకు థ్యాంక్స్'' అన్నారు యష్.

బంధాల గురించి చెప్పే సినిమా ఇది - సాక్షీ సింగ్



త్రిపుర, నదియా, సాక్షీ సింగ్, ఇవానా, సుధీర్‌బాబు, హరీష్ కల్యాణ్

''ఇప్పటివరకు నేను చేసిన సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎలా ఎంజాయ్ చేశారో.. 'ఎల్‌జీఎమ్' మూవీని కూడా అలాగే ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నాను. తెలుగువారి ప్రేమ, అభిమానాలను ఎప్పటికీ మరచిపోలేను'' అని నటి నదియా అన్నారు. ఇండియన్ క్రికెటర్ ఎంఎస్ ధోని చిత్ర నిర్మాణంలోకి అడుగు పెట్టిన సినిమా 'ఎల్‌జీఎమ్' (లెట్స్ గెట్ మ్యారీడ్). హరీష్ కల్యాణ్, ఇవానా, నదియా, యోగిబాబు కీలక పాత్రల్లో రమేష్ తమిళ్ మణి దర్శకత్వం వహించారు. ధోని భార్య సాక్షీ సింగ్ ధోని, వికాస్ హస్జా నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళంలో ఆగస్టు 4న రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో జేపీఆర్ ఫిల్మ్స్ త్రిపుర ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ– ''ధోనీగారు క్రికెట్‌లో ఎలాంటి విజయాలను సాధించారో అలాంటి సక్సెస్‌ను సినిమా రంగంలోనూ సాధించాలి'' అన్నారు. ''అల్లు అర్జున్ సినిమాలన్నింటినీ హిందీలో (తెలుగు డబ్బింగ్) చూశాను. నేను తనకు పెద్ద అభిమానిని. మన జీవితంలోని బంధాల గురించి చెప్పే సినిమా 'ఎల్‌జీఎం'' అన్నారు సాక్షీ సింగ్ ధోని.



కృతీ సనన్

విషాద నటి బయోపిక్ నిజమే

హిందీ

చిత్రసీమలో విషాద పాత్రల్లో మెప్పించిన అలనాటి నటి ఎవరు అంటే? 'మీనా కుమారి' పేరు చెబుతారు. తన అందం, అభినయంతో నాటి తరం ప్రేక్షకులను అలరించారు మీనా కుమారి. ప్రస్తుతం ఆమె బయోపిక్ రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బాలీవుడ్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా, ఈ బయోపిక్ గురించి మనీషా మల్హోత్రా మాట్లాడుతూ– ''ఏ చిత్రానికైనా కథే కీలకం. బయోపిక్‌లకి మరీను. మీనా కుమారి మీద వచ్చిన పుస్తకాల ఆధారంగా కథ తయారు చేస్తున్నా'' అన్నారు. ఇటీవల రిలీజైన 'ఆది పురుష్'లో సీత పాత్ర చేసిన కృతీ సనన్ 'మీనా కుమారి' బయోపిక్‌లో టైటిల్ రోల్ చేయనున్నారు. ఇదిలా ఉంటే.. మీనా కుమారి బయోపిక్ తీయడా నికి ఆమె కుటుంబ సభ్యులు సుముఖంగా లేరని భోగట్టా.

జవాన్ రిస్క్



షారుక్ ఖాన్

'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్, కెప్టెన్ అమెరికా, వెనోమ్, స్టార్ ట్రెక్' వంటి హాలీవుడ్ చిత్రాల్లో యాక్షన్ సీన్స్ థ్రిల్‌కి గురి చేసే విధంగా ఉంటాయి. అలాంటి ఫైట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి రెడీ అయ్యారు షారుక్ ఖాన్. ఆ హాలీవుడ్ చిత్రాలకు యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా చేసిన స్పీరో రజటోస్ ఆధ్వర్యంలో షారుక్ 'జవాన్' కోసం రిస్కీ ఫైట్స్ చేశారు. షారుక్ ఖాన్, నయనతార జంటగా తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మించిన చిత్రం 'జవాన్'. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 7న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని రిస్కీ స్టంట్స్‌ని హాలీవుడ్ యాక్షన్ మాస్టర్ స్పీరో రజటోస్ సమకూర్చారని యూనిట్ పేర్కొంది. ''జవాన్'లో షారుక్ చేసిన రిస్కీ ఫైట్స్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే విధంగా ఉంటాయి. స్పీరో రజటోస్ డిజైన్ చేసిన యాక్షన్ సీన్స్ ఓ విజువల్ ట్రీట్‌లా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

రీల్స్

హాయిగా నవ్వుకుంటారు

- అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి



అప్పిరెడ్డి, వెంకట్

''స్లమ్ డాగ్ హజ్బెండ్' వినోదాత్మక చిత్రం. మూఢ నమ్మకాలపై సెటైర్‌లా ఉండే ఈ కథ కొత్తగా అనిపించింది.. అందుకే నిర్మించాం. మా సినిమా చూసి ప్రేక్షకులు రెండు గంటలు హాయిగా నవ్వుకుంటారు'' అన్నారు నిర్మాతలు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమాని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ నెల 29న విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి మాట్లాడుతూ– ''వ్యాపారరీత్యా అమెరికా వెళ్లాం. అక్కడ 2016లో ఓ హాలీవుడ్ మూవీ నిర్మించాం. 2017కి ఇండియా వచ్చి, తెలుగులో మొదటి సినిమాగా 'జార్జ్ రెడ్డి' నిర్మించాం. ఏఆర్ శ్రీధర్ చెప్పిన కథ నచ్చడంతో 'స్లమ్ డాగ్ హజ్బెండ్' తీశాం. మా బ్యానర్‌లో నిర్మించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' ఆగస్టు 18న రిలీజ్ చేస్తాం'' అన్నారు.

పొలిటికల్ థ్రిల్లర్



నారా రోహిత్

కొంత గ్యాప్ తర్వాత నారా రోహిత్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'ప్రతినిధి 2' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. మూర్తి దేవగుప్తపు దర్శకత్వంలో కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, కొండకళ్ల రాజేందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఫస్ట్ లుక్ రిలీజ్ చేసి, 2024 జనవరి 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ''నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి' ఫ్రాంచైజీలో భాగంగా పొలిటికల్ థ్రిల్లర్‌గా 'ప్రతినిధి 2'ని రూపొందిస్తున్నాం. సామాజిక సమస్యల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

స్త్రీ ఆత్మగౌరవంతో...



లక్ష్మణ్ చిన్నా, కావ్య రమేష్

లక్ష్మణ్ చిన్నా హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నచ్చినవాడు'. కావ్య రమేష్ హీరోయిన్. స్ట్రీట్ డాగ్ సమర్పణలో లక్ష్మణ్ చిన్నా, వెంకట రత్నం నిర్మించారు. ఆగస్టు 18న విడుదలకానున్న ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. హీరో–దర్శక–నిర్మాత లక్ష్మణ్ చిన్నా మాట్లాడుతూ– ''మహిళల ఆత్మగౌరవం కథాంశంగా చేసుకుని అల్లిన సరికొత్త ప్రేమ కథా చిత్రం 'నచ్చినవాడు'' అన్నారు. ''ఈ చిత్రంలో అను పాత్ర చేశాను'' అన్నారు కావ్య రమేష్.

మదర్ సెంటిమెంట్



సదా

సదా హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నంద'. గోణుగుంట్ల విజయ్ కుమార్ సమర్పణలో కళ్యాణ్ ఎర్రగుంట్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''మదర్ సెంటిమెంట్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్ టైనర్ చిత్రమిది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుతున్నాం. మా చిత్రానికి చరణ్ అర్జున్ అద్భుతమైన పాటలు సమకూర్చారు'' అన్నారు హీరో, దర్శకుడు సదా.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	299	66,385
నిఫ్టీ ▼	73	19,672

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,069	▲ 35
డోజోన్స్	35,440	▲ 213
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,679	▲ 15
డాక్స్	16,191	▲ 14
షాంఘై	3,164	▼ 4
నికాయ్	32,701	▲ 397

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	59,434
బంగారం (22 క్యారెట్)	59,196
వెండి (కేజీ)	74,190

ఐటీసీ నుంచి హోటల్స్ వ్యాపారం విభజన



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ తమ హోటల్స్ వ్యాపార విభాగాన్ని ప్రత్యేక అనుబంధ సంస్థ ఐటీసీ హోటల్స్ కింద విడగొట్టనున్నట్లు ప్రకటించింది. ఇన్వెస్టర్లు, వ్యూహాత్మక భాగస్వాములను ఆకర్షించేందుకు ఇది తోడ్పడగలదని ఆశిస్తున్నట్లు వివరించింది. గత కొన్నేళ్లుగా హోటల్స్ వ్యాపారం మెరుగ్గా రాణిస్తోందని, ప్రత్యేక సంస్థగా వృద్ధి చెందే సామర్థ్యాలను సంతరించుకుందని ఐటీసీ తెలిపింది. జూలై 24న జరిగిన సమావేశంలో ఈ వ్యాపారాన్ని విభజించే ప్రతిపాదనకు బోర్డు సూత్రప్రాయంగా ఆమోదముద్ర వేసినట్లు వివరించింది. కొత్త సంస్థలో ఐటీసీకి దాదాపు 40 శాతం వాటాలు ఉంటాయి. తమ తమ వాటాల ప్రకారం ఇతరత్రా షేర్‌హోల్డర్లకు 60 శాతం వాటాలు లభిస్తాయి. 'ప్రతిపాదిత పునర్‌వ్యవస్థీకరణతో, అటు కొత్త సంస్థ, ఇటు ఐటీసీ.. సమష్టి సంస్థాగత సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రయోజనాలు పొందడం కొనసాగుతుంది' అని ఐటీసీ లిమిటెడ్ చైర్మన్ సంజీవ్ పురి తెలిపారు. 1975లో లగ్జరీ హోటల్స్ చెయిన్‌గా ఐటీసీ హోటల్స్ ప్రారంభమైంది. ప్రస్తుతం 70 పైచిలుకు ప్రాంతాల్లో 11,600 గదులతో 120 హోటల్స్ ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో హోటల్స్ వ్యాపార విభాగం ఆదాయం రెట్టింపై రూ. 2,689 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 1,347 కోట్లు.

టీవీఎస్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 434 కోట్లు




న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం టీవీఎస్ మోటార్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 42 శాతం జంప్‌చేసి రూ. 434 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 305 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,348 కోట్ల నుంచి రూ. 9,142 కోట్లకు బలపడింది. ఎగుమతులతోసహా ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలు 5 శాతం పుంజుకుని 9.53 లక్షల యూనిట్లకు చేరాయి. వీటిలో మోటార్‌సైకిళ్ల విక్రయాలు 7 శాతం ఎగసి 4.63 లక్షలను తాకగా.. స్కూటర్ అమ్మకాలు 11 శాతం వృద్ధితో 3.5 లక్షల యూనిట్లకు చేరాయి. ఎలక్ట్రిక్ స్కూటర్ విక్రయాలు నాలుగు రెట్లుపైగా జంప్‌చేసి 39,000 యూనిట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ షేరు బీఎస్‌ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 1,307 వద్ద ముగిసింది.

పిట్ట పోయే.. 'X' వచ్చే...

మారిన ట్విటర్ లోగో



న్యూఢిల్లీ: అమెరికన్ దిగ్గజం ఎలాన్ మస్క్ కొన్నప్పటి నుంచి సోషల్ మీడియా నెట్‌వర్క్ సైట్ ట్విటర్‌లో మార్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. తాజాగా రీబ్రాండింగ్‌లో భాగంగా సోమవారం నాడు ట్విటర్ లోగో నీలి పిట్ట స్థానంలో ఆంగ్ల అక్షరం ఎక్స్(X)ను తీసుకొచ్చారు మస్క్. నల్లని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లగా కనిపించే X అక్షరంతో దీన్ని డిజైన్ చేశారు. 'నేటి నుంచి మధ్యంతర లోగోగా X ఉంటుంది' అని మస్క్ ట్వీట్ చేశారు. అలాగే X.కామ్ వెబ్‌సైట్ నేరుగా ట్విటర్‌లో తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ట్విటర్ అధికారిక అకౌంటులో X వచ్చి చేరగా, ఎలాన్ మస్క్ అధికారిక అకౌంటులో కొత్త లోగోను డిస్‌ప్లే పిక్చర్‌గా ఉంచారు. భారత్‌లో ట్విటర్ ఐవోఎస్, ఆండ్రాయిడ్ యాప్స్‌లో కొత్త మార్పులను ఇంకా అప్‌డేట్ చేయాల్సి ఉన్నట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. లోగో ఎంపికను ట్విటర్ సీఈవో లిండా యాకారినో ధ్రువీకరించారు. 'జీవితంలో కావచ్చు వ్యాపారంలో కావచ్చు మరోసారి పెద్ద ఎత్తున ప్రభావం చూపడానికి రెండో అవకాశం చాలా అరుదుగా వస్తుంది. మనం సంభాషించుకునే విధానంలో మార్పులు తేవడం ద్వారా ట్విటర్ ఓ గొప్ప ప్రభావం చూపింది. ఇక ఇప్పుడు X దాన్ని మరింత ముందుకు తీసుకెడుతుంది. ఆడియో, వీడియో, మెసేజింగ్, చెల్లింపులు, బ్యాంకింగ్ వంటి కార్యకలాపాలకు కేంద్రంగా మారుతుంది' అని ఆమె పేర్కొన్నారు. చైనాకు చెందిన వుయ్‌చాట్ తరహా 'సూపర్ యాప్'ను తీర్చిదిద్దే క్రమంలోనే మస్క్ కొత్త మార్పులు చేస్తున్నారనే అభిప్రాయం నెలకొంది. అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధినేత అయిన మస్క్ 44 బిలియన్ డాలర్లు వెచ్చించి ట్విటర్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ట్విటర్‌ను దక్కించుకున్న తర్వాత పెద్ద యెత్తున ఉద్యోగులను తొలగించిన మస్క్.. గతంలో ఉచితంగా ఉన్న సర్వీసులకు కూడా చార్జీల విధానం ప్రవేశపెట్టడం మొదలైన చర్యలు తీసుకున్నారు.

'X'తో మస్క్ అనుబంధం

ఎక్స్(X) అక్షరంతో మస్క్ అనుబంధం ఈ నాటిది కాదు. 1999లో ఆయన ఎక్స్‌డాట్‌కామ్ పేరిట ఆన్‌లైన్ ఆర్థిక సేవల సంస్థను స్టార్టప్‌గా ప్రారంభించారు. అదే నేడు పేపాల్‌గా మారింది. మస్క్ రాకెట్ కంపెనీ అయిన స్పేస్ ఎక్స్‌ప్లొరేషన్ టెక్నాలజీస్ కార్పొరేషన్‌ను సాధారణంగా స్పేస్‌ఎక్స్‌గా వ్యవహరిస్తుంటారు.

టర్మ్ లోన్‌పై బైజూస్‌కు ఊరట

సవరణకు రుణదాతల కమిటీ ఓకే..

న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్‌కు టర్మ్ లోన్ విషయంలో కాస్త ఊరట లభించింది. 1.2 బిలియన్ డాలర్ల రుణ నిబంధనలను సవరించేందుకు రుణదాతల కమిటీ అంగీకరించింది. సవరణ విజయవంతంగా అమలైతే లోన్‌ను బైజూస్ మరింత వేగవంతంగా తీర్చాల్సిన అవసరం, లిటిగేషన్‌లో చిక్కుకునే అవకాశాలు తప్పినట్లవుతుందని కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగస్టు 3 నాటికి ఈ సవరణకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు వివరించింది. బైజూస్ తీసుకున్న 1.2 బిలియన్ డాలర్ల రుణంలో ఈ కమిటీలోని సంస్థల వాటా 85 శాతం పైచిలుకు ఉంది. ఈ రుణ చెల్లింపులను వేగవంతం చేయాలని డిమాండ్ చేయడం, వివాదం కారణంగా మొత్తానికే కట్టబోమంటూ బైజూస్ నిరాకరించడం ప్రతిష్టంభనకు దారి తీసింది.

టాటా స్టీల్ లాభం నేలచూపు

- క్యూ1లో రూ. 525 కోట్లు
- ఆదాయం రూ. 60,666 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 93 శాతంపైగా క్షీణించి రూ. 525 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,714 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 63,698 కోట్ల నుంచి రూ. 60,666 కోట్లకు బలహీనపడింది. ఇది 5 శాతం తక్కువకాగా.. మొత్తం వ్యయాలు మాత్రం రూ. 51,912 కోట్ల నుంచి రూ. 58,553 కోట్లకు పెరిగాయి. జూన్‌కల్లా నికర రుణ భారం రూ. 71,397 కోట్లకు చేరగా.. రూ. 30,569 కోట్లతో పటిష్ట లిక్విడిటీని సాధించినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్‌ను 2023 సెప్టెంబర్ 19 నుంచి తిరిగి ఐదేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించేందుకు బోర్డు ఎంపిక చేసినట్లు టాటా స్టీల్ వెల్లడించింది. పూర్తి ఏడాదిలో దేశ, విదేశీ కార్యకలాపాలపై రూ. 16,000 కోట్లు వెచ్చించే ప్రణాళికల్లో ఉంది. 5 ఎంటీ వార్షిక సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న కళింగనగర్ ప్లాంటు విస్తరణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం క్షీణించి రూ. 116 దిగువన ముగిసింది.

బీవైడీ, మేఘా ప్రతిపాదనకు కేంద్రం నో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఉన్న చైనా దిగ్గజం బీవైడీ, హైదరాబాద్‌కు చెందిన మౌలిక రంగ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) సంయుక్తంగా ఏర్పాటు చేయతలపెట్టిన ప్రతిపాదిత ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి బ్రేకులు పడ్డాయి. తెలంగాణలో సుమారు రూ. 8,200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పాలని ఇరు సంస్థలు భావించిన సంగతి తెలిసిందే. బీవైడీ, మేఘా ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది.

జీఎంఆర్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీకి రూ.7,593 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. దీని విలువ రూ. 7,593 కోట్లు అని జీఎంఆర్ పవర్, అర్బన్ ఇన్‌ఫ్రా ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన యూపీలో 75.69 లక్షల ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

డాక్టర్ ష్నైడర్ కంపెనీల ఆస్తులు సంవర్ధన మదర్సన్‌కు

డీల్ విలువ రూ.1,070 కోట్లు



న్యూఢిల్లీ: వాహన విడిభాగాల తయారీలో ఉన్న సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ తాజాగా జర్మనీకి చెందిన డాక్టర్ ష్నైడర్ గ్రూప్ సంస్థల ఆస్తులు, వాటాలను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. డీల్ విలువ సుమారు రూ.1,070 కోట్లు. ఎయిర్ వెంట్స్, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ ఇంటీరియర్ పాలిమర్ విడిభాగాలు, స్మార్ట్ సర్ఫేస్, లైటింగ్ మాడ్యూల్స్ వంటి సిస్టమ్స్ తయారీలో డాక్టర్ ష్నైడర్ గ్రూప్ నిమగ్నమైంది. 200లకుపైగా పేటెంట్లు కంపెనీ సొంతం. 90 శాతంపైగా ఉత్పత్తులు జర్మనీలోని పరిశోధన, అభివృద్ధి కేంద్రంలో రూపుదిద్దుకుంటున్నాయి. 240 మంది ఇంజనీర్లు దీనికోసం పనిచేస్తున్నారు.

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు

- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 299 పాయింట్లు
- 19,700 దిగువకు నిఫ్టీ



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లలో అమ్మకాలు చోటు చేసుకోవడంతో సూచీలు రెండోరోజూ నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీ ప్రకటన ముందు అప్రమత్తత అంశాలూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. సెన్సెక్స్ 55 పాయింట్ల నష్టంతో 66,629 వద్ద, నిఫ్టీ మూడు పాయింట్ల స్వల్ప లాభంతో 19,748 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూలాంశాల నేపథ్యంలో సూచీలు రోజంతా బలహీనంగా కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 358 పాయింట్లు క్షీణించి 66,326 వద్ద, నిఫ్టీ 87 పాయింట్లు పతనమై 19,658 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 299 పాయింట్లు నష్టపోయి 66,385 వద్ద ముగిసింది. నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 19,672 వద్ద స్థిరపడింది. గతవారంలో విడుదలైన ఐటీ, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల జూన్ క్వార్టర్ ఫలితాలు నిరాశపరచడంతో ఈ రంగ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలోనూ అమ్మకాలు తలెత్తాయి. బ్యాంకింగ్ షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. ఫార్మా, రియల్టీ, ఆటో షేర్లకు డిమాండ్ నెలకొనడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు వరుసగా 0.30%, 0.10 శాతం చొప్పున లాభపడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- క్యూ1 నికర లాభం 11% క్షీణించడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2% నష్టపోయి రూ.2,488 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 2.50% క్షీణించి రూ.2469 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- హోటల్స్ వ్యాపార విభాగాన్ని ప్రత్యేక అనుబంధ సంస్థ ఐటీసీ హోటల్స్ కింద విడదీసేందుకు బోర్డు ఆమోదం తెలపడంతో ఐటీసీ షేరు 4% నష్టపోయి రూ.471 వద్ద ముగిసింది.
- కోటక్ మహీంద్రా బ్యాంకు 4% నష్టపోయి రూ.1,896 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎస్‌సీ-ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్‌లో 1876 ఎస్ఐ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఢిల్లీ పోలీసు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లో.. సబ్–ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) నియామక పరీక్ష–2023కు సంబంధించి నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్ష ద్వారా ఢిల్లీ పోలీసు విభాగంతోపాటు కేంద్ర సాయుధ బలగాలైన(సీఏపీఎఫ్) బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీలో సబ్–ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1876
» **పోస్టుల వివరాలు:** సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ)లో సబ్–ఇన్‌స్పెక్టర్(జీడీ) –1714, ఢిల్లీ పోలీసు విభాగంలో సబ్–ఇన్‌స్పెక్టర్(ఎగ్జిక్యూటివ్)–పురుషులు/మహిళలు–162.
» **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** సీబీటీ రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష(పీఈటీ)/ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(సీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.08.2023.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 16.08.2023 నుంచి 17.08.2023 వరకు.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** అక్టోబర్ 2023
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ఆంధ్ర యూనివర్శిటీలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీ, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ(ఫుల్‌టైమ్) కోర్సుల్లో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

స్పెషలైజేషన్, సీట్ల వివరాలు

» ఎంబీఏ–మార్కెటింగ్ మేనేజ్‌మెంట్–44 సీట్లు; ఎంబీఏ–ఫైనాన్స్ మేనేజ్‌మెంట్–44 సీట్లు; ఎంబీఏ–హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్–44 సీట్లు; ఎంబీఏ–44 సీట్లు; ఎంసీఏ–50 సీట్లు.
» **కోర్సు అందించే కళాశాలలు:** ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం.
» **అర్హత:** 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఏపీఐసెట్–2023 ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్శిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద్దవాల్తేర్, విశాఖపట్నం.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **కౌన్సెలింగ్ తేది:** 27.07.2023.
» **వెబ్‌సైట్:** www.audoa.in

ఐఐటీ తిరుపతిలో ప్రాజెక్ట్ అసోసియేట్,ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ),తిరుపతి.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలపరిమితితో ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్(మెకానికల్)–01, ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఆర్కిటెక్ట్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు పీఏ పోస్టుకు రూ.22,000 నుంచి రూ.35,000, పీవో పోస్టుకు రూ.30,000 నుంచి 40,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** outsourcingrect@iittp.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** iittp.ac.in

ఐఐటీ తిరుపతిలో స్పోర్ట్స్ కోచ్, జిమ్ ట్రైనర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), తిరుపతి.. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలపరిమితితో స్పోర్ట్స్ కోచ్, జిమ్ ట్రైనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** స్పోర్ట్స్ కోచ్ (వాలీబాల్, చెస్)–02, జిమ్ ట్రైనర్–01.
» **అర్హత:** బీపీఈడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** sports@iittp.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** iittp.ac.in

ఇంటర్వ్యూలో విజయం ఇలా

» ఏపీపీఎస్సీ గ్రూప్ 1-2022 మెయిన్స్ ఫలితాలు విడుదల
» రెగ్యులర్, స్పోర్ట్స్ కోటా కలిపి 259 మంది ఇంటర్వ్యూకు ఎంపిక
» ఆగస్ట్ 2 నుంచి 11 వరకు ఇంటర్వ్యూలు
» విజేతలుగా నిలిస్తే.. రాష్ట్ర స్థాయిలో ఉన్నత కొలువు



ఏపీపీఎస్సీ గ్రూప్-1 సర్వీసెస్.. రాష్ట్ర స్థాయిలో ఆర్డీఓ, డీఎస్పీ, సీటీఓ తదితర ఉన్నత కొలువులకు మార్గం. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1(2022) ఎంపిక ప్రక్రియకు సంబంధించి తుది దశ ఇంటర్వ్యూలకు రంగం సిద్ధమైంది! గ్రూప్ 1 ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ పరీక్షల ఫలితాలను ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసింది. ఇంటర్వ్యూలను ఆగస్ట్ 2వ తేదీ నుంచి నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. వేల సంఖ్యలో పోటీని ఎదుర్కొని ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు.. చివరి దశలో చూపే ప్రతిభ అంతిమ విజయంలో నిర్ణయాత్మకం కానుంది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఇంటర్వ్యూలో విజయానికి నిపుణుల సలహాలు..

- **87,718:** ఏపీపీఎస్సీ గ్రూప్–1(2022) ప్రిలిమ్స్‌కు హాజరైన వారి సంఖ్య.
- **5,028:** ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు.
- **259:** మొత్తం 111 గ్రూప్ 1 పోస్టులకు నిర్వహించిన మెయిన్స్‌లోనూ విజయం సాధించి చివరి దశ ఇంటర్వ్యూకు అర్హత పొందిన వారు. వీరిలో 39 మంది స్పోర్ట్స్ కోటా నుంచి ఎంపికయ్యారు.
- గ్రూప్–1 ఎంపిక ప్రక్రియలో తొలి రెండు దశలైన ప్రిలిమ్స్, మెయిన్‌లో అభ్యర్థులు పుస్తక పరిజ్ఞానంతో విజయం సాధించే అవకాశం ఉంది. కాని ఇంటర్వ్యూ మాత్రం దీనికి భిన్నంగా ఉంటుంది. సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సామాజిక, ఆర్థిక, పాలన, జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహనతో బోర్డ్ రూమ్‌లో అడుగుపెట్టాలి అంటున్నారు నిపుణులు.

విభిన్న వ్యూహం

ఇంటర్వ్యూలో వ్యక్తిగత విషయాలతోపాటు, అకడమిక్ నేపథ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమకాలీన అంశాలపై అవగాహనను పరిశీలిస్తారు. కాబట్టి ఇంటర్వ్యూలో రాణించాలంటే.. భావ వ్యక్తీకరణ, సమాధానం చెప్పే తీరు, ఆలోచనల్లో స్పష్టత అవసరం.

సమకాలీన అవగాహన

గ్రూప్–1 స్థాయి అధికారిగా ఎంపికయ్యే అభ్యర్థులకు అవసరమైన సమస్యల పట్ల స్పందన, నిర్ణయ నేర్పు వంటి వాటిని ఇంటర్వ్యూలో పరిశీలిస్తారు. కాబట్టి అభ్యర్థులు ప్రధానంగా తాజా పరిణామాలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో కీలకంగా మారిన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఇంటర్వ్యూకు ప్రిపరేషన్‌లో అభివృద్ధి కారక అంశాలకు పెద్దపీట వేయాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలు–లబ్ధిదారులు తదితర విషయాలపై సంపూర్ణ పట్టు సాధించాలి.

వ్యక్తిగతం, వృత్తిగతం

గ్రూప్–1 ఇంటర్వ్యూలో.. వ్యక్తిగతం మొదలు వృత్తి నేపథ్యం వరకూ.. ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. అకడమిక్ నైపుణ్యాలను విధి నిర్వహణలో ఎలా అన్వయిస్తారో సమర్థంగా చెప్పగలిగేలా సన్నద్ధంగా ఉండాలి. ఇప్పటికే వేరే ఉద్యోగాలు చేస్తూ గ్రూప్–1 ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత కొలువులో తమ విధులు, సాధించిన ఫలితాలు, ప్రత్యేకంగా తీసుకున్న నిర్ణయాలు, అవి విధుల పరంగా ఉపయోగపడిన తీరు గురించి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అందుకు అనుగుణంగా సన్నద్ధమై ఇంటర్వ్యూకు వెళ్లాలి. ప్రభుత్వ ఉద్యోగి అయితే.. తాము పని చేస్తున్న శాఖల్లో అమలవుతున్న పథకాలు, తమ పరిధిలో వాటి అమలు తీరు, విధి నిర్వహణ పరంగా సదరు అభ్యర్థుల ప్రమేయం వంటి అంశాలకు సమాధానాలను సిద్ధం చేసుకోవాలి.

స్వీయ అభిప్రాయం

ఇంటర్వ్యూలో విజయానికి అభ్యర్థులు మెరుగుపరచుకోవాల్సిన మరో నైపుణ్యం.. స్వీయ అభిప్రాయాల వ్యక్తీకరణ. సహజంగా బోర్డ్ సభ్యులు.. ఆయా అంశాలపై అభ్యర్థుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. కాబట్టి సదరు విషయాలపై అభ్యర్థులు తమకంటూ ఒక స్పష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. అందుకోసం దిన పత్రికలను చదవాలి. వాటిలోని ఎడిటోరియల్స్‌ను, ఆయా విషయాలపై ప్రముఖుల విశ్లేషణలను చదవడతోపాటు వాటిపై తమ సొంతం అభిప్రాయాల్ని సిద్ధం చేసుకోవాలి. బోర్డు సభ్యులను మెప్పించాలంటే.. ప్రతి అంశంపైనా స్వీయ అభిప్రాయంతోపాటు విశ్లేషించే నైపుణ్యం ఉండాలి.

నిర్ణయ సామర్థ్యం

- గ్రూప్–1 ఇంటర్వ్యూలో అభ్యర్థుల్లోని డెసిషన్ మేకింగ్ స్కిల్స్‌ను కూడా పరిశీలిస్తారు. గ్రూప్–1 స్థాయి అధికారిగా ఏదైనా సమస్య ఎదురైతే ఎలా స్పందిస్తారు? సదరు నిర్ణయం తీసుకోవడానికి సహేతుక కారణాలను వివరించే నేర్పు కూడా ఉండాలి.
- ఇంటర్వ్యూ సమయంలో ఎదురయ్యే ప్రశ్నలకు సానుకూల దృక్పథంతో సమాధానాలు ఇచ్చే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రశ్నలు ఎదురైనప్పుడు నిర్మాణాత్మక దృక్పథంతో విశ్లేషించగలగాలి.

బోర్డ్ సభ్యులకు అభివాదం

ఇంటర్వ్యూ బోర్డ్‌లో సాధారణంగా ఒక చైర్మన్, నలుగురు లేదా అయిదుగురు సభ్యులు ఉంటారు. బోర్డ్ రూమ్‌లోకి అడుగుపెట్టిన అభ్యర్థులు ముందుగా చైర్మన్‌కు అభివాదం చేస్తూ.. మిగతా సభ్యులకు కూడా అభివాదం చేయాలి. అదే విధంగా సమాధానాలు ఇచ్చే సమయంలోనూ ప్రశ్న అడిగిన బోర్డ్ సభ్యుడినే చూస్తూ చెప్పకుండా.. మిగతా వారికి కూడా ఆ సమాధానం చెబుతున్నట్లుగా వ్యవహరించాలి. అందరితో ఐ కాంటాక్ట్‌ను కొనసాగించడం అలవర్చుకోవాలి.

హావ, భావాలు

ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలు ఇచ్చేటప్పుడు అభ్యర్థులు తమ హావ, భావాలపై నియంత్రణ పాటించాలి. ముఖ్యంగా ముఖ కవళికలు, అనవసరంగా కాళ్లు, చేతులు కదిలించడం వంటివి చేయకూడదు. అదే విధంగా సీట్లో బిడియంగా కూర్చుని సమాధానం ఇవ్వడం కూడా సరికాదు. దీంతోపాటు ఇంటర్వ్యూ బోర్డ్ సభ్యుల ముందు వినమ్రంగా వ్యవహరించడం అవసరం.

చర్చకు ఆస్కారం

గ్రూప్–1 ఇంటర్వ్యూలో కొన్ని సందర్భాల్లో అడిగిన ప్రశ్నకు నేరుగా జవాబు చెప్పడంతోనే ముగియకుండా..దానికి కొనసాగింపుగా అనుబంధ ప్రశ్నలు, బోర్డ్ సభ్యుల అభిప్రాయాలతో కలిసి చర్చగా మారే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు సదరు అంశంపై లోతైన అవగాహన లేకపోతే ఇబ్బందిగా మారుతుంది. నిజాయతీగా తమకు తెలిసినంత వరకు చెప్పి.. మిగతా విషయాలు తెలియవని అంగీకరించాలి. అలా కాకుండా తాము చెప్పిందే కరెక్ట్ అనే రీతిలో వాదనకు దిగితే.. ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ఆస్కారముంది.

సమాజ సేవకోసం

గ్రూప్–1 స్థాయి పోస్ట్‌ల ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు.. తాము ఆ పోస్ట్‌లకు ఎలా సరితూగుతాం, విధుల నిర్వహణ క్రమంలో తమకున్న లక్షణాలు ఏంటి.. అనే ప్రశ్నలు సంధించుకొని.. ఇంటర్వ్యూకు సన్నద్ధమవ్వాలి. ఇలాంటి ప్రశ్నలు బోర్డు అడిగినప్పుడు.. చాలామంది సమాజ సేవ కోసం అంటూ జవాబిస్తారు. ఈ సమాధానం చెబుతూనే.. అప్పటి వరకు తాము వృత్తి పరంగా పొందిన అనుభవం, లేదా సమకాలీన అంశాలపై తమకున్న అవగాహన ద్వారా విధి నిర్వహణలో సమర్థంగా వ్యవహరిస్తామనేలా సమాధానం చెప్పాలి.

ఎంట్రీ నుంచి ఎగ్జిట్ వరకు

ఇంటర్వ్యూ రూమ్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి బయటికి వచ్చే వరకూ.. హుందాగా, వినమ్రంగా వ్యవహరించాలి. ముందుగా డోర్ నాక్ చేసి.. బోర్డ్ సభ్యుల అనుమతి తీసుకున్నాకే గదిలోకి వెళ్లాలి. అందరినీ చూస్తూ విష్ చేయడం మరవొద్దు. తర్వాత బోర్డ్ సభ్యులు ఆఫర్ చేసే వరకు సీటులో కూర్చోవద్దు. ఇక సీట్లో కూర్చుకున్నాక.. తాము కూర్చునే శైలి కూడా హుందాగా ఉండేలా చూసుకోవాలి. నిటారుగా కూర్చోవాలి. ఇందులోనే సగం ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. ఎదురుగా ఉన్న టేబుల్‌పై చేతులు పెట్టడం వంటివి చేయకూడదు. ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత బోర్డ్ సభ్యులందరికీ ఆపాదించేలా ధన్యవాదాలు తెలుపుతూ బయటికి రావాలి.

పేపర్ రీడింగ్ మస్ట్

ఇంటర్వ్యూకు హాజరయ్యే రోజు దినపత్రికలను చదవాలి. గతంలో చాలా సందర్భాల్లో పలువురు అభ్యర్థులకు 'ఈ రోజు న్యూస్ పేపర్లో మీరు ప్రాధాన్యంగా భావించిన వార్తలు ఏవి?' లేదా 'ఈ రోజు ఫలానా వార్తా కథనంలో పేర్కొన్న అంశాలపై మీ అభిప్రాయం ఏంటి?' వంటి ప్రశ్నలు సైతం ఎదురయ్యాయి. కాబట్టి ఇంటర్వ్యూ రోజు కనీసం ఒక తెలుగు దిన పత్రిక, ఇంగ్లిష్ దినపత్రిక చదవాలి. అంతేకాకుండా వాటిల్లోని ముఖ్యమైన అంశాలను గుర్తించుకోవాలి.

75 మార్కులే కానీ

ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 75. మెయిన్స్ మార్కులతో పోలిస్తే ఇవి తక్కువగానే కనిపిస్తుండొచ్చు. కానీ గత ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే.. మెయిన్స్‌లో మంచి మార్కులు వచ్చినా.. ఇంటర్వ్యూలో సరైన మార్కులు రాక అవకాశం చేజార్చుకున్న వారెందరో ఉన్నారు. కాబట్టి ప్రతి మార్కు కీలకంగా నిలిచే గ్రూప్1 ఎంపిక ప్రక్రియలో.. ఇంటర్వ్యూలోనూ అత్యుత్తమ ప్రదర్శన చూపేలా సన్నద్ధమవ్వాలి.

వీధుల్లో హరీశ్.. విధుల్లో శెభాష్



నర్సాపూర్ చౌరస్తాలో చెత్తను ఏరుతున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటలో చెత్త ఏరిన మంత్రి

సాక్షి, సిద్దిపేట: ఆయన అధికార పార్టీలో కీలకనేత.. పైగా రాష్ట్రమంత్రి.. నిత్యం అధికారిక కార్యక్రమాలు.. పర్యటనలతో బిజీబిజీగా ఉండే ఆయన స్వయంగా వీధివీధిన నడుస్తూ చెత్త ఏరుతూ, సంచిలో వేసుకుంటూ ముందుకు సాగారు. పరిసరాల పరిశుభ్రత – పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించే 'నడుస్తూ చెత్త ఏరివేత'కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ఆయన ఎవరో కాదు.. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు. సిద్దిపేట మున్సిపాలిటీ స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా నడుస్తూ చెత్త ఏరివేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పట్టణంలోని 18వ వార్డులో సోమవారం ఉదయం మంత్రి పర్యటించారు. ఆయన వీధివీధినా తిరుగుతూ రోడ్డు పక్కన కనిపించిన చెత్తను స్వయంగా తీసి సంచిలో వేసుకుంటూ ముందుకు వెళ్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం బాగుంటుందంటూ పట్టణవాసులకు సూచించారు. మురుగుకాల్వల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, చాయ్ గ్లాసులు, శానిటరీ వేస్ట్‌ను స్వయంగా మంత్రి హరీశ్ చేతితో తీసి సంచీలో వేశారు. స్థానికులకు, అధికారులు, సిబ్బందిలో స్ఫూర్తి నింపుతూ ఆదర్శంగా నిలిచారని పలువురు కొనియాడారు.

పరివార్ ఫుడ్ ఎక్స్‌ప్రెస్

- ట్రైన్‌లో కూర్చొని భోజనం చేసిన అనుభూతి
- కాచిగూడ స్టేషన్‌లో ట్రైన్ రెస్టారెంట్ అందుబాటులోకి...



సాక్షి, హైదరాబాద్/కాచిగూడ: ట్రైన్‌లో కూర్చొని భోజనం చేస్తున్న అనుభూతిని నగరవాసులు ఇకనుంచి ఫీల్ కావొచ్చు. ప్రస్తుతం సిటీలో అందుబాటులో ఉన్న జైల్‌మండి, రైల్ మండి తరహాలో కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పరివార్ ఫుడ్ ఎక్స్‌ప్రెస్ పేరిట ట్రైన్ రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చింది. 24 గంటలూ ఈ రెస్టారెంట్‌లో సేవలు అందుబాటులో ఉంటాయి. రెండు కోచ్‌లతో ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేయగా, ఇందులో సుమారు 120మంది వరకూ కూర్చోవచ్చు. కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ 'థీమ్ హోటల్'తో రైల్వేస్టేషన్‌కు మరింత అందం సంతరించింది. తెలంగాణలోనే ఇది మొట్టమొదటిసారి రైల్వే కోచ్‌లలో ఏర్పాటు చేసిన హోటల్ కావడం విశేషం. ఐదు సంవత్సరాల కాలపరిమితి కోసం సికింద్రాబాద్‌కు చెందిన మెస్సర్స్ పరివార్స్ హావ్ మోర్‌కు ఈ రెస్టారెంట్ కోచ్‌లను లీజ్‌కు ఇచ్చారు.

బంగారు వర్ణంతో కోచ్‌ల అలంకరణ


నిజాంకాలంనాటి ఈ హెరిటేజ్ కోచ్‌లను బంగారు వర్ణంతో అందంగా అలంకరించారు. హైదరాబాద్ బిర్యానీతోపాటు, ఉత్తర, దక్షిణాది, చైనీస్, మొఘలాయ్‌లాంటి బహుళ వంటకాల ఎంపికలతో కూడిన ఈ రెస్టారెంట్ భోజనప్రియులను ఎంతో ఆకట్టుకుంటుందని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ డివిజన్ అధికారుల కృషిని అభినందించారు.

పుట్టగొడుగు.. నీలి రంగులో





కాగజ్‌నగర్ రూరల్: కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని వేంపల్లి సెక్షన్ అడవుల్లో నీలి పుట్టగొడుగులను గుర్తించారు. ఈ విషయాన్ని సీనియర్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ మోహన్ పర్గేయిన్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఈ నీలి పుట్టగొడుగులకు న్యూజిలాండ్ పుట్టినిల్లుగా చెబుతారు. ఆ దేశపు కరెన్సీపై ఈ పుట్టగొడుగుల చిహ్నం ఉంటుంది. తెలంగాణలో నీలి పుట్టగొడుగులను గుర్తించడం ఇదే మొదటిసారి. కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ 287 రకాల పక్షులు, పులుల సంచారం, రాబందులకు స్థావరం కాగా, నీలి పుట్టగొడుగులను గుర్తించడంతో మరోసారి ప్రత్యేకతను చాటుకుంది.



ఉత్పాదకతకు ఊపు!

కంచర్ల యాదగిరిరెడ్డి

హోంవర్క్ పూర్తి చేసేది ఎట్లా?... చాట్ జీపీటీ ఉందిగా!
ఇంటి డిజైన్ కావాలి... సివిల్ ఇంజనీర్‌ను సంప్రదించడం ఎలా?
దానికి బయటకు వెళ్లాల్సిన పనే లేదు. మేకిట్. ఏఐ వాడితే సరి!

అదండీ విషయం...ఈ రోజుల్లో మీకు ఏం కావాలన్నా క్షణంలో సమాచారంతో పాటు మీకు కావాల్సింది ఇచ్చే జనరేటివ్ ఏఐ అప్లికేషన్లు పుట్టుకొచ్చేశాయి. ఏడాది క్రితం చాట్ జీపీటీ విడుదలతో మొదలైన కృత్రిమ మేధ (ఏఐ) అప్లికేషన్లు ఇప్పుడు ఓ ప్రభంజనంలా మారిపోయాయి. జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్ల వాడకం వల్ల ఉత్పాదకత పెరుగుతుందని, అమ్మకాలు ఎక్కువవుతాయని, సాధారణ వినియోగదారులకూ లాభమని అంటున్నారు. బాగానే ఉంది కానీ, ఇది ఎంతవరకూ నిజం? వాటికంటూ విలువ కట్టగలమా? అవును అంటోంది అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ మెకిన్సే! భవిష్యత్తులో జనరేటివ్ ఏఐ కారణంగా ప్రపంచ వాణిజ్యానికి ఏటా కనీసం 2.6 లక్షల కోట్ల నుంచి 4.4 లక్షల కోట్ల డాలర్ల వరకూ లబ్ధి చేకూరనుందని తెలిపింది.

బ్యాంకింగ్, జీవశాస్త్రాల్లో ఎక్కువ ప్రభావం!

లక్షల కోట్ల మాట కాసేపు పక్కన పెడితే జనరేటివ్ ఏఐ అప్లికేషన్లకు అన్ని రంగాల్లోనూ చొచ్చుకుపోయే సామర్థ్యం ఉంది. అయితే బ్యాంకింగ్, జీవశాస్త్రాల్లో కాస్త ఎక్కువ ప్రభావం ఉంటుందని మెకిన్సే అంచనా వేసింది. ఒక్క బ్యాంకింగ్ రంగంలోనే ఈ సాఫ్ట్‌వేర్ల వాడకం వల్ల ఉత్పాదకత పెరిగి ఏటా రూ.16 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకూ లాభం చేకూరుతుందని తేలింది. ఇక రిటైల్, కన్స్యూమర్ ప్యాకేజ్డ్ గూడ్స్‌లలో జనరేటివ్ ఏఐని పూర్తిస్థాయిలో వాడితే కలిగే లాభం రూ.60 వేల కోట్లకు పైమాటే. ఇక ఈ కృత్రిమ మేధ వాడకం కేవలం లాభాలకు మాత్రమే పరిమితం కాదు. చేసే పని తీరుతెన్నులు కూడా మారిపోతాయి. ఒక వ్యక్తి చాలా సాధారణంగా చేసే పనులన్నింటినీ ఆటోమేట్ చేయడం ద్వారా ఏఐ వారి ఉత్పాదకతను పెంచుతుంది. మెకిన్సే లెక్కల ప్రకారం మనుషులు చేసే వాటిల్లో 60 నుంచి 70 శాతం పనులను ఏఐలు ఆటోమేటిక్‌గా చేయగలవు. చాట్ జీపీటీ లాంటి వాటికి భాషను అర్థం చేసుకోగల సామర్థ్యం కూడా ఉండటం వల్ల బోధన వంటి పనులకు బాగా ఉపయోగపడుతుందని అంచనా.

చాలావరకు పనులు ఆటోమేటిక్‌గా..

జనరేటివ్ ఏఐ మొదలై ఏడాది కూడా కాలేదు. మరి ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో ప్రభావం ఎలా చూపగలదన్న ప్రశ్న ఉత్పన్నం కావడం సహజం. మెకిన్సే అంచనా ప్రకారం ఇవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేందుకు ఇంకా కొంత సమయం పట్టవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటినుంచే వేగం పుంజుకుంటుందని 2030- 2060 మధ్యకాలంలో చాలావరకు పనులు ఆటోమేటిక్‌గా అయిపోతాయని చెబుతోంది. ఇప్పుడు చేస్తున్న పనుల్లో సగం 2030 నాటికల్లా ఆటోమేటిక్ అవుతాయని తెలిపింది. మునుపటి అంచనాల కంటే ఇది పదేళ్లు తక్కువ కావడం గమనార్హం. కార్మికుల ఉత్పాదకత విషయానికి వస్తే 2040 నాటికి ఇది ఏటా 0.1 -0.6 శాతం పెరుగుతుందని కాకపోతే చేసే పనులు మారిపోతాయి కాబట్టి ఆ మార్పునకు అనుగుణంగా కార్మికులు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకునేందుకు సాయం అందించాల్సి ఉంటుందని మెకిన్సే తెలిపింది. ఒకవేళ అన్ని రంగాల్లోనూ జనరేటివ్ ఏఐ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే మాత్రం పనుల ఆటోమేషన్ వల్ల ఉత్పాదకత 0.2 -3.3 శాతం వరకు పెరుగుతుంది.



ఈ రంగాల్లో లాభాలెక్కువ

జనరేటివ్ ఏఐతో అన్ని రంగాల్లోనూ ఉత్పాదకత పెరుగుతుంది. తద్వారా లాభాలూ పెరుగుతాయి. కానీ.. వినియోగదారుల వ్యవహారాలు, మార్కెటింగ్, సేల్స్ రంగాలతో పాటు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, జీవశాస్త్రాల్లో ఇవి మరింత ఎక్కువగా ఉండనున్నాయి. మెకిన్సే జరిపిన సర్వే ప్రకారం ఐదు వేల మంది సేల్స్ సర్వీస్ ఉద్యోగులున్న కంపెనీలో జనరేటివ్ ఏఐ వాడకంతో ఒక్కో వినియోగదారుడి సమస్యను పరిష్కరించేందుకు పట్టే సమయం దాదాపుగా 10 శాతం తగ్గింది. కంపెనీ మొత్తమ్మీద చూస్తే గంటకు 14 శాతం ఎక్కువగా వినియోగదారుల సమస్యలు పరిష్కారమయ్యాయి. అలాగే 'మీ మేనేజర్‌ను పిలవండి..'అన్న ఫిర్యాదులు 25 శాతం వరకూ తగ్గిపోయాయి. వినియోగదారుల డిమాండ్లు, పనిఒత్తిళ్ల కారణంగా ఉద్యోగాలు మానేయడం కూడా తగ్గినట్లు ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. ఇక మార్కెటింగ్, సేల్స్ రంగాల విషయానికి వస్తే జనరేటివ్ ఏఐ వినియోగంతో ఖర్చులు సగానికి సగం తగ్గడం మాత్రమే కాకుండా అమ్మకాలు పదిరెట్లు పెరుగుతాయి. మార్కెటింగ్‌కు అవసరమైన సమాచారాన్ని వేగంగా సృష్టించడం, ప్రాంతాలకు, ఒక్కో వినియోగదారుడికి తగిన విధంగా మార్చడం కూడా ఈ జనరేటివ్ ఏఐతో సాధ్యమవుతుందని, భాషల అంతరం తొలగిపోయి ఎవరికి కావల్సిన భాషలో సమాచారం ఈమెయిళ్ల రూపంలో ఠకీమని పంపవచ్చునని మెకిన్సే చెబుతోంది. జనరేటివ్ ఏఐకి ఉన్న మరో సామర్థ్యం సాఫ్ట్‌వేర్ కోడ్ రాయగలగడం. దీనివల్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేసే చిన్నచిన్న పనులను వేగంగా, తక్కువ ఖర్చుతో పూర్తిచేయవచ్చు. సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, క్వాలిటీ, బగ్స్ ను తొలగించడం వంటివి సులువైపోతాయి. చివరగా పరిశోధనలకు ఫార్మా వైద్యం వంటి రంగాలకు జనరేటివ్ ఏఐ ఎంతో ఉపయోగకరం. ఈ రంగానికి ఏటా రూ.25 వేల కోట్ల విలువను జోడించగల సామర్థ్యం దీనికి ఉంది.

అమెరికాలో పెరుగుతున్న చాట్ జీపీటీ వాడకం

అమెరికాలో చాట్ జీపీటీ వాడకం ఊపందుకుంటోంది. స్టాటిస్టా జరిపిన సర్వే ప్రకారం జనవరిలో సొంత అవసరాల కోసం ఈ జనరేటివ్ ఏఐని వాడామని 12 శాతం మంది చెప్పగా, ఇతరులు వాడటం చూశామని 38 శాతం మంది చెప్పారు. సర్వేలో పాల్గొన్న వారిలో 43 శాతం మంది మహిళలు మాత్రం తాము చాట్ జీపీటీ గురించి అస్సలు వినలేదని చెప్పారు.

2030 నాటికి రెండు లక్షల కోట్ల డాలర్ల మార్కెట్

- నెక్స్ట్ మూవ్ స్ట్రాటజీ కన్సల్టింగ్ అంచనాల ప్రకారం 2030 నాటికి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ మార్కెట్ విలువ దాదాపుగా రెండు లక్షల కోట్ల డాలర్లు.
- హాలీవుడ్‌లో రచయితలు, డబ్బింగ్ ఆర్టిస్టులు వారం రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో తమ స్థానంలో ప్రొడక్షన్ కంపెనీలు జనరేటివ్ ఏఐలను వాడరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలకు అవసరమైన స్క్రిప్టులు రాయడం మొదలుకొని, మనుషులను పోలిన గొంతులను కూడా సృష్టించగలదీ జనరేటివ్ ఏఐ.
- స్నాప్‌చాట్ ఇప్పటికే యానిమేషన్ల కోసం జనరేటివ్ ఏఐని వాడటం మొదలుపెట్టగా.. ఆహార డెలివరీ సంస్థ స్విగ్గీ కూడా అదే బాట పట్టింది.
- ఓరియో బిస్కెట్లు తయారు చేసే సంస్థ సినీ నటుడు ఫర్హాన్ అక్తర్, జనరేటివ్ ఏఐల సాయంతో సరికొత్త వాణిజ్య ప్రకటనను సృష్టించింది.

అప్పు తీసుకున్న వ్యక్తి తల్లిని బంధించి..

జగిత్యాల జిల్లా ఆత్మకూర్‌లో ఘటన



తాళం వేసిన సందీప్ ఇల్లు

కోరుట్ల: తీసుకున్న అప్పుపై వడ్డీ కట్టక జాప్యం చేస్తుండడంతో రుణం ఇచ్చిన వ్యక్తి కనీస మానవత్వం మరచి.. దాష్టీకం ప్రదర్శించిన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పుప్పాల సందీప్ అదే గ్రామానికి చెందిన ఏశవేని గణేశ్‌కు జరుపుల సాగర్ అనే వ్యక్తి నుంచి రూ.1,12,000ను గత మార్చిలో అప్పుగా ఇప్పించాడు. అప్పు పత్రం గణేశ్‌కు బదులు సందీప్ పేరు మీద రాసుకున్నాడు. ప్రతినెలా వడ్డీ కడుతూ వస్తున్న గణేశ్.. రెండునెలల నుంచి చెల్లించడం లేదు. దీంతో ఆగ్రహంతో సాగర్.. ఆదివారం సందీప్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో సందీప్ తల్లి ఒక్కరే ఉన్నారు. ఆమెను చంపుతానని బెదిరించి, బూతులు తిట్టి ఇంట్లో బంధించి తాళం వేశాడు. గమనించిన స్థానిక మహిళ మీరా.. సాగర్‌ను మందలించి తాళం తీసి బాధితురాలిని బయటకు తీసుకొచ్చింది. సందీప్ ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మోసగాడికి 'సైబర్' షాక్!

- రూ.25 లక్షలు లాటరీ తగిలిందంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడికి చుక్కలు చూపిన బ్యాంకు ఉద్యోగి
- నకిలీ ఓచర్లతో నమ్మించి దుండగుల ఫోన్ నంబర్లు, బ్యాంకు వివరాల సేకరణ



బ్యాంకు ఉద్యోగి స్క్రీన్‌షాట్ తీసిన సైబర్ నేరగాడి ఫొటో

జనగామ: అమాయక ప్రజలను బుట్టలో పడేస్తూ బ్యాంకు ఖాతాల నుంచి వేలు, లక్షల్లో ముంచేస్తున్న సైబర్ నేరగాళ్లను ఓ బ్యాంకు ఉద్యోగి ముప్పు తిప్పలు పెట్టాడు. వారు చెప్పినది చేస్తున్నట్టుగా నమ్మిస్తూ.. 'సైబర్'రూట్లోనే ఉదయం నుంచి రాత్రి దాకా ఓ ఆట ఆడించాడు. ఈ క్రమంలో సదరు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, వారు తమవిగా చెప్పుకొంటున్న ఫొటోలనూ సంపాదించాడు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది.

రూ.25 లక్షల లాటరీ తగిలిందని ఫోన్ రావడంతో..

జనగామలో ఓ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగికి సోమవారం ఒక ఫోన్ కాల్ వచ్చింది. అదే సమయంలో తన జియో ఫోన్ నంబర్‌ను మరో జియో నంబర్‌తో అనుసంధానం చేసేందుకు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) వచ్చింది (ఈ ఓటీపీ చెప్పేస్తే మన ఫోన్ నంబర్‌కు సంబంధించి కాల్స్, మెసేజీల డేటా అవతలి వారికి తెలిసిపోతుందన్నమాట). ఉద్యోగికి ఫోన్ చేసిన సైబర్ నేరగాడు.. రూ.25 లక్షలు లాటరీ తగిలిందని, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని అడిగాడు. దీనిపై అనుమానం వచ్చిన బ్యాంకు ఉద్యోగి.. సైబర్ నేరగాడిని ఓ ఆట ఆడుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన ఫోన్‌కు ఓటీపీ ఏదీ రాలేదని చెప్పాడు. తన లాటరీ సంగతి ఏమిటంటూ అనుమానం రాకుండా మాట్లాడాడు. దీంతో సైబర్ నేరగాడు గాలం వేయడానికి ప్రయత్నిస్తూ.. లాటరీ డబ్బు కావాలంటే తాను చెప్పిన నంబర్‌కు రూ.6 వేలు గూగుల్‌పే చేయాలన్నాడు. తనకు గూగుల్‌పే వంటివి లేవని ఉద్యోగి చెప్పడంతో.. సైబర్ నేరగాడు మహారాష్ట్రలోని ఓ బ్యాంకు ఖాతా నంబర్, ఇతర వివరాలు పంపాడు. ఉద్యోగి బ్యాంకు నుంచి రూ.2వేలు పంపినట్టుగా ఫేక్ ఓచర్ సిద్ధం చేసి సైబర్ నేరగాడికి వాట్సాప్ చేశాడు. మరో రూ.4 వేలు పంపాలని కోరగా మరో ఫేక్ ఓచర్‌ను పంపాడు. దీనిని నమ్మిన నేరగాడు.. మరిన్ని డబ్బులు లాగే ఉద్దేశంతో తాను బ్యాంకులో పనిచేస్తున్నట్టు యానిమేషన్‌తో తయారు చేసిన ఫొటోలను పంపాడు. తర్వాత అతడితోపాటు మరికొందరు సైబర్ నేరగాళ్లు.. 7986208101, 7777056493, +923106170098 నంబర్ల నుంచి సాధారణ కాల్స్, వాట్సాప్ వీడియో కాల్స్ చేశారు. ఉద్యోగి ఆ వీడియో కాల్స్‌లో మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల ముఖాలను స్క్రీన్ షాట్లు తీశాడు. ఈ ఘటన జనగామలో చర్చనీయాంశమైంది.

ఓటీపీలు చెప్పొద్దు

కొన్నేళ్లుగా సైబర్ నేరాలు పెరిగిపోయాయని.. ఎస్సెమ్మెస్‌లు, వాట్సాప్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పొద్దని సదరు బ్యాంకు ఉద్యోగి చెప్పారు. అయితే పలు కారణాల రీత్యా తన పేరు, వివరాలు బయటపెట్టవద్దని కోరారు.

నాన్‌కేడర్ ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా భారీగా నాన్‌కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 20 మంది అధికారులను బదిలీ చేస్తూ హోంశాఖ ఇంచార్జి ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే నూతన స్థానాల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

'సీఈఐఆర్' వినియోగంలో టాప్-2లో తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టార్) అప్లికేషన్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ టాప్-2లో ఉన్నట్లు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. 95 రోజుల్లో 4,083 మొబైల్ ఫోన్లను గుర్తించి వాటిని యజమానులకు అప్పగించినట్లు చెప్పారు.

శిబిరాల్లో..శిథిలాల్లా..!

దారుణ స్థితిలో మణిపూర్ హింస బాధితులు

- అక్కడి కాంగ్‌పోక్పి ప్రాంతంలో హైదరాబాద్ బృందం వైద్య సేవలు
- ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించి కాంగ్‌పోక్పి వెళ్లిన వైద్యుడు ప్రభుకుమార్ చల్లగాలి నేతృత్వంలోని బృందం
- అక్కడి సహాయ శిబిరాల్లో కుకీ తెగవాసులకు వైద్య సాయం



సాక్షి, హైదరాబాద్: దేశమంతా మణిపూర్ గురించే మాట్లాడుకుంటోంది. అక్కడి దారుణ పరిస్థితులపై ఆందోళన చెందుతోంది. కానీ కొందరు ప్రాణాలకు తెగించి, వ్యయ ప్రయాసలకు ఓర్చుకుని మరీ మణిపూర్‌లో బాధితులకు సాయం చేయడానికి ముందుకొస్తున్నారు. అలా మణిపూర్ వెళ్లి వైద్య సేవలు అందించిన వారిలో హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన ప్రముఖ వైద్యుడు చల్లగాలి ప్రభుకుమార్ ఒకరు. ప్రస్తుత పరిస్థితుల్లో మణిపూర్ వెళ్లడమంటే సాహసయాత్ర చేసినట్టేనని, అయినా సేవాభావంతో వెళ్లి వైద్య సేవలు అందించి వచ్చామని ఆయన 'సాక్షి'కి తెలిపారు. ప్రభుకుమార్ పంచుకున్న అనుభవాలు ఆయన మాటల్లోనే..

"గతంలో తెలుగు రాష్ట్రాల్లో వరదలు, తుపాన్లు వంటి వైపరీత్యాలు ఏర్పడిన చోట, గిరిజన ప్రాంతాల్లో తిరిగి విషజ్వరాలు, డెంగీ వంటివాటితో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య సేవలు, దుస్తులు అందించాం. ఇటీవల మణిపూర్‌లో ఘటనలను చూసినప్పుడు బాధ అనిపించింది. కొందరు ఉన్నతాధికారుల ద్వారా మణిపూర్‌లోని కాంగ్‌పోక్పిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని తెలిసింది. వెళ్లి బాధితులకు వైద్యసేవలు అందించాలని నిర్ణయించుకున్నా.. ఒంటరిగా వెళ్లడం సరికాదని, సామాజికవేత్త కుమార్, మరో 9 మందితో కలిపి సహాయక బృందాన్ని సిద్ధం చేశా. ఈ నెల మొదటి వారంలో సాహసోపేతమైన యాత్రకు శ్రీకారం చుట్టాం.

కొండంత భయాలను అధిగమించి..

హైదరాబాద్ నుంచి విమానంలో కోల్‌కతా మీదుగా నాగాలాండ్‌లోని డిమాపూర్‌కు చేరుకున్నాం. అక్కడ ఆహారం, మందులు, వస్త్రాలు, చెప్పులవంటివి కొన్నాం. అన్నింటినీ 2 ట్రక్కుల్లో వేసుకుని, వెనక మరో వాహనంలో మా బృందం బయలుదేరింది. మణిపూర్ ప్రవేశద్వారం సేనాపతి జిల్లాకు చేరుకోవడానికి ముందు సెచు, కోహిమా, జఖామా మారమ్ వంటి ప్రమాదకర పర్వత ప్రాంతాల మీదుగా ప్రయాణించాం. మార్గమధ్యలో రెండుసార్లు కొండచరియలు విరిగిపడి మా ప్రయాణం ఆలస్యమైంది. మా కళ్ల ముందే కొన్ని కార్లు ధ్వంసమై పలువురు మరణించారు. అయినా ధైర్యం కూడగట్టుకుని ముందుకు వెళ్లాం. సేనాపతి జిల్లాలో పోలీస్ క్లియరెన్స్ తీసుకోవాలి. కాంగ్‌పోక్పి ఎస్పీ మనోజ్ ప్రభాకరన్ వేగంగా అనుమతి ఇప్పించారు. మేం వెళ్లాల్సిన కాంగ్‌పోక్పి జిల్లాకు 7 కిలోమీటర్ల దూరంలోనే హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. ఓ సాయుధ కుకీ గ్యాంగ్ మాకు ఎదురుపడింది. అయితే మేం దక్షిణాదికి చెందినవాళ్లం కావడంతోపాటు సాయం చేయడానికి వచ్చామని వివరించి తప్పించుకోగలిగాం.

శిబిరాల్లో.. శిథిలాల్లా..!

కాంగ్‌పోక్పిలోని సహాయ శిబిరాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. హింసాత్మక ఘటనల్లో గాయాల పాలైన వారు, ఇళ్లు వదిలేసి పారిపోయి వచ్చినవారు శిబిరాల్లో శిథిలాల్లా కనిపించారు. అంతా ఇంఫాల్ నుంచి పారిపోయి వచ్చిన కుకీ తెగ జాతీయులు. ఒక్కో క్యాంప్‌లో 150 నుంచి 700 మందిదాకా ఉన్నారు. ఎడతెగని వానలు, అపరిశుభ్ర పరిస్థితులతో చాలా మంది అతిసారం, వైరల్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారు. మేం దాదాపుగా 15 రిలీఫ్ క్యాంపులు తిరిగాం. పిల్లలు శ్వాసకోశ వ్యాధులు, అజీర్ణం సమస్యలతో బాధపడుతున్నారు. డయాబెటిక్ పరికరాలతో పరీక్షలు చేస్తే.. ప్రమాదకర స్థాయిలో షుగర్ ఉన్నవారు చాలా మంది ఉన్నట్టు తేలింది. దీనితో 'యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్లు, యాంటాసిడ్లు, యాంటీ-డయాబెటిక్ యాంటీ హైపెర్టెన్సివ్ మందులు, పిల్లలకు న్యూట్రిషన్ పౌడర్లు వంటి వాటిని పంపిణీ చేశాం. హింసాకాండతో ఏర్పడిన ఆటంకాలతో.. కాంగ్‌పోక్పిలో వైద్య సామగ్రికి కరువు ఏర్పడింది. దీంతో మేం తీసుకెళ్లిన డయాబెటిక్ పరీక్ష యంత్రాలు, బీపీ యంత్రాలు వంటివాటిని తిరిగి వచ్చేటప్పుడు అక్కడే ఇచ్చేశాం. వైద్యం ఇప్పుడు వ్యాపారంలా మారినా.. వైపరీత్యాలు, అత్యవసర సమయాల్లో సేవలు అందిస్తే ఆత్మ సంతృప్తి కలుగుతుంది.'' అని ప్రభుకుమార్ చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.